ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
గురువారం 17 సెప్టెంబర్ 2026 సంపుటి: 1 సంచిక: 91 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## సౌదీకి హౌతీల మరో భారీ షాక్!

**అమెరికా ఎఫ్-15 జెట్ కూల్చివేత..!**



పశ్చిమాసియాలో సౌదీ అరేబియా–హౌతీల పోరు మరింత తీవ్రమవుతోంది. యెమెన్ లో ప్రభుత్వానికి సౌదీ అరేబియా మద్దతిస్తున్న నేపథ్యంలో.. అక్కడ రెబెల్స్ గా ఉన్న హౌతీలు ఎదురుదాడులకు దిగుతున్నారు.

**న్యూఢిల్లీ (సింగిడి):**

2




## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

**కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ**

2

# ఆనంద్.. మంచి కాఫీలాంటి ఆఫీసర్... కానీ?

## డిజిపి కొత్త ఆలోచనలు | శాఖలో పాత వాసనలు

**మార్పు కోసం పరితపిస్తున్న బాస్... అనుభవమే ఆయన బలం**

**మారుతున్న నేరసంస్కృతి.. డిపార్ట్మెంట్ వారిపై అనేక ఆరోపణలు.**

**ఇప్పటికే సోషల్ మీడియాలో చెడ్డపేరు... కింది స్థాయి నుండీ మారాలంటున్న సార్**

**ఆ ఒక్కరి ఆలోచనతో శాఖ తీరు మారుతుందా..?**

**మంచి కాఫీకి కాఫీ పొడి ఒక్కటే సరిపోదు. పాలు కావాలి...,చక్కెర కావాలి..., మంచి నీటితో పాటు అన్నీ సరైన మోతాదులో కలిసినప్పుడే కాఫీకి అసలైన రుచి వస్తుంది. తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కూడా మంచి కాఫీలాంటి ఆఫీసరే. అనుభవం ఉంది. దూకుడు ఉంది. కొత్తగా ఆలోచించే విధానం ఉంది. వ్యవస్థలో మార్పు తీసుకురావాలన్న తపన ఉంది.అయితే.. ఒక మంచి అధికారి ఆలోచనలతోనే మొత్తం పోలీస్ శాఖ మారిపోతుందా.. ఇదే ఇప్పుడు అసలు ప్రశ్న.**

(మోహన్ పూసాల)

*చామ వెంకట ఆనంద్... ఇలా చెప్తే ఎవరు వెంటనే గుర్తుపట్టరు. కానీ... 'సి. వి. ఆనంద్' అనగానే రాష్ట్రమంతా టక్కున గుర్తుపట్టేస్తుంది. రాష్ట్రానికే పెద్ద పోలీస్ బాస్ అయినప్పటికీ చెదరని చిరునవ్వు ఆయన సొంతం.*

**ఆనంద్ గురించి..**

ఆనంద్ తెలంగాణాకు చెందిన ఇండియన్ పోలీస్ సర్వీస్ అధికారి.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాలో పనిచేస్తున్నాడు. ఆయన గతంలో అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ గా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గా కూడా విధులు నిర్వహించాడు.

సి. వి. ఆనంద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో చేరాడు. ఇది ప్రొబేషనరీ ఐపిఎస్ అధికారులు పోలీసు సేవలో చేరడానికి ముందు వారికి శిక్షణ ఇస్తుంది.అకాడమీలో, ఆయన అథ్లెటిక్స్ లో రాణించి, ట్రాక్ అండ్ ఫీల్డ్ లో అనేక బంగారు పతకాలు గెలుచుకున్నాడు. ఆయన బిఎస్ఎఫ్ అకాడమీ 'బెస్ట్ ఫైరర్' గా కూడా ఎంపికయ్యాడు.

1993లో సి. వి. ఆనంద్ అదనపు పోలీసు సూపరింటెండెంట్ (అదనపు ఎస్పీ) వరంగల్ రూరల్ గా నియమించబడ్డాడు. ఆ తరువాత, ఆయన ఆదిలాబాద్ జిల్లాలోని బెల్లంపల్లికి అదనపు ఎస్పీగా వచ్చాడు. ఆ సమయంలో, మంచిర్యాల బొగ్గు మాఫియా సహా పలు ఎన్ కౌంటర్ లలో పాల్గొన్నాడు. లైవ్ ఎన్ కౌంటర్ గా దేశంలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీరాంపూర్ (రమాకాంత్) ఎన్ కౌంటర్ సందర్భంగా ఆయన ప్రస్తుత మంచిర్యాల జిల్లాలో విధులు నిర్వహించారు.పోలీసు సూపరింటెండెంట్ హోదాకు పదోన్నతి పొందిన ఆయన, నిజామాబాద్ జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. నక్సలైట్–మావోయిజం బాగా ఉన్న జిల్లాకు పోలీసు అధిపతిగా పలు కూంబింగ్ ఆపరేషన్లలో పాల్గొన్నారు.

నక్సల్స్ ఆయుధ సరఫరా చైన్ ను విచ్ఛిన్నం చేయడంతో పాటు యువతను నక్సల్స్ నుండి దూరం చేయడంలో కీలక పాత్ర పోషించారు.ఈ పదవీకాలంలో దక్షిణాఫ్రికాలో జరిగిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ హ్యూమన్ రైట్స్ పై అంతర్జాతీయ సమావేశానికి హాజరయ్యారు.కృష్ణా జిల్లా ఎస్పీగా కూడా అక్కడ ఆయన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడం ద్వారా పోలీసు బలగాలను ఆధునీకరించడానికి ప్రయత్నించారు.ఈ పదవీకాలానికి, అతనికి పోలీసు శౌర్య పతకం లభించింది. ఆ తర్వాత, సి.వి.ఆనంద్ ను హైదరాబాదుకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గా బదిలీ చేశారు.

2002లో హైదరాబాదు నగర పోలీసు పునర్వ్యవస్థీకరణ జరిగింది, సెంట్రల్ జోన్ సృష్టించబడింది. సెంట్రల్ జోన్ మొదటి డిసిపిగా ఆయన నియమితులయ్యారు.. ఈ పదవీకాలంలో, హుస్సేన్ సాగర్ చుట్టుపక్కల ఆయన లేక్ పోలీసులను ఏర్పాటు చేశాడు. సరస్సు చుట్టూ పోలీసులను ఏర్పాటు చేయడం వల్ల ఆత్మహత్యల సంఖ్య తగ్గింది. పోలీసు సిబ్బంది ప్రధాన విధులను చేసుకునేలా, ప్రైవేట్ సంస్థలకు కొన్ని విధులను అవుట్సోర్సింగ్ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.




దీనిని అన్ని పోలీస్ స్టేషన్లలో అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. ఈ విషయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ ఆయనను ప్రశంసించింది. ఒక, ఆయన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ (సిఐడి)కి బదిలీ అయ్యాడు. డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిఐజి) హోదాకు పదోన్నతి పొందిన తరువాత ఆయన సిఐడి ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఇఒడబ్ల్యు) ను చేపట్టాడు. ఆయన కృషితో కోఆపరేటివ్ బ్యాంక్ కుంభకోణాన్ని పరిష్కరించి, బ్యాంక్ చైర్మన్ అయిన థాయిలాండ్ నుండి కె. వెంకటేశ్వర రావు నుండి తిరిగి రప్పిచ్చాడు. ఆ తువాత, ఆయన ఎక్సైజ్ డైరెక్టర్ గా, ఆ తరువాత, ఆయన ఏలూరులో రేంజ్ డిఐజిగా నియమించబడ్డారు. ఈ రేంజ్ లో కృష్ణా, తూర్పు గోదావరి పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నాయి.

...మిగతా 2లో



## గణేశ్ నిమజ్జనంలో ఘోర విషాదం

2

### సంగారెడ్డి జిల్లాలో చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు దుర్మరణం

**మృతులంతా శిరీష అనాథాశ్రమానికి చెందినవారే**

**మృతదేహాలను పరిశీలించి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సంతాపం**

**పటాన్‌చెరులో అలుముకున్న విషాద ఛాయలు**

వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని పెదకంజర్ల గ్రామ శివారులో ఉన్న నేరేడు చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం ఒక్కసారిగా విషాదమయమైంది. మృతులంతా శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులుగా గుర్తించారు. శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులు గణేశ్ విగ్రహ నిమజ్జనం కోసం నేరేడు చెరువు వద్దకు వెళ్లారు. నిమజ్జనం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వారు ఒకరి తర్వాత ఒకరు నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సింగిడి)**

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

**రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ**



2

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోరుమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సింగిడి)**

## కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ



22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సింగిడి):**

2

**ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి**

**ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతాం**

**ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక**

**శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

**22ఏ భూములకు త్వరలో పరిష్కారం**

**22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం**

**పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం**

**పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం**

**క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి**

**ధరణి పేరిట గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది**

**రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది**

**బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ**




## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే

**రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు**

**తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ**

2




2

## దానం అనర్హతపై విచారణ వాయిదా

ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. దానం బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరటంపైన హైకోర్టులో దాఖలైన పిటీషన్ ను న్యాయస్థానం విచారణ చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ–ఫారంతో సికింద్రాబాద్ లోకసేభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో కీలకంగా మారింది.

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సింగిడి)**



### జీరం ఘాటీ నరమేధం కేసులో మరణశిక్ష

**10 మంది మావోయిస్టులకు శిక్ష విధిస్తూ చారిత్రక తీర్పు**

2

## ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

**భక్తుల అనుభూతిని పెంచేలా ఎక్స్ పీరియన్స్ సెంటర్**

**రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం**

**భక్తుల సౌకర్యార్థం 32 ఈవీ బస్సులు అందించిన రిలయన్స్, భారత్ బయోటెక్**

**తిరుమల వచ్చే భక్తులకు ఎల్ఐసీ ఆధ్వర్యంలో రూ.2 లక్షల బీమా**

**రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం: సీఎం చంద్రబాబు**




తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

**- తిరుమల, సెప్టెంబరు 16 (సింగిడి)**

## సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్

**పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తాం**

**సింగపూర్ ప్రతినిధులతో సీఎం కీలక భేటీ**

2



## బీఆర్ఎస్ నేతలతో సెటిల్మెంట్ కుదరలేదా?

**అందుకే ఇప్పుడు బయటపెడుతున్నారా?: బండి సంజయ్**

తెలంగాణలో 60శాతం జనాభాకు భూమి లేదు.. 25లక్షల కుటుంబాలకు ఇంటి స్థలం కూడా లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సింగిడి)**



2

## చంద్రబాబు హయాంలో రెడ్ బుక్ పాలన

**ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు మారింది**

**రాజకీయ కక్షసాధింపు కోసం ప్రభుత్వం మోసం**

**రాష్ట్రం, దేశం యొక్క ప్రతిష్టను దిగజార్చేలా ఉంది**

**ఎక్స వేదికగా మాజీ సీఎం వైఎస్ జగన్ ట్వీట్**

2



## గణేశ్ నిమజ్జనంలో
# ఘోర విషాదం

గజ ఈతగాళ్ల సహాయంతో గాలించి విద్యార్థుల మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనాథాశ్రమ నిర్వాహకులను పరామర్శించిన ఆయన, ఈ ఘటనపై తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతులను నర్సింహ రాజు, సుమంత్ (డిప్లొమా), గణేశ్ (డిప్లొమా), ఉదయ్ కిరణ్ (డిప్లొమా), శ్యామ్ కుమార్ (డిప్లొమా), సిద్ధార్థ్ (10వ తరగతి)గా గుర్తించారు. ఈ హృదయవిదారక ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

**రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# సౌదీకి హుతీల మరో భారీ షాక్..!

ఇదే క్రమంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్-మాండెబ్ ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తాజాగా ప్రకటించారు. తాజాగా మరో అడుగు ముందుకేసి సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కాపై డ్రోన్లు ప్రయోగించారు. అయితే వీటిని సౌదీ సమర్థంగా అడ్డుకుని మక్కాలో అలర్ట్ ప్రకటించింది. ఈ ఘటన చోటు చేసుకున్న కొద్ది గంటల్లోనే యెమెన్ గగనతలంపై ఎగురుతున్న సౌదీ ఎఫ్ 15 ఫైటర్ జెట్ ను కూల్చేసినట్లు హుతీలు ప్రకటించారు. మిత్రదేశం అమెరికా నుంచి తీసుకుని వాడుతున్న ఎఫ్15 ఫైటర్ జెట్ ను హుతీలు కూల్చేయడం తీవ్ర సంచలనం రేపుతోంది. నిన్న మొన్నటివరకూ హుతీల్ని యెమెన్ లో ఇరాన్ మద్దతు కలిగిన చిన్న రెబెల్ గ్రూప్ గా పరిగణించిన వారికి ఇప్పుడు వారి సత్తా తెలుస్తోంది. ఇరాన్ ఇచ్చిన క్షిపణులు, డ్రోన్లతో సౌదీ మీద హుతీలు చేస్తున్న యుద్ధం నిత్యం వార్తల్లో నిలుస్తోంది.యెమెన్‌లోని వివాదాస్పద మరిబ్ ప్రావిన్స్ గగనతలంలో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమానాన్ని విజయవంతంగా కూల్చివేసినట్లు హుతీ సైనిక దళాలు ప్రకటించాయి. తమ స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన ఉపరితలం నుండి గగనతలంలోకి దూసుకెళ్లే అత్యాధునిక క్షిపణి సహాయంతో ఈ విమానాన్ని నేలకూల్చినట్లు హుతీ ప్రతినిధి యాహ్యా సారీ తెలిపారు. అయితే హుతీల ఆరోపణలను సౌదీ అరేబియా ప్రభుత్వం ధ వీకరించలేదు. మక్కా నగరం తమకు అత్యంత పవిత్రమైనదని, దాని భద్రత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తి లేదని సౌదీ సంకీర్ణ దళాలు హెచ్చరించాయి. కాగా తాము పవిత్ర ఇస్లామిక క్షేత్రాలకు ఎలాంటి హాని తలపెట్టలేదని హుతీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

## ఓటుకు నోటు కేసులో
# దర్యాప్తు వేగవంతం

తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

## బీఆర్ఎస్ నేతలతో
# సెటిల్మెంట్ కుదరలేదా?

''ధరణి పేరుతో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా దోచుకున్నారని పాదయాత్ర సందర్భంగానే హెచ్చరించా. ఫామ్‌హౌస్ అక్రమాల గురించి మాట్లాడితే నా తల ఆరు ముక్కలుగా నరుకుతానని కేసీఆర్ అన్నారు. కేసీఆర్ నాకు వార్నింగ్ ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.. కేసీఆర్‌ను మెడపట్టి ఫామ్‌హౌస్ నుంచి బయటకు గుంజుకొచ్చిందే భాజపా. నన్ను బెదిరించే వారు ఈ భూమ్మీద పుట్టలేదు. తెలంగాణలో అధికారం మాకు రావాల్సింది.. త్రుటిలో తప్పి అటు పోయింది. ఎవరు.. ఎవరి మెడలు వంచారో తెలంగాణ ప్రజలకు తెలుసు. రాష్ట్రంలో వేల ఎకరాల భూమి కబ్జాకు గురైందని చెప్పడానికి ముఖ్యమంత్రికి వెయ్యి రోజులు పట్టిందా? ఇన్ని రోజులు డీల్ కుదరలేదా? బీఆర్ఎస్ నేతలతో సెటిల్మెంట్ కుదరనందుకు ఇప్పుడు బయటపెడుతున్నారా?'' అని బండి సంజయ్ ప్రశ్నించారు.

## చంద్రబాబు హయాంలో
# రెడ్ బుక్ పాలన

**ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు మారింది**

**రాజకీయ కక్షసాధింపు కోసం ప్రభుత్వం మోసం**

**రాష్ట్రం, దేశం యొక్క ప్రతిష్టను దిగజార్చేలా ఉంది**

**ఎక్స వేదికగా మాజీ సీఎం వైఎస్ జగన్ ట్వీట్**

**అమరావతి, సెప్టెంబర్ 16 (సింగిడి):**



ఏపీలో ఈ మధ్య సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వైఎస్సార్సీపీ నేతల పోస్టుల్ని పోలీసులు ఆయా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ కు మెయిల్స్ పెట్టి బ్లాక చేయిస్తున్నారు. ఇదే క్రమంలో తాజాగా వైసీపీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ పెట్టిన ఓ పోస్టును కూడా ఇలాగే పోలీసులు ఎక్స కు మెయిల్ పెట్టి బ్లాక చేయించారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. ఈ మెయిల్ లో వారు తమను తాము అమెరికా ఫెడరల్ దర్యాప్తు సంస్థ గా అభివర్ణించుకున్నారు. దీనిపై వైసీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్ ఇవాళ ఎక్స లో ట్వీట్ చేశారు. చంద్రబాబు హయాంలో "రెడ్ బుక్ పాలన" అంతర్జాతీయ స్థాయికి చేరిందని, ఇప్పుడు ఏకంగా ఆంధ్రప్రదేశ్ పోలీసులే ఎఫ్బీఐగా అవతారం ఎత్తారని, ఇది నకిలీ గుర్తింపు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు కూడా అని జగన్ విమర్శించారు. చంద్రబాబు గారూ, ఇది నిజమైన పోలీసింగ్ విధానమా లేక రాజకీయ కక్షసాధింపు కోసం ప్రభుత్వం చేస్తున్న మోసమా అని ప్రశ్నించారు. ఎక్స వేదికగా ఉన్న పోస్టులను తొలగించాలని కోరేటప్పుడు, మీ పోలీసు యంత్రాంగం తమను తాము అమెరికాకు చెందిన 'ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్' గా చెప్పుకోవడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇది మన రాష్ట్రం, దేశం యొక్క ప్రతిష్టను దిగజార్చేలా ఉందన్నారు. పోస్టులను తొలగించాలన్న అభ్యర్థన ఫీఎఫ్బీఐ నుండి కాకుండా, అధికారిక ఆంధ్రప్రదేశ్ పోలీసు ఈమెయిల్ అడ్రస్ నుండే వచ్చిందని ఎక్స ధ వీ కరించిందని పేర్కొన్నారు. అయినా ఆ అధికారి పంపిన సంస్థ పేరుగా ఎఫ్బీఐని పేర్కొన్నార న్నారు. ఈ తొలగింపు అభ్యర్థనను ఎవరు ఆదేశించారు ఎఫ్బీఐ గుర్తింపును ఎందుకు దుర్వినియోగం చేశారు మీ ప్రభుత్వంపై ప్రశ్నలు సంధిస్తున్న గొంతులను అణచివేయడానికి ఎక్స సంస్థను తప్పుదోవ పట్టించడానికి ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమా అని ప్రశ్నించారు. నెరవేరని 'సూపర్ సిక్స', 'సూపర్ సెవెన్' హామీలు, డీఎస్సీ స్కాం, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు, పాలనా వైఫల్యాలు , వేధింపులు వంటి అంశాలే ఇందుకు కారణమన్నారు. పోలీసు అనేది చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించినదని, మీ రాజకీయ సెన్సార్‌షిప్‌ను అమలు చేయడానికి కాదని జగన్ గుర్తుచేశారు. రాజకీయ కారణాలతో పోస్టులను తొలగించే చర్యలో విదేశీ దర్యాప్తు సంస్థ పేరును లాగడం ఆంధ్రప్రదేశ్ పరువు తీయడమే కాకుండా, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. విమర్శకుల గొంతు నొక్కడానికి వెచ్చిస్తున్న శక్తిని, 'సూపర్ సిక్స', 'సూపర్ సెవెన్' హామీలను నెరవేర్చడానికి ఉపయోగించాలన్నారు. కరువు పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవడం, నిజమైన ఉద్యోగాలను కల్పించడం, అభివ ద్ధిని వేగవంతం చేయడం, ప్రజలకు నిజంగా అవసరమైన సమస్యలను పరిష్కరించడం వంటి వాటిపై ద ష్టి సారించాలన్నారు. సోషల్ మీడియా కాలంలో, కట్టుకథలు లేదా తప్పుడు ప్రచారాల వెనుక దాక్కోవడం అసాధ్యమన్నారు. ఈ ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్, వేధింపులతో కాకుండా, సమర్థవంతమైన పనితీరు , పారదర్శకతతో సమాధానం ఇవ్వాలని జగన్ సూచించారు.

# ఆనంద్.. మంచి కాఫీలాంటి ఆఫీసర్... కానీ?

**మొదటి పేజీ తరువాయి....**

తరువాత విజయవాడ పోలీస్ కమిషనర్ గా నియమితులయ్యారు.విజయవాడ పోలీస్ కమిషనర్ గా, ఆయన రాజకీయ హింసపై దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకున్నారు.ఆయన ఇ-చలాన్ వ్యవస్థలను కూడా ప్రవేశపెట్టి, కమిషనరేట్ ను పునర్వ్యవస్థీకరించారు.

2010లో సి. వి. ఆనంద్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాకు పదోన్నతి పొంది, హైదరాబాదులో అదనపు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) గా నియమితులయ్యారు. నగర ట్రాఫిక్ చీఫ్ గా, ఆయన ట్రాఫిక్ ఇంజనీరింగ్ పద్ధతులను ఉపయోగించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు ఇ-చలాన్లు వంటి అనేక ఆవిష్కరణలకు కూడా ఆయన ఘనత పొందారు. ట్రాఫిక్ పోలీసులందరికీ స్పీడ్ గన్స్ హ్యాండ్హెల్డ్ కెమెరాలను ప్రవేశపెట్టడం ట్రాఫిక్ సంబంధిత నవీకరణలతో జరిమానాల జారీ సేకరణను సులభతరం చేశాయి.





మే 2013లో, ఆయన సైబరాబాద్ మెట్రోపాలిటన్ పోలీస్ కమిషనర్ గా నియమించబడ్డారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, కొత్త తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో ఆయన ఈ నియామకంలో పనిచేసారు.రాష్ట్ర ఏర్పాటు తరువాత ఆయన తెలంగాణ కేడర్లోకి విలీనం అయ్యారు.గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ విజృంభణ కారణంగా సైబరాబాద్ కమిషనరేట్ లో భూ వివాద కేసులను పరిష్కరించడానికి ఆయన ఎస్ఓపిని ప్రవేశపెట్టారు. తెలంగాణలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ వృద్ధి చెందడంతో, షీ యాప్, షీ బృందాలు షీ షటిల్స్ తో ఐటీ కారిడార్లో మహిళల భద్రత కోసం ఆయన పలు చర్యలను చేపట్టారు.సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గా ఉన్న కాలంలో, 2014 భారత సార్వత్రిక ఎన్నికల సమయంలో వ్యయ పర్యవేక్షణ డబ్బు శక్తిని పరిష్కరించడంలో ఎన్నికల సంబంధిత చర్యలకు గాను భారత ఎన్నికల కమిషన్ ఉత్తమ ఎన్నికల పద్ధతుల కోసం జాతీయ అవార్డును ప్రదానం చేసింది. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం నుండి ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును అందుకున్న మొదటి ఐపిఎస్ అధికారిగా ఆయన గుర్తింపు తెచ్చుకున్నాడు.తరువాత ఆయన వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం పౌర సరఫరా కమిషనర్ గా నియమించబడ్డారు.ఈ పదవిని నిర్వహించిన మొదటి ఐపిఎస్ అధికారి కూడా ఆయన.ఈ నియామకాన్ని సాధారణంగా ఐఎఎస్ అధికారులు నిర్వహిస్తారు.2018 ప్రారంభంలో, ఆయన ఐదేళ్ల పాటు ఇన్స్పెక్టర్ జనరల్ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) గా నియమించబడ్డారు.బెంగుళూరు ప్రధాన కార్యాలయంగా ఉన్న విమానాశ్రయ సెక్టార్ IIకు ఆయన నాయకత్వం వహించారు.ఈ పదవీకాలంలో, ఆయన చెన్నై ప్రధాన కార్యాలయం కలిగిన దక్షిణ సెక్టార్ ఐజిగా 9 నెలల పాటు అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆయన 6 నెలల పాటు పశ్చిమ సెక్టార్ కు, ఆగస్టు 2020లో నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఎ) డైరెక్టర్ గా నియమితులయ్యాడు. ఆగస్టు 2021లో ఆయన అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఎ. డి. జి. పి.) హోదాకు పదోన్నతి పొందాడు.2021 లో ఆయన 58వ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ గా నియమితులయ్యారు.సీపీగా తన మొదటి సంవత్సరంలో 55 మంది పోలీసు అధికారులను సేవ నుండి తొలగించి, అవినీతిని అణిచివేసారు.నగరంలో మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కోవడానికి హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ (హెచ్-ఎన్ఈడబ్ల్యూ) అనే కొత్త విభాగాన్ని ఏర్పాటు చేశారు.దీని విజయం ఆధారంగా, మొత్తం రాష్ట్రానికి కొత్త బ్యూరో, తెలంగాణ-నార్కోటిక్స్ బ్యూరో ఏర్పడింది.ఒక మహిళా ఇన్స్పెక్టర్ తన పదవీకాలంలో మొదటిసారిగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నియమించబడింది.అంతే కాకుండా, కొత్త పోలీసు కమిషనరేట్ ను కలిగి ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి) ఆయన సిపిగా ఉన్న కాలంలో ప్రారంభించబడింది.ఆయన మూడు దశాబ్దాలలో హైదరాబాద్ నగర పోలీసుల మొదటి పునర్వ్యవస్థీకరణను కూడా అమలు చేసారు.నగర పోలీసు బలగంలో ఇప్పుడు 28 డివిజన్లతో 7 జోన్లు ఉన్నాయి.సీపీగా రెండేళ్ల పదవీకాలం తరువాత, డిసెంబరు 2023లో ఆయన బాధ్యతలు వదులుకుని, అవినీతి నిరోధక బ్యూరో డైరెక్టర్ జనరల్ గా వెళ్ళారు.జూలై 2024లో, ఆయనకు డైరెక్టర్ జనరల్ (విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్) అదనపు బాధ్యతలు అప్పగించారు.2024 సెప్టెంబరు 9న సి.వి.ఆనంద్ రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించాడు.

**అనుభవమే పెద్ద ఆయుధం**

వరంగల్ నుంచి ఆదిలాబాద్, నిజామాబాద్ వరకు.. విజయవాడ నుంచి హైదరాబాద్ వరకు వివిధ కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవం డిజిపి ఆనంద్ కు ఉంది. క్షేత్రస్థాయి పోలీసింగ్ ఎలా ఉంటుందో ఆయనకు తెలుసు. అధికారులు ఎక్కడ ఇబ్బంది పడుతున్నారో.. సిబ్బందికి ఏం కావాలో.. ప్రజలకు పోలీసుల నుంచి ఏం ఆశిస్తున్నారో కూడా ఆయనకు అనుభవమే చెబుతోంది.అందుకే డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కేవలం కార్యాలయంలో కూర్చొని ఆదేశాలు ఇవ్వడానికే పరిమితం కాకుండా.. సైబర్ నేరాలు, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, ట్రాఫిక్, రోడ్డు భద్రత, టెక్నాలజీ వినియోగం, పోలీస్ సిబ్బంది పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు.

**పాత పోలీసింగ్‌కు షాక్..**

నేరం జరిగిన తర్వాత పరుగెత్తడం మాత్రమే పోలీసింగ్ కాదన్న ఆలోచన ఆనంద్ విధానాల్లో కనిపిస్తోంది. మారుతున్న నేర స్వభావానికి తగ్గట్టుగా పోలీస్ వ్యవస్థ కూడా మారాలని ఆయన కోరుతున్నారు.సైబర్ నేరగాడు కంప్యూటర్ ముందు కూర్చుంటే.. పోలీసులు మాత్రం పాత ఫైళ్లతో పరుగెత్తే పరిస్థితి ఉండకూడదన్నది ఆయన ఆలోచన.డ్రగ్స్ నెట్‌వర్క్ టెక్నాలజీని వాడుతుంటే.. పోలీసింగ్ మాత్రం దశాబ్దాల నాటి పద్ధతుల్లోనే ఉంటే వారిని అడ్డుకునేది ఎలా దిశగా వారి ఆలోచన ఉంది.నేరస్తులు కొత్త దారులు వెతుకుతుంటే.. ఖాకీ మాత్రం పాత దారిలోనే నడిస్తే నేరాన్ని ఆపలేమని ఆయన అంటూ ఉంటారు.

**సిబ్బంది కూడా.. కాస్త కదలాలి కదా..!**

పోలీస్ శాఖలో సిబ్బంది పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టడం కూడా ఆనంద్ పనితీరులో భాగమే. అవసరమున్న చోట సిబ్బందిని పెంచడం.. మారుతున్న నేరాలకు అనుగుణంగా బలగాలను మళ్లించడం.. ఫిట్‌నెస్, క్రమశిక్షణ, నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వడం ఆయన లో కనిపిస్తోంది. ఐతే పోలీస్ శాఖలో ఆదేశాలు పుట్టడానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు. కానీ అవి అమలయ్యేలోపు మాత్రం కొన్ని ఫైళ్లకు పదవీ విరమణ వయసు వచ్చేస్తుందనే వ్యంగ్యం లేకపోలేదు.

**పాత వాసనలు మారాలి.**

అధికారి మారితే కుర్చీ మారుతుంది. కానీ ఆ కుర్చీలో కూర్చున్న వ్యక్తి ఆలోచనను మొత్తం వ్యవస్థ స్వీకరించినప్పుడే పద్ధతి మారుతుంది.ఇప్పటికీ పోలీస్ శాఖలో కొన్నిచోట్ల “ఇంతకాలం ఇలాగే చేశాం.. ఇప్పుడు కూడా అలాగే చేద్దాం” అనే పాత మనస్తత్వం కనిపిస్తే.. కొత్త ఆలోచనలకు అక్కడే బ్రేక్ పడుతుంది.మరోవైపు.. పని కంటే పైరవీకి, ప్రతిభ కంటే పరిచయానికి, బాధ్యత కంటే అనుకూలతకు విలువ పెరిగితే.. సంస్కరణలు ఫైళ్లకే పరిమితం కావాల్సిందే. డీజీపీ మార్పు కోరుకుంటుంటే.. కొందరు మాత్రం తమకు మార్పు రాకూడదనే కోరుకుంటున్నారా?

**ఆనంద్ వేగం అందుకుంటారా..**

ఆనంద్ పనితీరులో వేగం కనిపిస్తోంది. కొత్త నేరాలకు కొత్త విధానాలు కావాలన్న ఆలోచన కనిపిస్తోంది. టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాలన్న దృక్పథం కనిపిస్తోంది.కానీ.. అదే వేగం మొత్తం శాఖలో కనిపించడం లేదన్న అభిప్రాయం వినిపిస్తున్నది.

డీజీపీ టాప్ గేర్‌లో పోలీస్ వాహనాన్ని నడపాలనుకుంటే.. కింద ఉన్న వ్యవస్థ ఇంకా పాత గేర్‌లోనే ఉంటే వాహనం ముందుకు కదులుతుందా?డీజీపీకి విజన్ ఉంది.కానీ ఆ విజన్‌కు వాహనం మొత్తం పోలీస్ శాఖే. ఒక్క చక్రం గాలి లేకపోయినా ప్రయాణం ఆగిపోతుంది.

**నిజమైన పరీక్ష.. ఇక్కడే**

ఆనంద్ వ్యక్తిగతంగా ఎంత సమర్థుడన్నది ఇప్పటికే ఆయన సర్వీసు చెబుతోంది. కానీ డీజీపీగా ఆయన విజయాన్ని నిర్ణయించేది ఆయన ఒక్కరి పనితీరు కాదు.ఆయన ఆలోచన ఎంతమంది అధికారులకు చేరింది..?



**ఎంతమంది దాన్ని తమ పనిగా స్వీకరించారు?**

స్టేషన్ స్థాయిలో అది ఎంతవరకు అమలవుతోంది? ప్రజలకు పోలీసింగ్‌లో మార్పు ఎంతవరకు కనిపిస్తోంది..?ఇవే అసలు కొలమానాలు.

**మంచి కాఫీ... శేఖర్ కమ్ముల సినిమా..**

తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన “ఆనంద్.. ఓ మంచి కాఫీ లాంటి సినిమా” అనే మాటను గుర్తు చేసేలా.. సీవీ ఆనంద్ ఒక మంచి కాఫీలాంటి ఆఫీసర్ కావచ్చు.కానీ మంచి కాఫీ రుచి కేవలం కాఫీ పొడి నాణ్యతతో రాదు.మిగతా పదార్థాలన్నీ సరైన మోతాదులో కలవాలి.అలాగే.. డీజీపీ ఆలోచనలు మంచివే అయినా.. అధికారులు, సిబ్బంది, వ్యవస్థ, విధానాలు, బాధ్యతాయుతమైన పోలీసింగ్...

ఇవన్నీ ఒకే దిశలో కలిసినప్పుడే తెలంగాణ పోలీసింగ్‌కు అసలైన రుచి వస్తుంది.

**ఆనంద్ కాఫీ పొడి నాణ్యంగానే ఉంది.ఇక శాఖ మొత్తం సరైన మోతాదులో కలవాలి. లేక పోతే 'మంచి కాఫీ లాంటి ఆఫీసర్' గా డీజీపీ ఆనంద్ ఒక్కరే మిగిలి పోతారు.**

## ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే

**అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అసత్య ఆరోపణలు**

**తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత విమర్శ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (సింగిడి):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన 'గుంటనక్క'తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. 'గుంపు మేస్త్రీ – గుంటనక్క' ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

## దానం అనర్హతపై
# విచారణ వాయిదా

ఈ పిటిషన్ ను విచారణ చేసిన న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెల్లడించాల్సి ఉండగా శుక్రవారానికి వాయిదా వేసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడి చేయనుంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్ని కై, ఆ తర్వాత కాంగ్రెస్ తరపున సికింద్రాబాద్ నుంచి లోకసభ ఎన్నికల్లో పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టివేసారు దీంతో.. ఇదే అంశం పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశికరెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేసింది. బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, కే వివేకరెడ్డి ఇప్పటికే హైకోర్టుకు తెలిపారు. ముఖ్యంగా దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోకసభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో అత్యంత కీలక ఆధారమని తమ వాదనల్లో స్పష్టం చేసారు. అదే విధంగా పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల న్న స్పీకర్ వైఖరిని పిటిషనర్లు వ్యతిరేకించారు. మరో పార్టీ తరపున పోటీచేయడం ద్వారా అసలు పార్టీ పట్ల తన రాజకీయ అనుబంధాన్ని వదులుకు న్నట్టు స్పష్టమవుతున్నప్పుడు వేరే ఆధారాల కోసం చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటుందని, స్పీకర్ అధికారాలు అపరిమిత మైనవి కావని వాదించారు. పిటిషనర్ల వాదనలతో దానం నాగేందర్ న్యాయవాది వ్యతిరేకించారు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాన్ని తీసుకున్నట్టు ఎకడా ప్రకటించలేదని తెలిపారు. దానం ఇప్పటికీ అసెంబ్లీ రికార్డుల్లో బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని చెప్పారు. దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరపున లోకసభ ఎన్నికల్లో పోటీచేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయినట్టు భావించరాదని వాదించారు. వాదనలు విన్న తరువాత ధర్మాసనం ఈ రోజు వెల్లడించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయ స్థానం నిర్ణయం తీసుకుంది.

## జీరం ఘాటీ నరమేధం కేసులో
# మరణశిక్ష

**బస్తర్, సెప్టెంబర్ 16 (సింగిడి):**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం స ష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దోషులపై భారత శిక్షా స్మ తిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ మరియు భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి
# నమూనాగా తిరుమల

బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజియంలో సీఎం ఆసక్తిగా పరిశీలించారు.

**తిరుమలలో భక్తుల కోసం 32 ఎలక్ట్రిక్ బస్సులు**

తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ-మొబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు.



## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే

**కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16 (సింగిడి):**

యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాకులు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివ ద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం
17-9-2026

# కమ్యూనిటీ భవనం ఐక్యతకు, సామాజిక సమైక్యతకు దోహదం

- మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 16(సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ మహదేవపురం డివిజన్‌లో పిఎన్ఆర్ ఎంపైర్‌లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవన ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ గారు మాట్లాడుతూ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరించిన పగిడి అంజిరెడ్డి కి, వారి కుమారులు కృష్ణారెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కమ్యూనిటీ భవనం నిర్మాణంతో కాలనీలో ఐక్యతకు, సామాజిక సమైక్యతకు ఎంతో దోహదం చేస్తాయని అందుకు ఒక మంచి నిదర్శనమని పేర్కొన్నారు. కాలనీ ప్రజలకు వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంజి రెడ్డి, కృష్ణ రెడ్డి, కూన రాఘవేందర్ గౌడ్,లతో పాటు కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ చారి సభ్యులు దేవి ప్రసాద్, నరేష్, గిరీష్ కుమార్, అఖిల్ , శ్రీధర్, ఉమామహేశ్వరు, శరత్ రెడ్డి, శ్రీనివాస్ మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 24 గంటల విద్యుత్ అందించాలి



- మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి

**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 (సింగిడి):** జిల్లా పరిధిలో ని గండేడ్ మండలం సల్కర్‌పేట్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. విద్యుత్ కోతలను వెంటనే అరికట్టి రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఈ నిరసనలో పరిగి మాజీ శాసనసభ్యుడు కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందేదని, ప్రస్తుతం తరచూ విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి కరెంటు కష్టాలు కొనితెచ్చుకున్నాం అంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 24 గంటల విద్యుత్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం, కనీసం వ్యవసాయానికి అవసరమైన సమయంలో కూడా నిరంతర విద్యుత్ ఇవ్వలేకపోతోందని విమర్శించారు. ప్రభుత్వ పాలనలో సమన్వయ లోపం, నిర్ణయాల్లో గందరగోళం కారణంగానే విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వ్యవసాయానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీతారాం ధూళిపాళ



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 16(సింగిడి):** 'తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్' నూతన అధ్యక్షుడిగా సీతారాం ధూళిపాళ ఎన్నికయ్యారు. ఆల్ కాలనీ సంక్షేమ సంఘాల సేవలో, ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన శైలితో గుర్తింపు పొందిన ఆయనకు ఈ బాధ్యతలు దక్కడం పట్ల స్థానిక నాయకులు, వివిధ కాలనీల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాష్ట్ర సమితి బలోపేతానికి సీతారాం ధూళిపాళ తన 'ఆల్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్' అధ్యక్ష పదవిని త్యాగం చేశారు. ఆ తర్వాత బిఆర్ఎస్ స్థానిక అధ్యక్ష బాధ్యతలను స్వీకరించి, పార్టీకి నూతనోత్తేజాన్ని అందిస్తూ, రాష్ట్రంలోనే బిఆర్ఎస్ స్థానిక విభాగాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దారనే గుర్తింపు పొందారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ , రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'కోర్ అర్బన్ 2026' ప్రణాళికలోని లోటుపాట్లను సరిదిద్దడానికి తమ వంతు కృషి చేయాలని స్థానిక ప్రజలు, కాలనీ ప్రతినిధులు సీతారాం ధూళిపాళను కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఏర్పుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన

మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

పాల్గొన్న మాజీ కౌన్సిలర్ కృష్ణ, బీఆర్ఎస్


సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి



**అమీన్‌పూర్, సెప్టెంబర్ 16 (సింగిడి):** అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నామని మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని పీఎన్ఆర్ కాలనీ పక్కన ఉన్న స్మశాన వాటిక సమీపంలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ,ఉపేందర్ రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. పీఎన్ఆర్ కాలనీ పరిసర ప్రాంత ప్రజలు, స్మశాన వాటికకు వచ్చే వారు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న రాకపోకల సమస్యను పరిష్కరించేందుకు ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజల మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా సీసీ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత గుత్తేదారులను, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో 28 అడుగుల ఎత్తుతో వినాయకుడు

- మరో ఖైరతాబాద్ వినాయకుడిగా ప్రశస్తి
- నవరాత్రులు అయ్యేవరకు గణనాథుని దర్శనానికి జన సందోహం
- 28వ గణనాథుని వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన ఆగం పాండు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 16 (సింగిడి):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలోని స్వయంభు గణేష్ ని ఆలయంలో 28 అడుగుల ఎత్తుతో మూడు ముఖాలు కలిగి ఎనిమిది భుజాలతో వెలసిన మరో ఖైరతాబాద్ గణనాథుడు. ఆలయ కమిటీ వినాయకుడి నవరాత్రి ఉత్సవాల కమిటీ చైర్మన్ మాజీ సర్పంచ్ మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ గణేష్ నవరాత్రి వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించుటకు గణనాథుని స్వయంభు గణేష్ ఆలయంలో ప్రత్యేకంగా శిల్పులను పిలిపించుకొని గణనాథుని విగ్రహాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేయించుకోవడం ఇక్కడి మరో ఖైరతాబాద్ వినాయకుడిగా ప్రఖ్యాతి. ఆగం పాండు ముదిరాజ్ అనునిత్యం గణనాథుని విగ్రహ తయారీ కోసం శిల్పులకు కావలసిన ముడి సరుకులు అందించడంతోపాటు వారికి కావలసిన పూర్తి సహకారాన్ని అందిస్తూ గణనాథుని నిర్మాణం పూర్తయ్యే వరకు అనునిత్యం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుండడం ఆగం పాండు ముదిరాజ్ దైవ భక్తికి నిదర్శనం అని పలువురు ప్రశంసిస్తుంటారు. ఈ ఏడు 28వ గణనాథుని నవరాత్రి వార్షికోత్సవ వేడుకల సందర్భంగా తయారు చేసిన గణనాథుడు 28 అడుగుల ఎత్తుతో మూడు తలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ముఖాలతో ఎనిమిది భుజాలు కలిగిన గణనాథున్ని ఏర్పాటు చేయడంతో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ లోని అన్ని ప్రాంతాలతో పాటు సమీపంలోని సర్కిల్ డివిజన్లకు చెందిన వందల మంది భక్తులు ఈ గణనాథుని దర్శించు కొనుటకు ఉత్సాహపడుతుంటారు. నవరాత్రులు పూర్తి అయ్యేవరకు ప్రతి దినం వందలాదిగా భక్తులు తరలివచ్చి మరో కారుతాబాద్ వినాయకుడిగా పేరుగాంచిన బాచుపల్లి స్వయంభు గణేష్ ఆలయంలో భక్తుల దర్శనార్థమై సర్వాంగ సుందరంగా మలచబడిన ఈ గణనాథుని చూచుటకు రెండు కళ్ళు చాలు అన్నట్లుగా దర్శనమిస్తుండడం ఇక్కడి గణనాథుని ప్రత్యేకతగా చెప్పుకుంటారు. వినాయక చవితి వేడుకల ప్రారంభం రోజున ఆగం పాండు ముదిరాజ్ అతని సోదరుడు ఆగం రాజు ముదిరాజ్ (మాజీ కార్పొరేటర్ ) వారి కుటుంబ సభ్యులందరూ స్థానిక ముఖ్య నేతలతో కలిసి స్వామివారికి మొదటగా ప్రత్యేక పూజలు నిర్వహించి ముక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా నిర్వహిస్తుంటారు. సోమవారం జరిగిన వినాయక చవితి పర్వదినం రోజున ఆగం పాండు ముదిరాజ్ కుటుంబ సభ్యులు ఆగం రాజు కుటుంబ సభ్యులతో పాటు కాసాని వీరేష్ ముదిరాజ్, ఇతర ముఖ్య నేతలు అందరూ కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆగం పాండు ముదిరాజ్ మాట్లాడుతూ విఘ్న నాయకుడి చల్లని చూపుతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ప్రజలు, బాచుపల్లి ప్రాంతంలోని నివసిస్తున్న భక్తులందరినీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదిస్తూ, పుష్కలంగా వర్షాలు కురిసి పచ్చని పైరు పంటలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వెలసిలేలా ఆశీస్సులు అందించాలని వేడుకున్నట్లు వివరించారు. ఈ సంవత్సరంతో 28 వార్షికోత్సవ వేడుకలు పూర్తవుతున్నందున 28 అడుగులకు గణనాథుడి విగ్రహాన్ని పెంచినట్లు ప్రతి సంవత్సరం ఒక్కో అడుగు చొప్పున విఘ్నేశ్వరుడి ఎత్తును పెంచుతూ వెళుతుంటామని తెలిపారు. స్వామి వారి నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడంతోపాటు స్వామివారిని దర్శించుకొనుటకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు ఈ సందర్భంగా ఆగంపాండు ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాసాని సుధాకర్ ముదిరాజ్ దూసకంటి వెంకటేష్, దూస కంటి రాజు, కే సీతారాం రెడ్డి, కే గోపాల్ రెడ్డి, ఎన్ నరసింహ, కాసాని మహేష్, కమేట కృష్ణ, కే మాధవరెడ్డి, ఎన్ సత్యనారాయణ తో పాటు ఏపిఎం టీం సభ్యులు రంజిత్ గౌడ్, రాజేష్, శంకర్ యాదవ్, టీ శేఖర్, పృథ్వి, సూరి, అంజి, రాజు, భాస్కర్, కళ్యాణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

కొడంగల్‌లో పర్యటించిన కలెక్టర్

ప్రభుత్వ కార్యాలయాలు తనిఖీ





**కొడంగల్, సెప్టెంబర్ 16(సింగిడి):** వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కొడంగల్ మండలంలో పర్యటిస్తూ పలు ప్రభుత్వ కార్యాలయాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొడంగల్ మండలంలోని అంగడి రాయిచూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, బోధన విధానం మౌలిక వసతులు,పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని నాణ్యమైన విద్యను బోధించాలని సూచిం చారు. అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**ఎస్ఐఆర్ జాబితా పరిశీలన**

కొడంగల్ మండలంలోని లక్ష్మీ పల్లి గ్రామంలో ఎస్ ఐ ఆర్ జాబితాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిఎల్వోలతో మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నమోదు, ఇప్పటివరకు ఓటర్ల కు జారీచేసి న నోటీసులు, ఇంకా జారీ చేయాల్సిన నోటీసులపై వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో చేర్చాలని, పెండింగ్లో ఉన్న నోటీసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

**అంగడి రాయచూరులో ఆరోగ్య కేంద్రం తనిఖీ**

– మండలంలోని అంగడి రైచూరు లో ఉన్న ఆరోగ్య కేంద్రం ను పరిశీలించారు. హాజరు రిజిస్టర్, స్టాకు రిజిస్టర్, మందులు, ఇతర వైద్య సామాగ్రిని తనిఖీ చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, వైద్య సిబ్బందికి సూచించారు. చికిత్స పొందుతున్న రోగులను పలకరించి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.

**వైద్య సిబ్బందిని పెంచండి**

అంగడి రైచూరు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా వైద్య సిబ్బంది లేరని, వైద్యం సక్రమంగా అందడం లేదని కలెక్టర్ తో గ్రామ ప్రజలు చెప్పుకున్నారు. సరిపడా వైద్య సిబ్బందిని వెంటనే నియమించి, నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్య అధికారులకు ఫోన్ చేసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇఓ, డిపిఓ,తహసిల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, మెడికల్ ఆఫీసర్, పంచాయతీ సెక్రెటరీ, సర్పంచ్, తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ గడ్డ సిద్ధి వినాయక దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్

ఆలయంలో ప్రత్యేక పూజలు

నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు



**పటాన్చెరు, సెప్టెంబర్ 16(సింగిడి):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక దేవాలయాన్ని పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారు స్వామివారిని దర్శించుకుని.. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, శాంతి, సౌభాగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు.. ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు.. ఆశీర్వచనం అందజేశారు. పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# గణపతి మండపాల్లో భూపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి పూజలు

- ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆదర్శ్‌రెడ్డి ఆకాంక్ష
- భక్తిశ్రద్ధలు, శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపు



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 16(సింగిడి):** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్లలో కొలువుదీరిన గణపతి మండపాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పాత రామచంద్రాపురం, రామచంద్రారెడ్డి నగర్ కాలనీ, అశోక్ నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాలను శాసనమండలి మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్ రెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు. అనంతరం భారతీనగర్ డివిజన్ పరిధిలోని అల్ప ఆదాయ వర్గాల (ఎల్ఐజీ) కాలనీ, పాత మధ్య ఆదాయ వర్గాల (ఎంఐజీ) కాలనీ, ఎంఏసీ సొసైటీలలో ప్రతిష్ఠించిన గణనాథులను ఆదర్శ్ రెడ్డి దర్శించుకుని పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోయి, అందరూ సుఖసంతోషాలు, ఆయురా రోగ్యాలు, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. గణేష్ నవరాత్రులు ఐక్యతకు, ధర్మానికి ప్రతీకలని, కాలనీవాసులు, యువత అంతా భక్తి శ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిబంధనలు పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 20న ఎంపికలు

నిర్వాహక కార్యదర్శి జోన్స్ రాజశేఖర్



**జవహర్ నగర్, సెప్టెంబర్ 16(సింగిడి):** జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఈ నెల 20వ తేదీన ఎంపిక ప్రక్రియ చేయనున్నట్లు నిర్వాహక కార్యదర్శి స్టాన్లీ జోన్స్ కూరపాటి రాజశేఖర్‌లు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధ్రువపత్రాలతో తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల హకీంపేటలో రాజశేఖర్ కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. అండర్ 14 16 విభాగాల్లో షార్ట్ ఫుట్, త్రోబాల్, అండర్ 18లో లాంగ్ జంప్, అండర్ 20 లో లాంగ్ జంప్, త్రిపుల్ జంప్ పురుష స్త్రీ అభ్యర్థులు ఈనెల 20వ తేదీన ఉదయం ఏడు గంటలకు హాజరు కావాలని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఈనెల 26, 27వ తేదీన నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలు హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో పాల్గొంటారన్నారు.

# ప్రమోషన్ పొందిన పోలీస్ సిబ్బందికి అభినందనలు



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 (సింగిడి):** వికారాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తూ ఇటీవల ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొందిన నారాయణమ్మ, సంగమేష్ అలాగే హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతి పొందిన శంకరయ్య, కిష్టయ్య, పాండు, జైపాల్ రెడ్డి లు మంగళవారం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారిని అభినందిస్తూ, పదోన్నతికి అనుగుణంగా మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావడంతో పాటు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు.

# గణనాథుడి సేవలో మాద్రి పృథ్వీరాజ్

- పలు గణనాథ మండపాలను సందర్శించి ప్రత్యేకపూజలు
- నేతాజీ నగర్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పృథ్వీరాజ్



**పటాన్చెరు, సెప్టెంబర్ 16(సింగిడి):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, ఎం డి ఆర్ ఫౌండేషన్ కో–ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ హనుమాన్ వ్యాయామశాల, అంబేద్కర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, జేపీ కాలనీ, రామ్ మందిర్ రోడ్డు, చైతన్య నగర్, అంబేద్కర్ యూత్, చాకలిబస్తీ, వర్తక సంఘం, గొల్ల బస్తి, శివాలయం, ప్రభు మందిర్, బండలగూడ ఒరిస్సా టీం, ఏకే ఈవెంట్స్, గోనెమ్మ బస్తి, ముదిరాజ్ బస్తి, మంజీరా క్యాంపస్, నర్ర బస్తి, కమ్మరి బస్తీ గణనాథ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. లిఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన పృథ్వీరాజ్, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. పలు మండపాల నిర్వాహకులు పృథ్వీరాజ్‌ని ఘనంగా సత్కరించారు. అనంతరం నేతాజీ నగర్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పృథ్వీరాజ్ పాల్గొని, భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని ఆయన అన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక వేడుకలకే పరిమితం కాకుండా ప్రజల్లో ఐకమత్యం, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందించేలా ఉండాలని పృథ్వీరాజ్ ని ఆకాంక్షించారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని కోరుకుంటూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# ఉప్పర్‌పల్లిలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 16(సింగిడి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అర్హులైన పేదలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. రాజేంద్రనగర్ నియోజకవర్గం, రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 113 హైదర్‌గూడా డివిజన్ ఉప్పరపల్లిలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో కలిసి డివిజన్ అధ్యక్షుడు ఇంద్రపాల్ రెడ్డి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉంది. ప్రజా పాలన ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు నేరుగా అందుతున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని సంక్షేమంలో ముందంజలో ఉంచుతాం" అని తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో హైదర్‌గూడా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ ఇంద్రపాల్ రెడ్డి, జిహెచ్ఎంసి, పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక డివిజన్ కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 17-9-2026

# ఎడిటోరియల్

Editorial

# విరాట్ స్వరూపుడు విశ్వకర్మ

**విశ్వ మంగళ మాంగళ్య । విశ్వ విద్యా వినోదినే; విశ్వ సంసార భీజాయ । నమస్తే విశ్వ కర్మణే.**
**విశ్వాయ విశ్వ రూపాయ । నమస్తే విశ్వ మూర్తియే; విశ్వ మాత పితా రూప । విశ్వకర్మ నమోస్తుతే.**



సకల ప్రాణి కోటిని సృష్టించు జగత్పతి విశ్వకర్మ యొక్క ఆవిర్భావం ఈ సృష్టికి పూర్వమే స్వయంభువుగా వెలసిన రూపమే విశ్వకర్మ. పరమాత్మ విశ్వకర్మ ఐదు ముఖాలతో, పది చేతులతో స్వయంభువుగా అవతరించిన రూపంగా భావిస్తారు. విశ్వకర్మ విశ్వకర్మ ఋగ్వేదంలో, కృష్ణ యజుర్వేదంలో, శుక్ల యజుర్వేదంలో సృష్టి కర్తగా పేర్కొన బడినాడు. అథర్వణ వేదంలో ఆహార ప్రదాతగా వర్ణించ బడినాడు. పురుష సూక్తంలో విరాట్ పురుషుడుగా కీర్తించ బడినాడు. సహస్ర బాహుగా, సహస్ర చక్షుగా, సహస్ర పాదుడుగా, సహస్ర ముఖుడుగా అన్ని వేదాలలో వర్ణించ బడినాడు.

సకల వేదముల ప్రకారం విశ్వకర్మయే సృష్టికర్త. వేదములు విశ్వకర్మను సర్వపాప సంహర్తగా పేర్కొన్నాయి. సర్వ దిక్కులను పరికించు దృష్టి కలిగిన అమిత శక్తి కలవాడు కనుకనే ఈయన భగవంతుడు అని ఋగ్వేదము ఈయనను భగవంతునిగా పరిగణించింది. మహా భారతము ఈయనను వేయికళలకు అధినేతగా అభివర్ణించింది. అర్చమూర్తిని విశ్వకర్మ పురాణము పంచ శీర్షుడుగా వర్ణించింది. విరాట్ వి భగవానుడు (పంచ ముఖుడు) ఐదు ముఖములు కలవాడు. సృష్టి తొలినాళ్ళ నుంచి సుప్రసిద్ధులైన శిల్పకారులు ఐదు మంది ఉన్నారు. వారు విశ్వకర్మకు జన్మించారు. విరాట్ విశ్వకర్మ యొక్క పంచ ముఖాల నుండి మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ బ్రహ్మలు ఉద్భవించారు, ఈ పంచ బ్రహ్మల నుండి వారి సంతతి అయిన ఐదుగురు (సనగ, సనాతన, అహభౌసన, ప్రత్నస, సుపర్ణస.) పంచార్షేయ బ్రాహ్మణులు (విశ్వ బ్రాహ్మణులు) ఉద్భవించారు. వీరి ద్వారా చేయు శాస్త్రం, వృత్తులు నిర్దేశింప బడినవి. వీటితో పాటు పౌరోహిత్యం కూడా వారి వృత్తులలో భాగమే. ఈయనను దేవతల శిల్పి (దేవా శిల్పి) అంటారు. వృత్తి విద్యలు, నిర్మాణ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన విద్యలకు ఈయన అధిపతి. విశ్వకర్మ సకల కళలకు ఆది దేవుడు, అధిపతి. దేవ లోకాలను నిర్మించిన భవన శిల్పి, వాస్తు శిల్పి, స్థపతి (ఆర్కిటెక్చర్). దేవతలకు ఆకాశాన విహరించే పుష్పక విమానాలు, ఆయుధాలు, వివిధ రకాల సువర్ణాభరణాలు మరియు పనిముట్లను సృష్టించి ఇచ్చిన రూప శిల్పి, విశ్వకర్మ భగవానుడు సమస్త హస్త కళలన్నింటికి ఆది దేవుడు, విశ్వము యొక్క ప్రధాన రూపశిల్పి. విశ్వకర్మ ప్రపంచానికి దైవ యాంత్రికుడు (ఇంజనీరు). మొత్తం విశ్వం యొక్క దివ్య చిత్ర లేఖకుడు, మరియు అన్ని దేవతల 'రాజ భవనాలు అధికారిక భవన నిర్మాతగా వున్నాడు. విశ్వకర్మ దేవతల ఆయుధాలను రూపకర్త ఉన్నాడు. వెయ్యి హస్తకళ ఆకృతులకు కార్యనిర్వాహణాది కారి. దేవతల యొక్క వడ్రంగి, చేతివృత్తుల అత్యంత ప్రముఖత, అన్ని ఆభరణాలు యొక్క రూపకర్త మరియు ఒక గొప్ప మరియు శాశ్వత కీర్తిని కలిగిన దేవుడు యొక్క అధినేత అని మహా భారతంలో ఆయన గురించి వివరిస్తుంది. నాలుగు యుగాలన్నింటి లోను ఆయన దేవతలకు అనేక పట్టణాలు మరియు రాజ భవనాలు నిర్మించి ఇచ్చిన స్థపతి, వాస్తు మరియు భవన శిల్పి. సత్య యుగంలో ఇంద్రుడు పరిపాలించే ఇంద్ర లోకాన్ని, త్రేతాయుగంలో స్వర్ణ లంకని ద్వాపర యుగంలో ద్వారకా నగరాన్ని, కలియుగంలో హస్తినా పురాన్ని, ఇంద్ర ప్రస్థాన్ని నిర్మించిన అద్భుత శిల్పి, గొప్ప స్థపతి. పుట్టుక, ఆకారం లేకుండా స్వయంభుగా వెలసిన ఈ విశ్వకర్మ భగవానుని ప్రతి యేట ఎంతో ఘనంగా భక్తి శ్రద్ధలతో పండగగా విశ్వకర్మీయులు జరుపు కుంటారు.

శ్లో॥ నభూమి నజలం చైవ నతేజో నచ వాయవ: నచబ్రహ్మా నచవిష్ణు నచ రుద్రస్య తారకః సర్వ శూన్య నిరాలంబో స్వయంభూ విశ్వకర్మణ. (మూల స్తంభ పురాణం)... భూమి, నీరు, అగ్ని, వాయువు,ఆకాశము, మరియు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర – ఇంద్ర –సూర్య – నక్షత్రములు పుట్టక ముందే విశ్వకర్మ తనంతట తాను స్వయంభు రూపమై అవతరించి నాడు. ఐదు ముఖాలతో పంచ తత్వాలతో, పంచ రంగులతో, పంచ కృత్యములతో వెలసిన విశ్వకర్మ దేవుడు విశ్వ బ్రాహ్మణులకు కులగురువైనాడు.

శ్లో॥ పూర్వావనా త్సానగః దక్షణా త్సనాతనః; అపరా దహభూవః ఉద్వీచ్యాం ఉర్దవాత్సుపర్ణః విశ్వకర్మ పరాత్పరుని యొక్కతూర్పు ముఖమైన సద్యోజాతములో సానగ బ్రహ్మర్షి మను బ్రహ్మయు, దక్షిణ ముఖమైన వసుదేవములో సనాతన మహర్షి యను మయబ్రహ్మయు, పశ్చిమ ముఖమైన అఘోరియునందు అహభూవ మహర్షి యను త్వష్ట బ్రహ్మయు, ఉత్తర ముఖమైన తత్పురుషములో ప్రత్న మహర్షి యను శిల్పి బ్రహ్మయు, ఊర్ధ్వ ముఖమైన ఈశానములో సువర్ణ మహర్షియను విశ్వజ్ఞ బ్రహ్మయు ప్రభవించినట్లు చెప్పబడినది. ఋక్ వేదం లోని పదవ మండలం 81,82 సూక్తాలు విశ్వకర్మ యొక్కసృష్టి నిర్మాణ క్రమాన్ని వివరిస్తాయి. అందరికీ సుపరిచితమైన పురుష సూక్తం కూడా విశ్వకర్మను విరాట్ పురుషునిగా వర్ణించింది. పూర్వం వృత్తి సమాజంలోని ప్రజలకును, ప్రభువులకును తమ విజ్ఞానాన్ని తమదైన శైలిలో ప్రపంచానికి చాటి చెప్పడానికి ఉపయోగపడే కళానైపుణ్యం విశ్వకర్మీ యులది. ప్రాచీన విజ్ఞానానికి నిలువుటద్దం ఈ వృత్తులు. అసలు ఈ సమాజం నడవడానికి వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. విశ్వ బ్రాహ్మణులు పంచ వృత్తులతో పాటు పౌరోహిత్యం కూడా చేస్తారు, పూర్వ కాలంలో, రాజ్యానికి శుభములు సమ కూర్చేందుకు, పొరుగు దేశరాజుల దండయాత్రల వంటి విషమ పరిస్థితుల లోను మంత్రి, జ్యోతిష్కులు, పురోహితులతో రాజు సమాలోచనలు జరిపేవాడు. వివాహాది షోడశ కర్మలు, పూజలు, వ్రతాలు మరియు యజ్ఞ యాగాదులు, జరుపడానికి సామన్య ప్రజలు జ్యోతిషుని, పురోహితుని తప్పక ఆశ్రయించేవారు. ఈ విశ్వకర్మల గురించి వేద, పురాణ, ఇతిహాసాలలో, ప్రాచీన సాహిత్యంలో,ఆధునిక సాహిత్యంలో వీరి గురించి ప్రస్తావించ బడినది. ఉదహరణకు ప్రజాకవి వేమన తన శతకంలో అంటాడు "విశ్వకర్మ లేని విశ్వంబు లేదు" అని మరోక చోట "విశ్వకర్మ దేవాది దేవుడు" అని ప్రస్తావించాడు. ఇదే విధముగా విశ్వకర్మ గురించి నన్నయ, తిక్కన, ఎర్రన, గోన బుద్దారెడ్డి, హూళక్కి భాస్కరుడు, కంకంటి పాప రాజు, మారన, పోతన, శ్రీనాధుడు, చేమకూర వేంకటకవి, పుష్పగిరి తిమ్మన, ధూర్జటి, బద్దేన, వేమన, తరిగొండ వెంగమాంబ, మట్ల అనంతరాజు, దొంతిరెడ్డి పట్టాభి, రామదాస కవి మొదలగు వారెందరో వారి వారి రచనలలో ప్రస్తావించారు. విశ్వ బ్రాహ్మణుల వృత్తుల ద్వార సమాజ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. వీరిని ఈ సమాజంలో ఆచార్య, దైవజ్ఞ , ఆచారి అనే పేర్లతో పిలుస్తుంటారు. దేవాలయాలలో విగ్రహాలు తయారు చేయువారు విశ్వకర్మలే. ఇంతటి ప్రత్యేకతలు కలిగిన వీరు పూర్వం యంత్ర పరికరాలు రాక ముందు పనులన్ని మానవ శ్రమ తోనే ముడిపడి ఉండేవి. లోకంలో మానవ జీవనానికి విశ్వకర్మీయుల కులవృత్తులు ప్రధాన ఆధారంగా ఉండేవి, ఉన్నాయి. ఈ విశ్వకర్మ కులంలో జన్మించిన శ్రీమద్వి విరాట్ శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కుల వృత్తులను చేస్తూనే కాల జ్ఞానాన్ని చెప్పాడు. నిష్ఠాగరిష్టులైన ఈ విశ్వ బ్రాహ్మణులు కుల వృత్తులనే కాక జ్యోతిష, పౌరోహిత, యంత్ర, గృహవాస్తు నిర్మాతలుగా, విద్యా వేత్తలుగా, వైద్యులుగా, ప్రకృతి వైద్యులుగా, శాసన లేఖకులుగా, ఆర్కిటేక్చర్లుగా, సివిల్ ఇంజనీయర్లుగా, అన్ని రంగాలలో, నాటి నుండి నేటి వరకు సకల కళల యందు వీరి ప్రావీణ్యతను నిరూపిస్తూ ఈ విశ్వం నందు నిష్ణాతులై విరాజిల్లుతున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## ప్లాస్టిక్ వద్దు.. స్టీల్ ముద్దు
## నినాదం కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత

ఒక పెళ్లి ముగిసింది. వందల పళ్లాలు, గ్లాసులు చెత్తకుప్పలో చేరాయి. విందు కొన్ని గంటల్లో ముగిసినా, ఆ ప్లాస్టిక్ వ్యర్థం మాత్రం ప్రకృతిపై దీర్ఘకాల భారంగా మిగులుతుంది. సౌకర్యం కోసం ఎంచుకున్న 'వాడి పారేయడం' సంస్కృతి ఇప్పుడు చెత్త సమస్యగా మన ముందుంది. దీనికి పరిష్కారం కేవలం నిషేధం కాదు; పారేయకుండా తిరిగి ఉపయోగించే అలవాటుకు వ్యవస్థను జోడించడం.

ఇక్కడే గ్రామపంచాయతీల్లో ఎన్నికైన యువ సర్పంచ్‌ల నాయకత్వం కీలకమవుతుంది. ప్రతి పంచాయతీ తన జనాభాకు అనుగుణంగా స్టీల్ పళ్లాలు, గ్లాసులు కొనుగోలు చేసి, వాటిని పంచా యతీ ఆస్తిగా నమోదు చేయాలి. 300 కుటుంబాలున్న గ్రామానికి అవసరమైనన్ని, వెయ్యి కుటుంబాలున్న గ్రామానికి తగినన్ని సమకూర్చాలి. పెళ్లిళ్లు, అన్నదానాలు, జాతరలు, పాఠశాల కార్యక్రమాలు, గ్రామసభలు, ఇతర సామూహిక వేడుకలకు వాటిని అందుబాటులో ఉంచాలి. ఒక గ్రామం ప్రారంభించిన విధానాన్ని పక్క గ్రామాలు అనుసరించేలా చేయాలి. ఒక సర్పంచ్ నిర్ణయం మరో గ్రామానికి ఆదర్శంగా నిలవాలి.

ఇది కొత్త ఆలోచన కాదు. తెలంగాణలో ఇప్పటికే దీనికి విజయవంతమైన నమూనాలు ఉన్నాయి. సిద్దిపేటలో గ్రామపంచాయతీల స్థాయిలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసి, ఒకసారి వాడే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం చూపించారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో పాత్రల నిర్వహణ కూడా చేపట్టారు. టూప్రాన్‌లో 1,500 స్టీల్ పళ్లాలు, 2,000 గ్లాసులతో ఏర్పాటైన స్టీల్ బ్యాంకు వందలాది కార్యక్రమాల్లో దాదాపు లక్ష ప్లాస్టిక్ పళ్లాలు, గ్లాసుల వినియోగాన్ని నివారించినట్లు నమోదైంది. ఖమ్మంలోనూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. అంటే ఆలోచనకు ఆధారం ఉంది; ఇప్పుడు కావాల్సింది విస్తరణ.

ప్రభుత్వమే అన్నీ సమకూర్చాలని ఎదురుచూడాల్సిన అవసరం లేదు. పంచాయతీ కొనుగోలు పునాది అయితే, ప్రజల భాగస్వామ్యం దానికి బలం. ప్రతి కుటుంబం ఒక స్టీల్ పళ్లెం, ఒక గ్లాసు ఇవ్వొచ్చు. యువజన సంఘాలు సామగ్రి సమకూర్చవచ్చు. వ్యాపారులు, దాతలు, పూర్వ విద్యార్థుల సంఘాలు సహకరించవచ్చు. ఇళ్లలో ఉపయోగం లేకుండా ఉన్న స్టీల్ సామగ్రి గ్రామ బ్యాంకుకు చేరితే, అది వ్యక్తిగత వస్తువుగా కాకుండా సామూహిక ఆస్తిగా మారుతుంది. 'నా పళ్లెం కూడా ఇందులో ఉంది' అనే భావన ఏర్పడితే, దాన్ని కాపాడే బాధ్యత కూడా పెరుగుతుంది.

నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలకు అవకాశం కల్పించడం మరో ముఖ్యమైన అడుగు. పాత్రలు ఇవ్వడం, తిరిగి తీసుకోవడం, శుభ్రపరచడం, లెక్కలు నిర్వహించడం వంటి బాధ్యతలను వారికి అప్పగిస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాలూ ఏర్పడతాయి. తక్కువ అద్దె లేదా నిర్వహణ రుసుముతో సేవలు అందించవచ్చు. వచ్చిన ఆదాయంతో పాడైన పాత్రలను మార్చుకోవచ్చు. ప్రతి పంచాయతీ రిజిస్టర్ నిర్వహించి, ఎన్ని పళ్లాలు, గ్లాసులు ఉన్నాయో, ఎవరికి ఇచ్చారో, ఎప్పుడు



తిరిగి వచ్చాయో నమోదు చేయాలి. స్టీల్ బ్యాంకు అంటే పాత్రలు నిల్వ చేసే గది కాదు; బాధ్యతతో నడిచే ప్రజా వ్యవస్థ.

ఈ విధానం పెళ్లిళ్లకే పరిమితం కాకూడదు. జాతరలు, అన్నదానాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాల వేడుకలు, గ్రామసభలు–ఎక్కడ సామూహిక భోజనం ఉంటే అక్కడ స్టీల్‌కు చోటుండాలి. దేవాలయాలు, ఫంక్షన్ హాళ్లు, భోజనశాలలతో పంచాయతీలు సమన్వయం చేసుకోవచ్చు. పెద్ద కార్యక్రమాల నిర్వాహకులకు ముందుగానే స్టీల్ బ్యాంకు అందుబాటులో ఉందని తెలియజేయాలి. ప్రత్యామ్నాయం చేతిలో ఉంటే నిషేధాన్ని అమలు చేయడం కూడా సులభమవుతుంది.

కేంద్ర ప్రభుత్వం గుర్తించిన కొన్ని ఒకసారి వాడే ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం అమల్లో ఉంది. అయితే చట్టం ఒక వైపు, ప్రజల అలవాటు మరో వైపు. అలవాటు మారాలంటే ప్రత్యామ్నాయం అందుబాటులో ఉండాలి. అందుకే ప్రతి గ్రామపంచాయతీ తన వార్షిక ప్రణాళికలో స్టీల్ బ్యాంకును పర్యావరణ చర్యగా మాత్రమే కాకుండా గ్రామ ఆస్తి నిర్మాణ కార్యక్రమంగా చేర్చాలి. ఈ రోజు కొనుగోలు చేసిన పళ్లెం రేపటి కార్యక్రమంలో మళ్లీ ఉపయోగపడాలి; ఒక్కసారి వాడి చెత్తకుప్పలో కలిసిపోకూడదు. ఒక గ్రామం ఇలా మారితే అది ప్లాస్టిక్‌ను తగ్గించిన గ్రామంగానే కాదు, పొదుపును నేర్చుకున్న గ్రామంగా, పంచుకునే సంస్కృతిని పునరుద్ధరించిన గ్రామంగా నిలుస్తుంది. ప్రజల డబ్బుతో ఏర్పడిన ఆస్తిని ప్రజలే కాపాడుకునే విధానం ఏర్పడుతుంది. యువ సర్పంచ్ నాయకత్వం అంటే కొత్త భవనం కట్టడమే కాదు; కొత్త అలవాటును పుట్టించడం కూడా అని నిరూపిస్తుంది.

చివరికి ఇది పళ్లెం గురించి కాదు; రేపటి తరానికి మనం వదిలే జీవన విధానం గురించి. ఒక్కసారి వాడి పారేసే వస్తువు మన సౌకర్యాన్ని మాత్రమే చూస్తుంది. మళ్లీ మళ్లీ ఉపయోగించే స్టీల్ పళ్లెం మాత్రం మన తర్వాతి తరాన్ని కూడా గుర్తు చేస్తుంది.

ప్లాస్టిక్ వద్దు.. స్టీల్ ముద్దు.
ఇది గోడపై రాసే నినాదం కాదు..
ఇంటి నుంచి పంచాయతీ వరకు
ఆచరించాల్సిన బాధ్యత.

ఒక పళ్లెం కొనండి.. ఒక గ్లాసు ఇవ్వండి..
ఒక గ్రామాన్ని మార్చండి.
ఒక గ్రామం మారితే.. మరో గ్రామానికి
దారి కనిపిస్తుంది.



**శ్రీశైలం దూడం**
**ఫ్రీలాన్స్ జర్నలిస్టు**
**9133947176**


# నిజాం నిరంకుల పాలనకు చరమగీతం

## హైదరాబాద్ భారత యూనియన్లో విలీనం... నేడు తెలంగాణ విమోచన దినం

**నిజాం కబంధ హస్తాల నుండి హైదరబాదు సంస్థానం విముక్తి పొందిన రోజును తెలంగాణ విమోచన లేదా విలీన దినంగా పాటిస్తారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశవ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండేవి. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇస్తూనే... సంస్థానాలు ఇండియాలో కలవాలో లేదో నిర్ణయించుకునే అవకాశం సదరు పాలకులకే ఇచ్చారు. ఫలితంగా... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణకాండకు తెగబడ్డారు.**







జాతీయులు , రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో సమస్త భారతావనిని అంతర్భాగం చేసుకోగా, ఎన్నో సుదీర్ఘ పోరా టాలు, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించినా, నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వతంత్రం కావడానికి సంవత్సరంకు పైగా సమయం పట్టింది. 1724-1948 మధ్యకాలం 224 సంవత్సరాల పాటు 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషలతో కొనసాగింది. 1948 సెప్టెంబర్ 13 న "ఆపరేషన్ పోలో" " పేరున పోలీసు చర్య ఫలితంగా 17న మీర్ ఉస్మాన్ అలీఖాన్ లొంగి పోవడంతో పోవడంతో హైదరాబాద్ రాష్ట్రం భారతదేశం ప్రభుత్వ పాలనలో విలీనమైంది. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా చివరి అంకంలో ఖాసిం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల దళాల దురాగతాలు సహించ రానివైనాయి. ఉద్యమ కారులను గురి చేసిన క్రూరాతిక్రూర అమానుష చిత్రహింసలకు హద్దులు లేకుండా పోయాయి. 90 రకాల పన్నుల విధింపే కాకుండా తమ పలుకు బడిలోని ప్రజలను బానిసలుగా చూస్తూ , వెట్టి చాకిరీలు చేయించు కున్నారు . ప్రజల సొమ్ముతో జల్సాలు చేసు కున్నారు. ఎదిరిస్తే కాల్చి చంపారు. మత మార్పిడులు బలవంతంగా చేశారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయలను అణచి వేశారు. స్థానీయ భాషలను, అనాదిగా ఉన్న సంప్రదాయాలను హీనంగా చూశారంటే తెలుగు వారి దుర్గతి స్పష్టమవుతుంది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఆర్యసమాజ్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు, కవులు, రచయితలు తమతమ పాత్రలు నిర్వహించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యానికి కృషి సల్పారు. నల్గొండలో పురుడు పోసుకున్న నిజాం వ్యతిరేక పోరాటం రాజ్యం అంతటా విస్తరించింది. రావి నారాయణ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హన్మంతరావు , సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి, షోయబుల్లా ఖాన్, అనభేరి ప్రభాకర్ రావు, జమలాపురం కేశవరావు, లక్ష్మీనర్సయ్య, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, దొడ్డి కొమురయ్య, కోదాడ నారాయణరావు , బెల్లం నాగయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, రాంజీగోండు, కొమురం భీం, రఘునాథరావు కాచే , అలుగు వీరమ్మ, కిషన్ మోదాని, లక్క కిష్టయ్య, బత్తిని మొగిలయ్య, కాటం లక్ష్మీ నారాయణ, మర్రి చెన్నారెడ్డి, వందేమాతరం రాంచందర్ రావు , కర్నె వెంకట కేశవులు ఒక్కరేమిటి... వివిధ పోరాట మార్గాలలో, ఎందరో త్యాగధనులు తమతమ పాత్రలను పోషించి, ప్రాణాలను ఫణంగా పెట్టారు. నారాయణరావు పవార్, శంశా బాద్ గంగారామ్ తో కలిసి ఏకంగా నిజాం పైనే బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. దాశరథి కారాగారంలో గోడలపై నిజాం వ్యతిరేక కవితలు రాశారు. కాళోజి, సుద్దాల హనుమంతు, యాదగిరి లక్ష్మీనారాయణ లాంటి వారు జన బాహుళ్య కవితలల్లారు. ఇలా నిజాం వ్యతిరేక పోరాటాలు వివిధ రూపాల్లో ఉధృతం అయిన వేళ . . . హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా నైనా , లేక పాకిస్తాన్లో అంతర్భాగంగా నైనా ఉండాలని నిజాం ప్రయత్నిస్తూ, ఐక్య రాజ్య సమితికి నిజాం, భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను సైతం పంపాడు. పోరాటానికి దేశాల నుండి ఆయుధ సంపత్తిని పొందే కృషి సల్పారు. ఈ క్రమం లోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. జనరల్ జె. ఎన్. చౌదరి నాయకత్వంలో 1948 సెప్టెంబర్ 13 న సైనిక చర్య ప్రారంభమైంది. భారత సైన్యం విడివడి విజయవాడ, బీదర్ వైపుల నుండి నలు వైపులా ముట్టడికి ముందుకు సాగాయి. ఓటమిని తప్పించుకో లేని నిజాం, దిక్కు తోచక, లేక్ వ్యూ అతిథి గృహంలో ఉన్న భారత ఏజెంట్ మున్షీని కలిసి, లొంగు బాటు నిర్ణయాన్ని ప్రకటించాడు. బొల్లారం వద్ద నిజాం, సర్దార్ పటేల్ ముందు తలవంచి, లోంగి పోవడంతో, సైనిక చర్య సెప్టెంబర్ 17 న సఫలీకృతమైంది. తద్వారా హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్లో విలీనమైంది. నిజాం ప్రధాన మంత్రి లాయక్ అలీని తొలగించి, ఖాన్ రజ్వీని ఖైదు చేశారు. తర్వాత లాయక్, రజ్వీ పాకిస్తాన్ పారి పోయారు. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే. ఎన్. చౌదరి, సైనిక గవర్నర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు . ఎం. కె. వెల్లోడి ముఖ్యమంత్రి 3, నియుక్తు లైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు , భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, యాభై లక్షల రూపాయల భరణం చెల్లింపు కు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగింప బడేందుకు, ప్రభుత్వం అంగీకరించింది. 1956 అక్టోబర్ 31 వరకు నిజాం రాజ్ ప్రముఖ్ గా కొనసాగారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# భగత్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఆధునిక బహిరంగ వ్యాయామశాల ప్రారంభం
- రూ.60 లక్షలతో రహదారులు మురుగు కాలువల పనులకు శ్రీకారం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్, సెప్టెంబర్16(సింగిడి):** నగర సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ప్రతి డివిజన్‌లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కరీంనగర్ 42వ డివిజన్‌లో బుధవారం పర్యటించిన బండి సంజయ్‌కుమార్ భగత్‌నగర్‌లోని మమత థియేటర్ ఎదుట మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత నిధులతో ఏర్పాటు చేసిన ఆధునిక బహిరంగ వ్యాయామశాలను మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉపమేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. యువత, మహిళలు, వృద్ధులు వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకునేందుకు ఈ వ్యాయామశాల ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధుల కింద రూ. 60 లక్షలతో చేపట్టనున్న రహదారులు, మురుగు కాలువల నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. కాలనీల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తామని అన్నారు. కరీంనగర్ అభివృద్ధికి కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకువచ్చి నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని బండి సంజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## భూ భారతి రీ సర్వేకు ప్రజలు సహకరించాలి



### హుజురాబాద్ ఆర్డీవో జలకుమారి

**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (సింగిడి):** భూభారతి రీ సర్వేకు ప్రజలు సహకరించాలని హుజురాబాద్ ఆర్డిఓ జల కుమారి ప్రజలను కోరారు. బుధవారం వీణవంక మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణపల్లిలో భూభారతిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీణవంక తహసిల్దార్ తో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారులు భూములకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారం, పట్టాదారు పాస్‌బుక్‌లు, భూ హక్కులు, రికార్డుల్లో మార్పులు, వారసత్వం, భూ వివాదాల పరిష్కారానికి సంబంధించిన ప్రక్రియలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భూ రికార్డుల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే భూములకు సంబంధించిన పత్రాలను భద్రంగా ఉంచుకోవాలని, భూ లావాదేవీల సమయంలో పూర్తి వివరాలను పరిశీలించి ముందుకు వెళ్లాలని అధికారులు సూచించారు. భూభారతి ద్వారా అందుబాటులోకి వచ్చే సేవలు, వాటిని పొందే విధానం గురించి గ్రామస్తులకు వివరించారు. ప్రజలు తమ భూములకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, సంబంధిత పత్రాలతో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు. గ్రామస్థులు అడిగిన పలు భూ సమస్యలు, సందేహాలను అధికారులు వివరంగా విని వాటిపై తగిన సూచనలు చేశారు. ఈ అవగాహన సదస్సులో రెవెన్యూ అధికారులు, కేడి కిషన్ రావు డిఐ రత్నం ఎంపీడీవో ప్రభాకర్ జి పి ఓ లు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జీవకోటికి ప్రాణాధారం మొక్కలే

### మొక్కలను నాటుదాం పర్యావరణాన్ని రక్షిద్దాం
### పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత
### మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్



**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (సింగిడి):** మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ ఉంటుందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ అధ్యక్షతన జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి, వాటిని పరిరక్షించాలని అన్నారు. మొక్కలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని అన్నారు. అనంతరం చైర్మన్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కాగ కళాశాల ఆవరణలో పలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఓదెలు కుమార్, స్టాఫ్ సెక్రటరి. డాక్టర్ కె గణేష్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె రాజేంద్రం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎంబాడి రవి, లోఖండే రవిందర్, అధ్యాపకులు డాక్టర్ ఎం. శ్యామల, డాక్టర్ కె మాధవి, వి కిరణ్ కుమార్, కె. ఉమా కిరణ్, పి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ పి సుష్మ, డాక్టర్ సి రాజకుమార్, ఎన్ మమత, డాక్టర్ పి రవిప్రకాష్, డాక్టర్ ఎన్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ డి. తిరుపతి, ఏ రఘు, డాక్టర్ పి స్వప్న, ఏ రమేష్, ఎన్ ప్రశాంత్, ఎం సాయి కుమార్, జి. అనూష, పి అరుణ్ రాజ్, దీనా, విద్యార్థులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని ప్రవర్తనపై అధికారుల విచారణ



**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (సింగిడి) :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న రామ్ రాజయ్య విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు ఇష్టం వచ్చినట్లు దూషిస్తున్నారని విద్యార్థులు నిరసన వ్యక్తం చేయడంతో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు బాలల రక్షణ బృందం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడి రామ్ రాజయ్య విద్యార్థుల పట్ల ప్రవర్తిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అధికారులకు సదరు ఉపాధ్యాయుడు తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా తమ తల్లిదండ్రులకు సైతం మెసేజ్లు చేస్తున్నాడని విషయం బయటకు చెప్తే డార్క్‌రూమ్‌లో వేస్తారని భయభ్రాంతులకు గురి చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా సెల్‌ఫోన్లో ఉన్న అశ్లీల చిత్రాలు తమకు చూపెట్టేవాడని తెలిపారు. అనంతరం ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి గతంలో రామ్ రాజయ్య ప్రవర్తన గురించి ఆరా తీశారు. పూర్తి వివరాలు ఆధారంగా నివేదికను తయారుచేసి జిల్లా కలెక్టర్కు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ విచారణలో క్వాలిటీ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, అశోక్ రెడ్డి, జిల్లా చిల్డ్రన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పర్వీన్, మెడికల్ ఆఫీసర్ చందన, సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

### మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా లబ్ధిదారుడికి ఆర్థికసాయం



**కరీంనగర్, సెప్టెంబర్16(సింగిడి):** కొత్తపల్లి, మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన ఆర్థిక సాయం చెక్కును రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్ మాట్లాడుతూ, అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించాలి

### మున్సిపల్ కమిషనర్‌కు దుర్గా కాలనీవాసుల వినతి



**జమ్మికుంట, సెప్టెంబర్ 16(సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు దుర్గ కాలనీలో రహదారి ఆక్రమణలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యోదయ స్కూల్ మెయిన్ రోడ్డు నుంచి హాస్టల్ వరకు ఉన్న మున్సిపల్ సీసీ రోడ్డుపై కొందరు నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొంటూ, వాటిని పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలని కోరుతూ దుర్గా కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామికి వినతిపత్రం సమర్పించారు. విద్యోదయ స్కూల్ మెయిన్ రోడ్డు నుంచి హాస్టల్ వరకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే సీసీ రోడ్డుపై గోడలు, మెట్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడంతో రహదారి వినియోగానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలనీ వాసులు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన మున్సిపల్ రహదారి ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రోడ్డును ఆక్రమించి నిర్మించినట్లు పేర్కొంటున్న గోడలు, మెట్లు, కటకాలు తదితర నిర్మాణాలను మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. రహదారి హద్దులను గుర్తించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే వాటిని తొలగించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాధ రాంబాబు, మీడివెల్లి సంపత్, మారేల్ల రవి, రాధ నరేష్, చొప్పరి సదానందం, చొప్పరి రాము, ఒద్ది శ్రీకాంత్, రాధ భారత్, ముకుంద సాయి వంశీ, మూడేడ్ల గణేష్, పకిడె మణికంఠ, పెంతల సురేందర్, బోల్లం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి తగాదాలతో.. వ్యక్తి హత్య

### కుటుంబ సభ్యులే సూత్రధారులు
### హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి
### ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు





**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (సింగిడి):** ఆస్తి తగాదాలతో పాటు కుటుంబ సభ్యులను ప్రతినిత్యం తాగి వచ్చి వేధింపులకు గురి చేస్తున్నాడని భావించిన కుటుంబ సభ్యులే హత్య చేసి పూడ్చి వేసిన సంఘటన కరీంనగర్ జిల్లాలో సంచలనం సృష్టించింది. ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన వొజ్జపల్లి రాజబాబు(35) అనే వ్యక్తిని తల్లి ,అక్క, బావతో పాటు మరో నలుగురు ఉరివేసి చంపి పూడ్చివేశారు. బుధవారం మృతుడి శవాన్ని పూడ్చివేసిన చోట పోలీసులు స్థానిక తహసిల్దార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హుజురాబాద్ ఏసిపి మాధవి తెలిపిన వివరాల ప్రకారం మృతుడు రాజబాబు ప్రతినిత్యం తాగి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడడమే కాకుండా తనకు ఉన్న పొలం విషయంలో, తల్లి అక్కా బావలతో వివాదానికి దిగేవాడు. ఇదే తరుణంలో ఈ నెల 10వ తేదీన మద్యం సేవించి తన పొలం అమ్ముకోకుండా అడ్డుకుంటున్నారంటూ వారిపై వివాదానికి దిగాడు. గత కొద్ది రోజులుగా ఉన్న ఆస్తి గొడవతో పాటు మృతుడి వివాదం ఎక్కువ కావడంతో పథకం ప్రకారం కుటుంబ సభ్యులు తల్లి లచ్చమ్మ, అక్క జూపాక కవిత బావ జూపాక శంకర్ లు గ్రామానికి చెందిన మారేపల్లి రాజయ్య, చేతి వెంకటేష్, జూపాక సతీష్, గుంటి శంకర్ సహాయంతో ఇంటిలో ఉరివేసి చంపేశారు. రాత్రివేళ తమకున్న పొలం సమీపంలో పూర్తి వేసినట్లు ఏసిపి మాధవి తెలిపారు. హత్యకు కారణమైన ఏడుగురుపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జమ్మికుంట తహసిల్దార్ సుధాకర్ సీఐ రామకృష్ణ గౌడ్‌తో పాటు ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్ వేతన పరిమితి పెంపుపై బీఎంఎస్ హర్షం

### రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంపు కార్మికులకు మరింత సామాజిక భద్రత
### భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేష్



**కరీంనగర్, సెప్టెంబర్16(సింగిడి):** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో తప్పనిసరి వేతన పరిమితిని నెలకు రూ. 15 వేల నుంచి రూ. 25 వేలకు పెంచుతూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంపై భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం బీఎంఎస్ చేపట్టిన పోరాటాల ఫలితమేనని పేర్కొన్నారు. వేతన పరిమితి పెంపుతో దేశవ్యాప్తంగా మరో 51 లక్షల మందికి పైగా ఉద్యోగులు తప్పనిసరిగా ఉద్యోగుల భవిష్య నిధి పరిధిలోకి వస్తారని తెలిపారు. దీంతో ఉద్యోగులకు భవిష్య నిధి, పింఛను, బీమా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు మరింత విస్తృతంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు. పెరుగుతున్న వేతనాలకు అనుగుణంగా కార్మికులకు దీర్ఘకాలిక పదవీ విరమణ భద్రత కల్పించే దిశగా ఈ నిర్ణయం కీలక అడుగని సురేష్ పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో భాగంగా కార్మిక సంక్షేమానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రవణ్, జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆదిత్య అమృత ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (సింగిడి):** జమ్మికుంట మండలం వెంకటేశ్వర్ల పల్లె గ్రామంలో బుధవారం జమ్మికుంట ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ మహిపాల్ (జనరల్ సర్జన్), డాక్టర్ భరత్ (న్యూరాలజిస్ట్), డాక్టర్ గ్రీష్మ (గైనకాలజిస్ట్) పాల్గొని గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించడంతో పాటు, వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆదిత్య అమృత హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద, నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని గ్రామాల్లో ఇటువంటి వైద్య శిబిరాలను విస్తృతంగా నిర్వహించి, అవసరమైన వైద్య సేవలను ప్రజలకు చేరువ చేస్తామని పేర్కొన్నారు. వైద్య శిబిరానికి అవకాశం కల్పించి సహకరించిన గ్రామ సర్పంచ్ పోల్సాని వినోద-నారాయణరావు, ఉప సర్పంచ్ రేబెల్లి వెంకటేష్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలకు హాస్పిటల్ యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# వొడితల రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిస్తా..

### నియోజకవర్గం అభివృద్ధి కి ఆయన చేసిన సేవలు మరువలేనివి
### నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్..
### ఘనంగా వొడితల రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు..



**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (సింగిడి):** హుజురాబాద్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ రాజేశ్వర్ రావు అని వారు చేసిన పనులే ఇప్పటికీ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని, వారు చూపిన బాటలో నడుస్తూ ప్రజలకు మరింత సేవ అందజేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం రోజున మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితల రాజేశ్వర్ రావు జయంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకల్లో పలువురు ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ ప్రాంతానికి పెద్దదిక్కుగా ఇక్కడి అవసరాలకు తగ్గట్టుగా పలు అభివృద్ధి పనులు చేశారని, ఆయన దూరదృష్టి వల్ల ఆ సేవలు ఇప్పటితరానికి కూడా ఉపయోగపడుతున్నాయని అన్నారు. అనంతరం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, అధికార ప్రతినిధులు, అన్ని మండల, పట్టణ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, ప్రజా ప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్, ఎస్సీ సెల్, బీసీ సెల్, మైనారిటీ, సేవాదళ్, సోషల్ మీడియా, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ భూములపై త్వరలో బీజేపీ పోరాటం

- భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని
- కేంద్ర మంత్రి సంజయ్ వెల్లడి



**కరీంనగర్, సెప్టెంబర్16(సింగిడి):** బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారని ఆరోపిస్తున్న భూములపై బీజేపీ ఆధ్వర్యంలో త్వరలో దండయాత్ర చేపడతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. ఆ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచేలా పోరాటం చేస్తామని తెలిపారు. కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లతో కలిసి కొత్తపల్లి చెరువు పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిమజ్జన ఏర్పాట్ల కోసం రూ. 1.5 కోట్లు కేటాయించామని, గతేడాదితో పోలిస్తే మూడు రెట్లు అధికంగా నిధులు కేటాయించామని చెప్పారు. అవసరమైన క్రేన్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు నిమజ్జనానికి మూడు రోజుల ముందే నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి బీఆర్ఎస్ నేతల భూవ్యవహారాలపై చేసిన వ్యాఖ్యలను బండి సంజయ్ ప్రస్తావిస్తూ, గతంలో తాను బీఆర్ఎస్ భూదోపిడీపై మాట్లాడినప్పుడు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానన్నారు. వేల ఎకరాల భూముల వ్యవహారంపై వివరాలు వెల్లడించడానికి ఇంతకాలం ఎందుకు పట్టిందని ప్రశ్నించారు. భూములపై విచారణ పేరుతో ప్రభుత్వం బీఆర్ఎస్‌తో ఒప్పందానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. వివిధ కేసుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాల పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. జిల్లాల కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇస్తే భూములపై 24 గంటల్లో నివేదికలు ఇవ్వగలరని పేర్కొన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, ఫార్ములా రేస్, గొర్రెల పథకం తదితర అంశాల్లోనూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ, అటవీ భూములను ఆక్రమించారని ఆరోపిస్తూ, వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో ప్రభుత్వ భూమి ఉందని గుర్తించడానికి 33 నెలలు ఎందుకు పట్టిందని బండి సంజయ్ ప్రశ్నించారు. విలువైన ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ భూముల వ్యవహారాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని, ఆ రెండు పార్టీల మధ్య చీకటి ఒప్పందం ఉందని బండి సంజయ్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల కోసం అవసరమైన నిధుల విషయంలో బీఆర్ఎస్ సహకరిస్తుందన్నది తన అభిప్రాయమని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు ఆక్రమించారని ఆరోపిస్తున్న భూములపై బీజేపీ ఆధ్వర్యంలో త్వరలోనే దండయాత్ర చేపట్టి, వాటిని పేదలకు పంచేలా పోరాటం చేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ అవగాహనపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమం లో కలెక్టర్ చిత్ర మిశ్రా, సిపి గౌస్ ఆలం, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యే పిల్లలకు ప్రభుత్వం అందించే గొప్ప ఆస్తి

- కరీంనగర్‌లో రూ.8 కోట్లతో సామూహిక వంటశాల ప్రారంభం
- 49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం
- ఆహార తయారీ, పాత్రల శుభ్రత, కూరగాయల శుభ్రపరిచే ప్రక్రియలకు ఆధునిక యంత్రాల ఏర్పాటు,
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





**కరీంనగర్, సెప్టెంబర్16(సింగిడి):** పిల్లలకు ప్రభుత్వం అందించగలిగే గొప్ప ఆస్తి విద్యేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య, అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతులకు రాకుండా పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడమే పాఠశాల అల్పాహార కార్యక్రమం ఉద్దేశమన్నారు. కరీంనగర్ మార్కెట్ యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా భాగస్వామ్యంతో సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సామూహిక వంటశాలను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం వంటశాలలోని ఆధునిక పరికరాలు, ఆహార తయారీ విభాగాలను పరిశీలించారు. ఆకలితో ఉన్న విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేరని మంత్రి పేర్కొన్నారు. నాణ్యమైన అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఏకాగ్రత, హాజరు, సమయపాలన, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమం పేద, మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు సమయ, ఆర్థిక పరంగా ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని చెప్పారు.

**49,025 మంది విద్యార్థులకు అల్పాహారం..**

కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సామూహిక వంటశాలకు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 49,025 మంది విద్యార్థులకు ఇక్కడి నుంచి అల్పాహారం అందుతుందని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులు ప్రయోజనం పొందుతారని చెప్పారు. వారంలో ఆరు రోజులు ఇడ్లీ, సాంబార్, పూరీ, ఆలూ కుర్మా, దోశ, చట్నీ, ఉప్మా, చట్నీ, చిరుధాన్యాల ఇడ్లీ, సాంబార్, బోండా, చట్నీ అందించనున్నట్లు తెలిపారు. రోజు విడిచి రోజు పాలు కూడా అందిస్తామన్నారు. ఆహార తయారీ, పాత్రల శుభ్రత, కూరగాయల శుభ్రపరిచే ప్రక్రియలకు ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేశామని, ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మెనూ రూపకల్పనలో జాతీయ పోషకాహార సంస్థ సహకారం తీసుకున్నట్లు తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు ప్రణాళిక...**

2024 డిసెంబర్‌లో కోడంగల్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన పాఠశాల అల్పాహార కార్యక్రమంతో విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు మంత్రి తెలిపారు. ఏకాగ్రత, తరగతి గది భాగస్వామ్యం, సమయపాలనలోనూ మెరుగుదల కనిపించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా కార్యక్రమాన్ని విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. 23,106 ప్రభుత్వ పాఠశాలలను పరిధిలోకి తీసుకురావడంతోపాటు 31 జిల్లాల్లో 31 కేంద్రీకృత వంటశాలలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు వెల్లడించారు. కార్యక్రమం అమలులో భాగస్వామిగా ఉన్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియాకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి ఊర చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి



- నీటిపారుదల శాఖ ఎస్ఈకి బీజేపీ నేతల ఫిర్యాదు

**కరీంనగర్, సెప్టెంబర్16(సింగిడి):** కొత్తపల్లి పట్టణంలోని చారిత్రక ఊర చెరువు ఆక్రమణలు, అక్రమ లేఅవుట్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు మాజీ బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేంచ శేఖర్ ఆధ్వర్యంలో కరీంనగర్ నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ మిట్టపల్లి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువు పూర్తి నీటిమట్టం పరిధిలోని సర్వే నంబర్లు 686, 687లో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా మట్టి పోసి స్థలాల అభివృద్ధికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల అండతోనే చెరువు భూములు ఆక్రమణకు గురవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే రహదారిపై ఉన్న కల్వర్టును కాంగ్రెస్ నాయకుడు కూల్చివేశారని ఆరోపిస్తూ, దీనిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువు ఆక్రమణలను అడ్డుకుని నీటి వనరును పరిరక్షించాలని, భవిష్యత్తులో రైతులకు, ప్రజలకు నష్టం కలగకుండా అధికారులు వెంటనే స్పందించాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముత్తునూరి హరీష్, మేకల నరేష్, దుబాయ్ సునీల్, మహేష్, హరిబాబు, ప్రవీణ్, శివ రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నం సత్తయ్యకు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి నివాళి

16వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లోని ఘాట్ వద్ద పుష్పాంజలి



**కరీంనగర్, సెప్టెంబర్16(సింగిడి):** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి, దివంగత పొన్నం సత్తయ్య 16వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లోని తోటలో ఉన్న ఆయన ఘాట్ వద్ద సూడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్తయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు.

## అకాల వర్షం..... త్రినగరీ రోడ్లు జలమయం

- వర్షపు నీటిలోనే విక్రయాలు





**హన్మకొండ, సెప్టెంబర్ 16(సింగిడి):** వరంగల్‌లో కురిసిన అకాల వర్షం వల్ల ట్రై సిటీ లోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో వరంగల్ హనుమకొండ చౌరస్తాలు చెరువులా తలపిం చాయి. వినాయక చవితి పండగ ను జరుపుకునేందుకు ప్రకృతి సిద్ధమైన ఆకులు, అలముల కోసం ప్రజలు కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. వర్షపు నీటిలోనైనా వ్యాపారులు పూలు, పండ్ల విక్రయాలు జరిపారు. నగరంలో సరియైన డ్రైనేజీ సౌకర్యం కల్పించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని వ్యాపారులు ప్రజలు విమర్శనాస్త్రాలు కురిపించారు. ఏ వ్యక్తి ఎమ్మెల్యే గా ఎన్నికైనా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల పుణ్యమా అంటూ వినాయక పూజకు కావలసిన పూజా సామగ్రిని రోడ్లపై నిలిచిన అపరిశుభ్రమైన నీటి నుంచి తీసుకువెళ్ళే దుస్తితి ఏర్పడిందని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు రోడ్లపై వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు డ్రైనేజీ సిస్టమును మెరుగుపరచాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. రోడ్లపై నిలిచిన ఈ వర్షపు నీటి దుస్థితిని బీజేపీ హన్మకొండ జిల్లా మాజీ అధ్యక్షు రాలు రావు పద్మ ఆయా నియోజకవర్గాల ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను వెంటనే మెరుగుపరిచే కార్యాచరణ మొదలు పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

## సర్పంచ్, కార్యదర్శిపై వార్డు సభ్యుల ఫిర్యాదు

ఏకపక్షంగా తీర్మానాలు చేస్తున్నారని ఆరోపణ

బోరు నీటిని పక్క పొలాలకు మళ్లించారని ఫిర్యాదు

అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**కోదాడ, సెప్టెంబర్ 16(సింగిడి):** వేణుగోపాలపురం సర్పంచ్ వేల్పుల సోమయ్య, పంచాయతీ కార్యదర్శి గోపిలపై గ్రామ పాలకవర్గంలోని పలువురు వార్డు సభ్యులు ఎంపీవోకు ఫిర్యాదు చేశారు. సర్పంచ్, కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరిస్తూ గ్రామ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల శంకుస్థాపన చేసిన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి సంబంధించిన తీర్మానాన్ని వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా చేశారని, వారి సంతకాలు కూడా తీసుకోలేదని పేర్కొన్నారు. వేణుగోపాలపురం పల్లె ప్రకృతి వనానికి కేటాయించిన నీటి బోరును పక్కనే ఉన్న పొలాలకు మళ్లించారని, ఇందుకు కార్యదర్శి సహకరించారని ఆరోపించారు. గ్రామసభల నిర్వహణలోనూ వార్డు సభ్యులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువులోకి లిఫ్ట్ ద్వారా నీటిని మళ్లించే పనుల్లోనూ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సర్పంచ్, కార్యదర్శిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఉపసర్పంచ్ సంపతి వీరబాబుతో పాటు వార్డు సభ్యులు బోయిళ్ల సైదమ్మ, సంపతి లక్ష్మీనారాయణ, కొల్లు మధుబాబు, రేఖ వంశీ, అచ్చుమ్మ ఉన్నారు.

## యాదాద్రిలో బీర్ల దంపతుల గిరిప్రదక్షిణ

స్వాతి నక్షత్రం సందర్భంగా సామూహిక గిరిప్రదక్షిణ



**ఆలేరు, సెప్టెంబర్ 16(సింగిడి):** స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో నిర్వహించిన సామూహిక గిరిప్రదక్షిణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తన సతీమణి బీర్ల అనితతో కలిసి పాల్గొన్నారు. గిరిప్రదక్షిణకు ముందు వైకుంఠ ద్వారం వద్ద ఉన్న స్వామివారి పాదాలకు ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని ప్రార్థించి ఆలయ క్షేత్రం, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, స్థానిక ప్రజలు, వేలాది మంది భక్తులతో కలిసి యాదాద్రి కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేశారు. స్వాతి నక్షత్రం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు యాదాద్రి క్షేత్రానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తూ గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. దీంతో యాదాద్రి కొండ చుట్టూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గిరిప్రదక్షిణ అనంతరం బీర్ల ఐలయ్య దంపతులు శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా వారికి స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆశీస్సులతో ఆలేరు నియోజకవర్గ ప్రజలు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ స్వామివారి కృప లభించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 70వ మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**చింతపల్లి, సెప్టెంబర్ 16(సింగిడి):** మండలంలోని గడియ గౌరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్ ఐ) 70వ మండల స్థాయి క్రీడోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య అధ్యక్షతన ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మునుగోడు మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు, గడియ గౌరారం గ్రామ సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు, ఉప సర్పంచ్ ఆదిరాల కృష్ణయ్య పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య, ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేందర్ రావు, ఉప సర్పంచ్ ఆదిరాల కృష్ణయ్యలతో కలిసి చదువుల తల్లి సరస్వతీ మాతకు పూలమాలతో పుష్పాంజలి ఘటించారు. అనంతరం క్రీడా పోటీల ప్రారంభ సూచికగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఉత్సవపూరిత వాతావరణంలో విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల క్రీడా వికాసానికి ముందుకు వచ్చి సహకరిస్తున్న దాతలను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వానికి ఎంతో తోడ్పడతాయని అన్నారు. క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పద్మాచారి, కృష్ణమ్మ, క్రీడల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు సౌజన్య చంద్రయ్య, పద్మ, తస్లీమ్, రవి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు .



## అన్ని రంగాలలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- యాదాద్రి పవర్ ప్లాంట్ అవకతవకలను త్వరలో బయటపెడతా
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 16(సింగిడి):** ప్రజా సంక్షేమ, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత కల్పించి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. స్థానికంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ 1000 రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి అక్రమాలు బయట పడ తాయనే భయంతోనే బిఆర్ఎస్ నేతలు అసెంబ్లీ సమావేశాలను విస్మరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, ప్రతిపక్షాల ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. బిఆర్ఎస్ పాలకుల హయాంలో బినామీ పేర్లతో 1000 ఎకరాల భూమి 700 కోట్ల రూపాయలు యాదాద్రి థర్మల్ ప్లాంట్ లో దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దీనికి సంబంధించిన వాస్తవాలను త్వరలోనే ప్రజలకు ముందుకు తీసుకువస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకు లు చిలుకూరిబాలకృష్ణ, గుడిపాటి నవీన్ కుమార్, నూకల వేణుగోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తలకొప్పుల సైదులు, పొదిలే శ్రీనివాస్, వన్ టౌన్ టూ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, మోయిజ్, మిర్యాలగూడ మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్, కౌన్సిలర్లు జావిద్, మలగం రమేష్, ఫారుక్ మొహమ్మద్, మనోజ్, బంటు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, చక్రి నాయక్, నాయకులు దేశిడి శేఖర్ రెడ్డి, అయూబ్, తదితరులు పాల్గొన్నారు.

## తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కెసిఆర్‌ది

మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు



**మిర్యాలగూడ సెప్టెంబర్ 16(సింగిడి):** తండాలను గ్రామపంచాయతీగా మార్చిన ఘనత కేసీఆర్ దేనాని మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేసి గిరిజనులకు ఆత్మగౌరవం, స్వయం పాలన కల్పించినందుకు కృతజ్ఞతగా 17న తండాలు గ్రామ పంచాయతీలుగా మారిన గ్రామాల్లో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. 40 తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయించి గిరిజనుల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమములో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి ,దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎండి యూసుఫ్, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఆంగోతు హాతిరామ్ నాయక్ ,చౌగాని భిక్షం గౌడ్ ,మట్టపల్లి సైదులు యాదవ్, దిరావత్ పాచు నాయక్, కుందూరు వీరకోటిరెడ్డి, ధనావత్ బాలాజీ నాయక్ ,కుర్రా సేవియా నాయక్ ,నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, ధనావత్ ప్రకాష్ నాయక్ డి పి ఎన్, చిర్రా మల్లయ్య యాదవ్, కుర్ర శ్రీను నాయక్, లావూరి శ్రీను నాయక్, పున్నా నాయక్ ,పీసీకే ప్రసాద్, రాయికింది సైదులు, ధనావత్ శంకర్ నాయక్, ధనావత్ వీరా నాయక్ ,ధనావత్ సచిన్ నాయక్, నాగు నాయక్, శ్రీను నాయక్ ,రామావత్ వినోద్ నాయక్, పల్సాని రాంరెడ్డి, పడిగపాటి సైదిరెడ్డి, మాలోతు బాలశంకర్ నాయక్, బాణావత్ సైదా నాయక్ ,ధనావత్ వెంకటేశ్వర్లు నాయక్, మాలావత్ రవీందర్ నాయక్, గాంధీ నాయక్, ఆడోతు లింగ నాయక్, బాలా నాయక్, ముని నాయక్ ,శ్రీను, దసరా నాయక్, సుధీర్ నాయక్, నడిగడ్డ హాతిరాం నాయక్, కృష్ణా నాయక్, సైదా నాయక్, అజ్మీర్ లింగా నాయక్, నాగు నాయక్, టక్కు రమేష్ ,శంకర్ నాయక్, మోహన్ నాయక్, సామిగాన్ తండా సైదా నాయక్, మాలోతు శ్రీను నాయక్, వాంకుడోత్ రాంబాబు నాయక్, ఆడోతు రవి నాయక్ తదితరులు ఉన్నారు.

## మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

సీఐ వెంకటయ్య




**సూర్యాపేట ప్రతినిధి సెప్టెంబర్ 16(సింగిడి):** సెప్టెంబర్ 19వ తేదీన కోదాడ పట్టణం సి సి రెడ్డి కాన్వెంట్ హాల్లో నిర్వహించే మెగా జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ సీఐ వెంకటయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్లో డిగ్రీ ద్వితీయ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెంకటేశులు తో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... జాబ్ మేళాకు సంబంధించి విద్యార్థులు రిజిస్ట్రేషన్ ను కోదాడ మెగా జాబ్ మేళా డాట్ కామ్ వెబ్ సైట్ లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి అభ్యర్థికి ప్రత్యేక క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎకనాలజీమెంట్ వస్తుం దని అభ్యర్థి గరిష్టంగా ఐదు కంపెనీల ఇంటర్వ్యూలకు ఎంపిక చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు ఎకనాలో జిమెంట్ కార్డుతో పాటు ఐదు సెట్ల జిరాక్స్ బయోడేటా ప్రతిని తప్పనిసరిగా తమ వెంట తెచ్చుకోవాలని అన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుండి జాబ్ మేళా ప్రక్రియ ప్రారంభమవుతుందని అన్నారు. అదేవిధంగా ప్రిన్సిపల్ వి వెంకటేశులు మాట్లాడుతూ ప్రస్తుత భారత దేశంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉండడంతో ఇటువంటి జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను నిరూపించు కోవాలని సూచించారు.

## సన్నధాన్యం విత్తనాల వివరాలను నమోదు చేసుకోవాలి

సెప్టెంబరు 18లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



**ఆలేరు, సెప్టెంబర్ 16(సింగిడి):** ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న వరి రకాల సాగు చేస్తున్న రైతులు తమ విత్తనాల వివరాలను సెప్టెంబరు 18వ తేదీలోగా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆలేరు సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల సూచించారు. సన్న వరి సాగును ప్రోత్సహించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల ధాన్యానికి కొనుగోలు సమయంలో క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ అందించనున్న నేపథ్యంలో రైతులు ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. గొలనుకొండ గ్రామంలో సన్న వరి పంటను, డిజిటల్ క్రాప్ సర్వేను సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఎంపిక చేసిన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి), కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, జైశ్రీరాం రకాల సన్న వరి సాగు చేస్తున్న రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నంబర్‌తో వెళ్లి విత్తనాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. డీలర్ల వద్ద కాకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన వారు, అలాగే సొంత విత్తనాలతో సన్న వరి సాగు చేస్తున్న రైతులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు సమర్పించి తమ పంట వివరాలను నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియను ఈ నెల 18లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మండలంలో ప్రైవేటు సర్వేయర్ల ద్వారా డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సర్వే నంబర్లు, సాగు చేస్తున్న పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటల వివరాల నమోదు వల్ల ప్రభుత్వ పథకాలు, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన ప్రయోజనాలు పొందేందుకు వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అంజయ్యతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.



# ఈ ఆకు కూర తింటే..!

## ఆ విషయాల్లో ఢోకా ఉండదు..

**ఈ చిన్న తప్పులు చేస్తే అమృతం కాస్తా విషంగా మారుతుంది జాగ్రత్త**

శారీరక రుగ్మతలను నయం చేయడంలో ఇది ఒక సంజీవనిలా పనిచేస్తుంది అవిశ ఆకు. అయితే, ఈ ఆకుకూరను మిగతా సాధారణ తోటకూర, పాలకూరల వలె రోజూ తినకూడదు. దీనిని తీసుకునే విధానంలో కొన్ని ఖచ్చితమైన నియమాలను పాటించకపోతే ఆరోగ్య ప్రయోజనాలకు బదులు తీవ్ర నష్టాలు వాటిల్లే ప్రమాదం ఉంది.

అవిశ ఆకు శరీరంలోని ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడానికి జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఎంతో తోడ్పడుతుంది. ముఖ్యంగా కడుపులో పుండ్లు (అల్సర్లు), నోటి పూత సమస్యలతో బాధపడేవారికి ఇది అద్భుతమైన ఔషధం. ఈ ఆకులను క్రమం తప్పకుండా సరైన పద్ధతిలో తీసుకుంటే పేగుల్లోని నులిపురుగులు నశిస్తాయి. ఇది కంటిచూపును మెరుగుపరచడానికి , రక్తహీనతను నివారించడానికి కూడా ఉపయోగపడుతుంది.

అయితే, ఈ ఆకుకూరను వారంలో ఒక్కసారి లేదా పది రోజులకు ఒకసారి మాత్రమే ఆహారంగా తీసుకోవాలి. ప్రతిరోజూ దీనిని తింటే జీర్ణవ్యవస్థ దెబ్బతినడమే కాకుండా తీవ్రమైన విరేచనాలు అయ్యే అవకాశం ఉంది. కాబట్టి దీనిని అమితంగా కాకుండా అమృతంలా మితంగానే వాడాలి.

ఈ ఆకుకూరను వండేటప్పుడు చేసే అతి పెద్ద తప్పు ఏమిటంటే.. దీనిని సరిగ్గా ఉడికించకపోవడం. అవిశ ఆకు చాలా గట్టిగా ఉంటుంది, కాబట్టి దీనిని మెత్తగా ఉడికించిన తర్వాతే కూరగానో లేదా పప్పులోనో వాడుకోవాలి. పచ్చిగా లేదా సగం ఉడికిన ఆకులను తింటే కడుపునొప్పి వచ్చే ప్రమాదం ఉంది. అలాగే ఈ ఆకుకూర తిన్న రోజున












చికెన్, మటన్ వంటి మాంసాహారాన్ని అస్సలు తీసుకోకూడదు. ఎందుకంటే అవిశ ఆకు మరియు మాంసాహారం రెండూ విరుద్ధ ఆహారాలు. ఇవి కలిసి శరీరంలో చేరితే జీర్ణక్రియ మందగించి, గ్యాస్ మరియు కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తీవ్రతరం చేస్తాయి.

మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఏదైనా ఆరోగ్య సమస్య కోసం ఆయుర్వేద లేదా అల్లోపతి మందులు వాడుతున్న వారు అవిశ ఆకును తినకపోవడమే మంచిది. ఎందుకంటే ఈ ఆకులో ఉండే శక్తివంతమైన మూలకాలు మనం వేసుకునే మందుల ప్రభావాన్ని తగ్గించివేస్తాయి. అలాగే గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు కూడా దీనిని నిపుణుల సలహా మేరకే తీసుకోవాలి. సాధారణంగా ఈ ఆకును ఉదయం లేదా మధ్యాహ్నం భోజనంలో తీసుకోవడం ఉత్తమం.

రాత్రి వేళల్లో దీనిని తింటే అరగడం చాలా కష్టమవుతుంది. ఈ చిన్న చిన్న నియమాలను పాటిస్తూ అవిశ ఆకును తింటే, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా పూర్తి ఆరోగ్యాన్ని మన సొంతం చేసుకోవచ్చు.

# S i n g i d i   Market

## రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్‌లో

# ఈడీ సోదాలు




దిల్లీ: బెంగళూరుకు చెందిన ప్రముఖ జ్యువెలరీ రిటైల్ సంస్థ రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌లో ఈడీ సోదాలు నిర్వహించింది. కంపెనీకి చెందిన పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫారిన్ ఎక్స్ఛేంజీ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద ఈ చర్యలు తీసుకున్నారు. ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో కంపెనీ, దాని ప్రమోటర్ అయిన రాజేశ్ మెహతాను సెక్యూరిటీ మార్కెట్ల నుంచి తాత్కాలిక నిషేధించిన విషయం తెలిసిందే.

స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేసే అనుబంధ సంస్థ స్టాండ్‌లోన్ ఆదాయం చాలా తక్కువగా ఉండగా.. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ మాత్రం దాన్ని పెంచి చూపించినట్లు సెబీ దర్యాప్తులో గుర్తించింది. 2021-2025 ఆర్థిక సంవత్సరాల మధ్య భారీ ఆదాయం సమకూరినట్లు కంపెనీ తప్పుడు ప్రచారం చేసుకుందని సెబీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రెగ్యులేటరీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తదుపరి ఆదేశాల వచ్చేంత వరకు ఎలాంటి విక్రయాలు జరపొద్దని తెలిపింది. కాగా సెబీ ఆరోపణలను రాజేశ్ మెహతా తోసిపుచ్చారు. ఆర్థిక వివరాలు సరిగ్గానే ఉన్నాయని పేర్కొనడం గమనార్హం.

## గ్రామీణ వినియోగదారుల కోసం రూ.259కే బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్

ప్రభుత్వరంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ గ్రామీణ ప్రాంత వినియోగదారుల కోసం కొత్త ఎంట్రీ లెవల్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. రూ. 259కే ఇంటర్నెట్ సేవలతో పాటు, అపరిమిత కాల్స్‌ను అందించనుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు వేగవంతమైన డిజిటల్ కనెక్టివిటీని అందించడమే లక్ష్యంగా ఈ ప్లాన్‌ను తీసుకొచ్చింది.




ఈ ప్లాన్‌లో భాగంగా 25 ఎంబీపీఎస్ (700 జీబీ వరకు) వేగంతో డేటా లభిస్తుంది. లిమిట్ తర్వాత వేగం 2 ఎంబీపీఎస్‌కు తగ్గుతుంది. బ్రాడ్‌బ్యాండ్ తీసుకున్నవారికి మోడెమ్, ఉచిత ఇన్‌స్టలేషన్ సదుపాయం ఉంటుందని బీఎస్ఎన్ఎల్ పేర్కొంది. ప్రభుత్వ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ వేవ్స్ ఓటీటీ ఉచిత సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది. దీనిద్వారా లైవ్‌టీవీ, మూవీస్‌ను ఆనందించొచ్చు. 1800 4444 లేదా ruralftth.bsnl.in వెబ్‌సైట్ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ తీసుకోవచ్చు.ు.




### ఏఐతో ఐటీ సంస్థలకు

# ముప్పులేదు

### నందన్ నీలేకని కీలక వ్యాఖ్యలు




**దిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగాలతో పాటు సంప్రదాయ ఐటీ సంస్థలనూ భర్తీ చేస్తుందన్న వాదనలను ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు, ఛైర్మన్ నందన్ నీలేకని తోసిపుచ్చారు. ఐటీ సంస్థల స్థానాన్ని ఏఐ భర్తీ చేయబోదని, పైగా వాటి సామర్థ్యాన్ని మరింత ఇనుమడింపజేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు సంస్థ 45 వార్షిక సాధారణ సమావేశంలో ఐటీ రంగం ఉనికి గురించి ఆయన మాట్లాడారు. 2030 నాటికి 400 బిలియన్ డాలర్ల భారీ ఏఐ ఫస్ట్ సేవల అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి తమ సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు.

జనరేటివ్‌ఏఐ వచ్చి మూడేళ్లకు పైగా అయినప్పటికీ ఇన్ఫోసిస్ గతం కంటే మిన్నగా, రాబోయే దశాబ్దానికి అనువైన దశలో ఉందని నందన్ నీలేకని పేర్కొన్నారు. అద్భుతమైన కోడింగ్ టూల్స్ అందిపుచ్చుకుని తమ ఉత్పాదకతను మరింత మెరుగుపరుస్తున్నామని పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లైఫ్ సైకిల్‌లో ఇంకా చేయాల్సింది చాలా ఉందని అభిప్రాయపడ్డారు. ఇన్ఫోసిస్ లాంటి సంస్థలను ఏఐ భర్తీ చేయబోదన్నారు. ఏఐని అందిపుచ్చుకోవడంలో ముందుండే కంపెనీలను మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఏఐ విప్లవంలో అధునాతన పద్ధతులను అందిపుచ్చుకోవడం అవసరమని, ఆ పని ఇన్ఫోసిస్ చేస్తోందన్నారు. తన టాప్ 200 క్లయింట్లలో 90 శాతం కంపెనీల ఏఐ జర్నీలో ఇన్ఫోసిస్ తోడ్పడుతోందని ఈ సందర్భంగా తెలిపారు.

## ఐటీ, మెటల్ స్టాక్స్‌లో అమ్మకాలు.. 24వేల దిగువకు నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలు నష్టాలు చవిచూశాయి. ఆరంభంలో స్వల్ప నష్టాలకే పరిమితమైన సూచీలు.. ఆఖర్లో భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. ముఖ్యంగా మెటల్, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 850 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 24వేల పాయింట్ల దిగువకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 77,086.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,094.07) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో మోస్తరు లాభనష్టాల్లో కదలాడిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత భారీ



నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,082.51 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 893.39 పాయింట్ల నష్టంతో 76,200.68 వద్ద ముగిసింది. నిఫ్టీ 278.80 పాయింట్ల నష్టంతో 23,824.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.74గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. మిగిలినవన్నీ నష్టాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, బీఈఎల్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 77.49 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4130 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దాదాపు అన్ని ప్రపంచ మార్కెట్లూ నష్టాల్లోనే ముగిశాయి

# సైబర్ నేరగాళ్ల నయా మోసం..!



వ్యక్తులకు లింకులు పంపించడం, మాయ మాటలు చెప్పో.. భయపెట్టో వారి నుంచి అందినకాడికి దోచుకోవడం సైబర్ నేరగాళ్లు చేసే పని. ఇప్పుడు కేటుగాళ్లు కొత్త పంథా ఎంచుకున్నారు. కంపెనీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. బాస్ పేరిట సందేశాలు పంపిస్తూ పెద్ద మొత్తంలో దోచుకుంటున్నారు. ఈ తరహా మోసాల పట్ల వ్యక్తులు, కంపెనీలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి చెందిన సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ హెచ్చరికలు జారీ చేసింది. ఇంతకీ ఏమిటీ బాస్ స్కామ్? ఎలా మోసగిస్తున్నారు?

**బాస్ స్కామ్ అంటే?**

సైబర్ నేరగాళ్లు ఒక సంస్థలోని సీఈవో (జజూా) లేదా ఇతర ఉన్నతోద్యోగుల పేర్లను ఉపయోగించుకుని ఆ సంస్థలో పనిచేసే ఉద్యోగులను మోసం చేసే విధానాన్నే బాస్ స్కామ్ అంటారు. పై అధికారుల ఆదేశాలను సాధారణంగా ఉద్యోగులు తూ.చ. తప్పకుండా పాటిస్తుంటారు. దీన్నే ఆసరగా చేసుకుని కింది స్థాయి ఉద్యోగుల నుంచి డబ్బులు బదిలీ చేయించుకోవడం లేదా రహస్య సమాచారాన్ని తస్కరించడం ఈ స్కామ్ ముఖ్య ఉద్దేశం.

తొలుత సీఈవోలు, ఉన్నతాధికారులకు సైబర్ నేరగాళ్లు వల పన్నుతారు. ఆర్‌బీఐ వంటి ప్రభుత్వ నియంత్రణ సంస్థల పేరుతో కంపెనీ సీఈవోలకు వాట్సాప్ లేదా ఇ-మెయిల్ సందేశాలు పంపుతారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారంటూ ఒక జిప్ ఫైల్‌ను సెండ్ చేస్తారు. ఆ ఫైల్‌ను సీఈవో ఓపెన్ చేయగానే మాల్‌వేర్ సిస్టమ్‌లోకి ప్రవేశిస్తుంది. చాలా కేసుల్లో సీఈవోలు ఆయా సందేశాలను తమ ఫైనాన్స్ ఆఫీసర్లకు పంపించినట్లు ×4జ పేర్కొంది.

ఆ మాల్‌వేర్ ద్వారా సైబర్ నేరగాళ్లు వాట్సప్ వెబ్ సెషన్లను హ్యాక్ చేసి, వారి అఫీషియల్ కమ్యూనికేషన్లను తమ అధీనంలోకి తీసుకుంటారు. ఆ తర్వాత ఆ నంబర్ నుంచి ఫైనాన్స్ టీమ్‌కు మెసేజ్‌లు పంపి, అత్యవసరంగా డబ్బులు బదిలీ చేయాలని ఆదేశిస్తారు.

**ఎలా జాగ్రత్తపడాలి?**

వాట్సప్ లేదా ఇ-మెయిల్ ద్వారా డబ్బులు పంపాలని లేదా అకౌంట్ వివరాలు మార్చాలని పై అధికారుల నుంచి ఆదేశాలు వస్తే వెంటనే వారికి నేరుగా ఫోన్ చేసి లేదా స్వయంగా కలిసి కనుక్కోవాలి. తెలియని సోర్సెస్ నుంచి వచ్చే ఫైల్స్ లేదా అటాచ్‌మెంట్లను డౌన్‌లోడ్ చేయకూడదు. ఆర్‌బీఐ వంటి సంస్థలు ఎప్పుడూ వాట్సప్ వంటి మార్గాల ద్వారా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు పంపించబోవని గుర్తుంచుకోవాలి. వాట్సప్‌లో మీ ప్రమేయం లేకుండా ఏవైనా ఇతర డివైజెస్ (ాఱఅనివస ణవజఱషివం) కనెక్ట్ అయి ఉన్నాయేమో ఎప్పటిప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలి. కంప్యూటర్లలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసిన యాంటీ-మాల్‌వేర్ టూల్స్ వాడాలి. అనధికారిక ఫైల్స్‌ను బ్లాక్ చేసేలా విండోస్ సిస్టమ్స్‌లో సెట్టింగ్స్ మార్చుకోవాలి.





## మళ్లీ టెలిగ్రామ్ అందుబాటులోకి..

ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ తిరిగి యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. గూగుల్ ప్లేస్టోర్‌లో కూడా దీనిని పునరుద్ధరించారు. ప్రస్తుతానికి యాపిల్ యాప్‌స్టోర్‌లో మాత్రం డీలిస్ట్ అయ్యే కనిపిస్తోంది. నీట్ రీటెస్ట్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై జూన్ 16న కేంద్రం తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో ఈ నెల 22 వరకు టెలిగ్రామ్ యాప్‌పై, ఈ నెల 30 వరకు మెసేజింగ్ ఎడిటింగ్ ఫీచర్‌పై ఆంక్షలు విధించింది. ఆ పేపర్ లీక్ వ్యవహారంలో ఎన్‌టీఏ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుంది. గతనెల 3న జరిగిన నీట్ ప్రశ్న పత్రాలు లీకైన నేపథ్యంలో దాన్ని రద్దు చేసి.. 'నీట్ - యూజీ'ని ఈనెల 21న తిరిగి నిర్వహించారు.

ప్రభాతనవ SINGIDI తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం
17-9-2026

# విద్యే పిల్లలకు ప్రభుత్వం అందించే గొప్ప ఆస్తి

**కరీంనగర్‌లో రూ.8 కోట్లతో సామూహిక వంటశాల ప్రారంభం**

**49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం**

**ఆహార తయారీ, పాత్రల శుభ్రత, కూరగాయల శుభ్రపరిచే ప్రక్రియలకు ఆధునిక యంత్రాల ఏర్పాటు,**

**రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**





**కరీంనగర్, (సింగిడి):** పిల్లలకు ప్రభుత్వం అందించగలిగే గొప్ప ఆస్తి విద్యేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య, అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతులకు రాకుండా పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడమే పాఠశాల అల్పాహార కార్యక్రమం ఉద్దేశమన్నారు. కరీంనగర్ మార్కెట్ యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా భాగస్వామ్యంతో సుమారు రూ. 8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సామూహిక వంటశాలను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం వంటశాలలోని ఆధునిక పరికరాలు, ఆహార తయారీ విభాగాలను పరిశీలించారు. ఆకలితో ఉన్న విద్యార్థులు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేరని మంత్రి పేర్కొన్నారు. నాణ్యమైన అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఏకాగ్రత, హాజరు, సమయపాలన, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమం పేద, మధ్య తరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు సమయ, ఆర్థిక పరంగా ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై దృష్టి సారించే అవకాశం ఉంటుందని చెప్పారు.

**49,025 మంది విద్యార్థులకు అల్పాహారం..**

కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సామూహిక వంటశాలకు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 49,025 మంది విద్యార్థులకు ఇక్కడి నుంచి అల్పాహారం అందుతుందని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులు ప్రయోజనం పొందుతారని చెప్పారు. వారంలో ఆరు రోజులు ఇడ్లీ, సాంబార్, పూరీ, ఆలూ కుర్మా, దోశ, చట్నీ, ఉప్మా, చట్నీ, చిరుధాన్యాల ఇడ్లీ, సాంబార్, బోండా, చట్నీ అందించనున్నట్లు తెలిపారు. రోజు విడిచి రోజు పాలు కూడా అందిస్తామన్నారు. ఆహార తయారీ, పాత్రల శుభ్రత, కూరగాయల శుభ్రపరిచే ప్రక్రియలకు ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేశామని, ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మెనూ రూపకల్పనలో జాతీయ పోషకాహార సంస్థ సహకారం తీసుకున్నట్లు తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా విస్తరణకు ప్రణాళిక...**

2024 డిసెంబర్‌లో కొడంగల్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన పాఠశాల అల్పాహార కార్యక్రమంతో విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు మంత్రి తెలిపారు. ఏకాగ్రత, తరగతి గది భాగస్వామ్యం, సమయపాలనలోనూ మెరుగుదల కనిపించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా కార్యక్రమాన్ని విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. 23,106 ప్రభుత్వ పాఠశాలలను పరిధిలోకి తీసుకురావడంతో పాటు 31 జిల్లాల్లో 31 కేంద్రీకృత వంటశాలలు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం సుమారు రూ. 245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు వెల్లడించారు. కార్యక్రమం అమలులో భాగస్వామిగా ఉన్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియాకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అంగుళం సుద్దముక్కపై ప్రధాని మోదీ ప్రతిమ




**కోదాడ, (సింగిడి):** కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు వేగ్గలం నరేష్‌చారి తన ప్రతిభను మరో సారి చాటుకున్నారు. అంగుళం సుద్ద ముక్కపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూక్ష్మ ప్రతిమను చెక్కి ఆకట్టుకున్నారు. అత్యంత చిన్న పరిమాణంలో ప్రతిమను రూపొందించేందుకు ఏకాగ్రత, నైపుణ్యంతో పనిచేసినట్లు తెలిపారు. వివిధ ప్రముఖులు, కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిమలను సూక్ష్మ కళారూపాల్లో రూపొందిస్తూ తన కళను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నానన్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుకుంటానని నరేష్‌చారి తెలిపారు. ఆయన కళాత్మక ప్రతిభను పలువురు అభినందించారు.

# గణనాథుని కొలువులో.. జాగ్రత్తే కీలకం!

**సీపీ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల, (సింగిడి):** వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్న వేళ.. గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు కీలకంగా మారాయి. భక్తుల రద్దీ, విద్యుత్ అలంకరణలు, మండపాల వద్ద రాత్రివేళ కార్యకలాపాలు వంటి అంశాల్లో నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఉత్సవాల నిర్వహణలో భక్తి ఎంత ముఖ్యమో.. భద్రత కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను సీపీ సందర్శించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. ఉత్సవాలను పోలీసుల అనుమతులు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా కార్యక్రమాలు చేపట్టరాదని, మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. గణేష్ మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న నేపథ్యంలో వైరింగ్ విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సూచించారు. తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, వైర్లు, అలంకరణల ఏర్పాటు సమయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రమాదాలకు అవకాశం ఉంటుందని, అందువల్ల భద్రతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు. మండపాల వద్ద నిర్వాహకులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని, భద్రతను పర్యవేక్షించేందుకు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉత్సవాల నేపథ్యంలో పోలీస్ శాఖ కూడా నిరంతరం అప్రమత్తంగా ఉందని సీపీ తెలిపారు. పెట్రోల్ కార్లు, బ్లూకోట్స్ సిబ్బందితో 24 గంటలూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ పోలీసు అధికారులు గణేష్ మండపాలను సందర్శిస్తూ భద్రతా ఏర్పాట్లు, భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఇతర పరిస్థితులను పరిశీలిస్తున్నారని తెలిపారు. మండపాల వద్ద ఏవైనా అనుకోని సంఘటనలు చోటుచేసుకున్నా.. అనుమానాస్పద వ్యక్తులు లేదా పరిస్థితులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీపీ సూచించారు. చిన్న అనుమానాన్ని కూడా నిర్లక్ష్యం చేయకుండా పోలీసుల దృష్టికి తీసుకురావడం ద్వారా ముందస్తుగా సమస్యలను నివారించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని సీపీ తెలిపారు. అయితే పోలీసుల భద్రతా చర్యలతో పాటు మండపాల నిర్వాహకులు, భక్తుల సహకారం కూడా అవసరమన్నారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తే ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్, ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు తదితర పోలీసు అధికారులు ఉన్నారు.

# బీఆర్ఎస్ భూములపై త్వరలో బీజేపీ దండయాత్ర

**భూములను స్వాధీనం చేసుకుని?**

**పేదలకు పంచుతామని కేంద్ర మంత్రి సంజయ్ వెల్లడి**



**కరీంనగర్, (సింగిడి):** బీఆర్ఎస్ నేతలు కబ్జా చేశారని ఆరోపిస్తున్న భూములపై బీజేపీ ఆధ్వర్యంలో త్వరలో దండయాత్ర చేపడతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. ఆ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచేలా పోరాటం చేస్తామని తెలిపారు. కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లతో కలిసి మానకొండూర్ చెరువు పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిమజ్జన ఏర్పాట్లకోసం రూ. 1.5 కోట్లు కేటాయించామని, గతేడాదితో పోలిస్తే మూడు రెట్లు అధికంగా నిధులు కేటాయించామని చెప్పారు. అవసరమైన క్రేన్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు నిమజ్జనానికి మూడు రోజుల ముందే నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి బీఆర్ఎస్ నేతల భూవ్యవహారాలపై చేసిన వ్యాఖ్యలను బండి సంజయ్ ప్రస్తావిస్తూ, గతంలో తాను బీఆర్ఎస్ భూదోపిడీపై మాట్లాడినప్పుడు తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానన్నారు. వేల ఎకరాల భూముల వ్యవహారంపై వివరాలు వెల్లడించడానికి ఇంతకాలం ఎందుకు పట్టిందని ప్రశ్నించారు. భూములపై విచారణ పేరుతో ప్రభుత్వం బీఆర్ఎస్‌తో ఒప్పందానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. వివిధ కేసుల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాల పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. జిల్లాల కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇస్తే భూములపై 24 గంటల్లో నివేదికలు ఇవ్వగలరని పేర్కొన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, ఫార్ములా రేస్, గొర్రెల పథకం తదితర అంశాల్లోనూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ, అటవీ భూములను ఆక్రమించారని ఆరోపిస్తూ, వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో ప్రభుత్వ భూమి ఉందని గుర్తించడానికి 33 నెలలు ఎందుకు పట్టిందని బండి సంజయ్ ప్రశ్నించారు. విలువైన ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ భూముల వ్యవహారాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని, ఆ రెండు పార్టీల మధ్య చీకటి ఒప్పందం ఉందని బండి సంజయ్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల కోసం అవసరమైన నిధుల విషయంలో బీఆర్ఎస్ సహకరిస్తుందన్నది తన అభిప్రాయమని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు ఆక్రమించారని ఆరోపిస్తున్న భూములపై బీజేపీ ఆధ్వర్యంలో త్వరలోనే దండయాత్ర చేపట్టి, వాటిని పేదలకు పంచేలా పోరాటం చేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ అవగాహనపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చిత్ర మిశ్రా, సిపి గౌస్ ఆలం, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్షకు అడ్డుకట్ట వేయాలి

**రేపల్లె బాధిత దళిత కుటుంబానికి న్యాయం చేయాలి : అఖిలపక్ష కమిటీ**



**గద్వాల ప్రతినిధి (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా రేపల్లె గ్రామంలో ప్రేమ వివాహం విషయంలో దళిత యువకుడి ఇంటిని అమ్మాయి తరపు వారు కూల్చివేసిన ఘటనపై అఖిలపక్ష, బహుజన, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్, ఎస్పీకి మెమోరాండం సమర్పించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కూల్చివేసిన ఇంటిని పునర్నిర్మించి, నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించాలని కోరారు. ఇంటి కూల్చివేతకు పాల్పడిన వారిని అరెస్టు చేసి, గ్రామ సర్పంచ్ పాత్రపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాల విషయంలో జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామస్థాయిలో కుల వివక్ష నిర్మూలన, చట్టాలు, హక్కులపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగరుదొడ్డి వెంకట రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు, సిపిఎం కార్యదర్శి వెంకటస్వామి, టీపీఫ్ రాష్ట్ర కోశాధికారి శంకర్ ప్రభాకర్, న్యాయవాది మధుసూదన్ బాబు, ఎం.డి. సుభాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగి లోనే సర్కిల్ కార్యాలయాన్ని కొనసాగించాలి : కే విష్ణువర్ధన్ రెడ్డి




**రాజేంద్రనగర్, (సింగిడి):** నార్సింగి సర్కిల్ కార్యాలయాన్ని మణికొండకు తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఉన్న నార్సింగిలోనే సర్కిల్ కార్యాలయాన్ని యథాతథంగా కొనసాగించాలని బీఆర్ఎస్ నార్సింగి సర్కిల్ అధ్యక్షుడు కే. విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రస్తుతం సర్కిల్ ఆఫీస్ ఉన్న ప్రాంతం ప్రజలకు రాకపోకలు సాగించడానికి, పనులు పూర్తి చేసుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉందని ఆయన తెలిపారు. ఒకవేళ ఈ కార్యాలయాన్ని మణికొండకు తరలిస్తే నార్సింగి పరిధిలోని పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జొన్నవాడ, మిర్జాగూడ, గండిపేట్, నాగులపల్లి, ఖానాపూర్, కోకాపేట్ తదితర ప్రాంతాల ప్రజలకు కార్యాలయం దూరమై, ప్రయాణ భారం సమయం వృథా అవుతుందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి తరలింపు నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలని విష్ణువర్ధన్ రెడ్డి కోరారు.

# గోదావరి పుష్కరాలను సందర్శించి పరిశీలించిన సిపి

**భక్తులకు సౌకర్యాల కల్పనపై ప్రణాళికలు రూపొందించాలి...**





**ఆర్మూర్, (సింగిడి):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మెండోరా మండలంలోని పోచంపాడు గ్రామ శివారులో గల శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు వద్ద ఉన్న పుష్కర ఘాట్లను గురువారం రోజు జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సందర్శించి పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏడాదిలో జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రత, భక్తులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలు కల్పించేలా సంబంధిత అధికారులు సమిష్టిగా కలిసి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సంబంధిత అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో జిల్లా సి.పి. చర్చించారు. పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అనుకూలమైన మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు. లక్షలాదిమంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, నిరంతర పిసి కెమెరాల నిఘా, తాత్కాలిక పోలీస్ సహాయ కేంద్రాలు, వైద్య శిబిరాలు, తాగునీరు, పారిశుద్ధం చర్యలు చేపట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పుష్కరాలను జయప్రదంగా కొనసాగేలా పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు.

# కస్తూరిబాలో విద్యార్థినిలకు దుస్తులు పంపిణీ


**పాల్గొన్న ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు**




**ఆర్మూర్(సింగిడి):** బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ గ్రామంలో గల కస్తూరిబా విద్యాలయంలో గురువారం రోజున స్థానిక సర్పంచ్ భోగ నిత్యానంద్, ఉప సర్పంచ్ సామా శ్రీనివాస్ అధ్యక్షతన, మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కూరి ఆనంద్, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యాల రాములు ఆధ్వర్యంలో మాజీజిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ కార్యదర్శి గిర్మాజి గోపి, కమ్మర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బద్దం మహిపాల్, ఎం.డి. నవీదు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధి ఆర్. మనోజ్, మండల మైనార్టీ ప్రెసిడెంట్ ఎం.డి. అంజాద్, మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఏ. రమేష్, ఎస్సీ మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ నాగభూషణం, మండల కార్యదర్శి సి. హెచ్. రవి, పట్టణ వైస్ ప్రెసిడెంట్ కే. శ్రీధర్, పలువురు నాయకులు విచ్చేసి కస్తూర్బా విద్యాలయం లో గల విద్యార్థినిలకు యూనిఫామ్ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, విద్యార్థినిల, విద్యార్థుల విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చి అన్ని విధాల కృషి చేస్తుందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తూ, ఈ బృందం నిరంతరం కృషి చేస్తూ ప్రజల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ముందుకు సాగుతుందని వారన్నారు. విద్యార్థినిలు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ షేక్ మన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకులు షేక్ షఫీ, ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# కేసుల విచారణలో నాణ్యతే లక్ష్యం: ఎస్పీ రాజేష్ చంద్ర

**ఆధునిక పోలీసింగ్ సాఫ్ట్‌వేర్‌లపై జిల్లా స్థాయి రైటర్లకు శిక్షణ**





**కామారెడ్డి రూరల్, (సింగిడి):** కామారెడ్డి జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లు, సీఐ కార్యాలయాలు మరియు డీఎస్పీ కార్యాలయాల రైటర్లకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం రోజు సీసీటీఎన్ఎస్-2.0 మరియు ఇతర ఆధునిక పోలీసింగ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర పాల్గొని రైటర్లకు పలు కీలక సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే ప్రతి బాధితుడికి వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందన్నారు. బాధితుల సమస్యల పరిష్కారంలో రైటర్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. కేసుల దర్యాప్తు, విచారణ, పరిశోధనలో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన దశ నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి వివరాన్ని సమగ్రంగా, స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సాక్షులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు కేసుల విజయవంతమైన విచారణలో కీలక పాత్ర పోషిస్తాయని, తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం కేసులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆంఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి అవగాహనతో పని చేసి, నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. సీసీటీఎన్ఎస్-2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు చేరువగా అందించవచ్చని పేర్కొన్న ఎస్పీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా దర్యాప్తు నాణ్యతతో పాటు ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. "బాధితుడికి సమయానికి న్యాయం లభిస్తేనే చట్టంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. ఆ విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి పోలీసు అధికారికి ఉన్న అత్యంత ముఖ్యమైన బాధ్యత" అని ఎస్పీ గారు స్పష్టం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఇతర పోలీసు అధికారులు, జిల్లా లోని అని పోలీస్ స్టేషన్ రైటర్లు, సీఐ డీఎస్పీ కార్యాలయాల రైటర్లు పాల్గొన్నారు.

# నూతన బోధనా విధానాలతో విద్యలో కొత్త దిశ

**చైతన్య విద్యానికేతన్‌లో టీచర్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్**



**భిక్కనూర్, (సింగిడి)::** భిక్కనూర్‌లోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు టీచర్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహీంద్రా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచర్ ట్రైనర్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ రిసోర్స్ పర్సన్ డా. రవి కుమార్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులు, విద్యార్థులను ఆసక్తిగా నేర్పించే విధానాలు, తరగతి గది నిర్వహణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ రేణు కుమార్ భూర్ల మాట్లాడుతూ, ఉపాధ్యాయులు కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకుంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించగలరని అన్నారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని మరింత పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభాతవర సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi గురువారం 17-9-2026

# రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థులు

**జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి ఎంపిక**
**అభినందించిన ఆల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి**



సుల్తానాబాద్, (సింగిడి):రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థులు ఎంపికయ్యారని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ నిష్ణాతులైన అధ్యాపకుల ఆధ్వర్యంలో నిరంతరం శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణతో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు జి.సాయి కీర్తన,పి.హర్షిత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సెప్టెంబర్ 16 నుంచి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లోవీరుపాల్గొననున్నారనిచెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని నరేందర్ రెడ్డి ఆకాంక్షించారు. విద్యార్థుల విజయం పై ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమం లోప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం,విద్యార్థులుపాల్గొన్నారు.

# రైలు..రోడ్డు మార్గాలపై నిఘా పటిష్ఠం!

**సీపీ అంబర్ కిషోర్ ఝా**



మంచిర్యాల, (సింగిడి): రామకృష్ణాపూర్.. పారిశ్రామిక ప్రాంతంతోపాటు హైవే, రైల్వే మార్గాలకు అనుసంధానంగా విస్తరిస్తున్న ప్రాంతం. కొత్త కాలనీలు ఏర్పడుతుండటంతో జనాభా పెరుగుతోంది. అదే సమయంలో రాకపోకలు, వాణిజ్య కార్యకలాపాలు అధికమవుతున్నాయి. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు రహదారి భద్రత, మహిళలు, వృద్ధుల రక్షణ, మాదకద్రవ్యాల నియంత్రణపై పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ తదితర అంశాలపై ఎస్ఐ శ్రీధర్‌ను సీపీ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించేలా దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. నేరాల నియంత్రణలో ముందస్తు సమాచారం కీలకమని, అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచాలని ఆదేశించారు. రైలు, రోడ్డు మార్గాల ద్వారా గంజాయి అక్రమ రవాణాకు అవకాశం లేకుండా నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సీపీ సూచించారు. స్థానికంగా అందే సమాచారాన్ని విశ్లేషిస్తూ అనుమానితుల కదలికలను గుర్తించాలని, అవసరమైన చోట తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల ప్రభావం యువతపై పడకుండా అవగాహన కార్యక్రమాలతోపాటు అక్రమ రవాణా మూలాలను గుర్తించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో ఒంటరిగా నివసించే వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీపీ ఆదేశించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో క్రమం తప్పకుండా పర్యటిస్తూ భద్రతా పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. వృద్ధుల రక్షణకు ప్రత్యేక ప్రామాణిక కార్యాచరణ విధానం (SOP) రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో పోలీసులను సులభంగా సంప్రదించేలా విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆస్తి నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని సీపీ పేర్కొన్నారు. ప్రజల సహకారంతో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేయించి నేరాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధిస్తున్న పోలీసు సిబ్బందిని అభినందించారు. నేరం జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా.. నేరం జరగకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను సీపీ పరిశీలించారు. ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచడంతోపాటు వాటి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. రిసెప్షన్ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ ప్రొటెక్టర్‌తో సీపీ మాట్లాడి ఆన్‌లైన్‌లో కేసుల వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ఎప్పటికప్పుడు వివరాలను నవీకరించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు, బాధితుడితో మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సీపీ స్పష్టం చేశారు. బాధితుల సమస్యను పూర్తిగా తెలుసుకుని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా టీ స్పందన, అందుబాటు, పారదర్శకత ముఖ్యమని సూచించారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ బాగుందని సీపీ పేర్కొన్నారు. సిబ్బంది శారీరక దృఢత్వంతోపాటు విధుల నిర్వహణ, రికార్డుల క్రమబద్ధీకరణ, స్టేషన్ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఐ, ఎస్ఐలకు సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తనిఖీ సందర్భంగా సీఐ రమేష్, ఎస్ఐ శ్రీధర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యం

**మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ**
**7వ వార్డులో పల్లె దవాఖాన,**
**ఎస్ఐఆర్ కార్యక్రమాల పరిశీలన**





సుల్తానాబాద్, (సింగిడి): ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సుల్తానాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ ప్రత్యేక చొరవ చూపారు. పట్టణంలోని 7వ వార్డులో నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ కార్యక్రమంతో పాటు పల్లె దవాఖానను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదేశాలు మేరకు 7వ వార్డు కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్‌తో కలిసి చైర్ పర్సన్ పల్లె దవాఖానను సందర్శించారు. డాక్టర్ సింధుజ, వైద్య సిబ్బందిని కలిసి అందుతున్న వైద్యసేవలవివరాలనుఅడిగితెలుసుకున్నారు. అలాగే చికిత్స కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయి, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం 7వ వార్డులో కొనసాగుతున్న సర్ కార్యక్రమాన్ని చైర్ పర్సన్ పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలను, స్థానిక ప్రజలను కలిసి కార్యక్రమ అమలుపై వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా అవసరమైన సహకారం అందించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ ఈర్ల స్వరూప శేఖర్, 15వ వార్డు కౌన్సిలర్ గాదాసు మంజుల రవీందర్, జిపిఓ మహేందర్ రెడ్డి, బిఎల్ వో లు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం చదువు నేర్పాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**





నిర్మల్ ప్రతినిధి, (సింగిడి):మంగళవారం ముథోల్ కేజీబీవీను (కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం) కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బందికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులకు అన్నిపూటల మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని తరగతులకు సంబంధించిన సిలబస్ ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలన్నారు. ప్రతిరోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల బోర్డు పరీక్షలకు ఇప్పటినుంచే ప్రణాళిక ప్రకారం వారిని సిద్ధం చేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి, ఇప్పటివరకు పూర్తయిన సిలబస్, రోజువారిగా అందిస్తున్న భోజనం, వసతి, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి పలు లెక్కలను బోర్డుపై విద్యార్థులతో చేయించి, లెక్కలు చేసిన విద్యార్థులను అభినందించి, పెన్నులను బహుమతులుగా ఇచ్చారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. ఏ సబ్జెక్టులో అయినా ఎటువంటి సందేహాలు ఉన్న వెంటనే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమీపంలో నిర్మాణం చివరి దశకు చేరుకున్న పాఠశాల భవంతిని కలెక్టర్ పరిశీలించారు. మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి భవనాన్ని వినియోగానికి తేవాలని తెలిపారు. ఈ తనిఖీలో డీఈవో భోజన్న, తహసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో లవ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది,

# మహిళలకు ఆరోగ్యమే అసలైన ఆస్తి

**చిన్ననాటి నుంచే ఆరోగ్యకరమైన**
**అలవాట్లు అలవర్చుకోవాలి**



సుల్తానాబాద్, (సింగిడి):: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని నేషనల్ హెల్త్ మిషన్-ఎన్‌జీవో సుబ్రహ్మణ్యం ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ హెల్త్ డిపార్ట్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి అనూష సూచించారు. సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష, టి. శిరీష మాట్లాడుతూ సమతుల్య ఆహారం,వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాయామం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. విద్యార్థినులు చిన్ననాటి నుంచే ఆరోగ్య కరమైన అలవాట్లు పెంపొందించుకోవాలని, మానసిక ఆరోగ్యంపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, వైస్ ప్రిన్సిపల్ సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

# విజయకుమార్ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం

**విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ**
**శ్రీవాణి విద్యసంస్థల అధినేత శశాంక**





సుల్తానాబాద్, (సింగిడి): సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శ్రీవాణి కళాశాలలో స్వర్గీయ రేకులపల్లి విజయకుమార్ ఆరో వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేకులపల్లి శశాంక ఆధ్వర్యంలో విజయకుమార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి తమవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వర్గీయ రేకులపల్లి విజయకుమార్ ఆశయాలను స్మరించుకుంటూ విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆయన దివ్య ఆశీస్సులు మనం దరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఈ సందర్భంగా కోరుకున్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ లు బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# 22ఏ జాబితాపై నిజాలు నిగ్గు తేల్చాలి!



మంచిర్యాల, (సింగిడి):22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో పారదర్శకత పాటించాలని, భూముల బదలాయింపులు, కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బి. సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో తెలంగాణలోని విలువైన భూముల విషయంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు పూర్తి సమాచారం అందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, సీలింగ్ భూములు, దేవాదాయ భూములు తదితర వర్గాలకు చెందిన భూముల వివరాలను సమగ్రంగా వెల్లడించాలని కోరారు. ఇప్పటివరకు ప్రభుత్వ భూముల్లో ఎంత విస్తీర్ణాన్ని ప్రైవేటు సంస్థలకు, కంపెనీలకు లేదా ఇతర సంస్థలకు కేటాయించారు? ఏ ప్రాతిపదికన కేటాయించారు? ఎంత భూమి ఇంకా ప్రభుత్వ ఆధీనంలో ఉంది? అనే అంశాలపై మండలాల వారీగా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. 22ఏ కింద నమోదైన భూముల విషయంలో ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిజంగా నిషేధిత భూములు ఏవి? వాటి విస్తీర్ణం ఎంత? వాటిలో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, సీలింగ్ భూములు, దేవాదాయ భూములు, ఇతర కేటగిరీల భూములు ఎంత ఉన్నాయి? వాటిపై ప్రస్తుతం ఎలాంటి హక్కులు కొనసాగుతున్నాయి? అనే అంశాలను ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. అర్హులైన భూస్వాములు, రైతులు ఇబ్బందులు పడకుండా చట్టబద్ధమైన భూముల విషయంలో న్యాయం చేయడంతోపాటు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, సీలింగ్, మిగులు, దేవాదాయ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, వాటి ప్రస్తుత స్థితిగతులను వెల్లడించాలన కోరారు. గతంలో జరిగిన భూ బదలాయింపులు, కేటాయింపులు, నిషేధిత జాబితా నుంచి తొలగింపులు తదితర అంశాలపై రికార్డులను పరిశీలించి ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భూముల వివరాలను పారదర్శకంగా వెల్లడించడం ద్వారా వివాదాలకు, అపోహలకు తెరపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షుడు తలారి రాజు, మంద మర్రి పట్టణ అధ్యక్షుడు రాజేశ్వరరావు, వాసాల సంపత్, ఎం.డి. షరీఫ్, ప్రధాన కార్యదర్శి కారం రాజు, పట్టణ మహిళా అధ్యక్షురాలు జూపాక సంధ్య, కరిడె తిరుపతి, మణిరామ్‌సింగ్, , శ్రీధర్, లు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లలను ప్రోత్సహించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల ప్రేమ, ఆప్యాయతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. వారు ఇతర పిల్లలతో సమానమేనని, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష, భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలింకో) సహకారంతో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సహాయ ఉపకరణాల గుర్తింపు, నిర్ధారణ శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదా నంద చారితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనుచూపు, ఇతర అవయవాల లోపాలు ఉన్నవారు, నడవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వైకల్యాలను అధిగమించి ఉన్నతస్థాయికి చేరుకున్న వారు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. పిల్లల్లోని ప్రతిభను గుర్తించి, వారికి అనుకూలమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అలింకో సహకారంతో సహాయ ఉపకరణాలను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఉపకరణాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఉపాధ్యాయులు, అలింకో ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గర్రెపల్లిలో పోషణ మాసం సందడి

**బాలల బంగారు భవితకు బాటలు**
**సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్**
**శ్రీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాసంతో**
**సందడిగా జిపి కార్యాలయం**





సుల్తానాబాద్, (సింగిడి): పోషణ మాసం సందర్భంగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం పోషణ, బాలల అభివృద్ధి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్ అధ్యక్షతన,ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం, ఆరు నెలలు నిండిన శిశువులకు అన్నప్రాసన, మూడు సంవత్సరాలు నిండినచిన్నారులకుఅక్షరాభ్యాసం కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. దీంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం గర్భిణీలు, బాలింతలు,తల్లులకు పౌష్టికాహారం, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారంపై ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో తగిన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు. ఆరు నెలల తర్వాత శిశువులకు తల్లిపాలతో పాటు వయస్సుకు తగిన అదనపు ఆహారం అందించాలని, పిల్లలకు వైవిధ్యమైన పోషకాహారం అందించడంతో పాటు పరిశుభ్రతను పాటించాలని తల్లులకు సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత, అంగన్‌వాడీ టీచర్లు స్వర్ణలత, రమాదేవి, మాధవి, ఆశా కార్యకర్త, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ప్రదేశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు




కొమురంభీం (సింగిడి): వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు వద్ద నిమజ్జన ప్రదేశాన్ని సబ్‌కలెక్టర్ హర్షచౌదరి, డీఎస్పీ వహీదుద్దీన్‌తో కలిసి ఆమె పరిశీలించారు. నిమజ్జన ప్రదేశంలో మట్టి చదును చేయడంతో పాటు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. విగ్రహాల సంఖ్యకు అనుగుణంగా అదనపు క్రేన్లను అందుబాటులో ఉంచాలని, అవసరమైన మేరకు సిబ్బందిని నియమించాలని తెలిపారు. రహదారి, నిమజ్జన ప్రాంతాల్లో తగినంత వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలి**

నిమజ్జన ప్రదేశంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు చోటుచేసుకోకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ విఫలం!


**సింగరేణిలో సౌకర్యాల కొరతపై హెచ్ఎంఎస్ ఫైర్**



మంచిర్యాల, (సింగిడి):సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తి ఎంత కీలకమో.. కార్మికుల భద్రత,వారికి అవసరమైన రక్షణ పరికరాలు, ప్రాథమిక సౌకర్యాలు అంతే ముఖ్యం. అయితే అవసరమైన విడిభాగాలు, రక్షణ సామగ్రి అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గని మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో గత 30 నెలలుగా అధికారంలో ఉన్న ఏఐటీయూసీ కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. గనుల్లో పనిచేసే కార్మికులకు కోల్ బిట్లు, తుంటలు, లైన్మెన్ కీలలు, టోపీ, బూట్లు, చేతి తొడుగులు, సేఫ్టీ గ్లౌజులు, మాస్కులు, యూనిఫాం తదితర అవసరమైన సామగ్రి నాణ్యమైనదిగా, సకాలంలో అందడం లేదని పేర్కొన్నారు. గనుల్లో ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే కార్మికులకు రక్షణ పరికరాలు అందుబాటులో ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. గాలి, తాగునీరు, క్యాంటీన్, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాల విషయంలోనూ సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఉత్పత్తి లక్ష్యాలపై చూపుతున్న శ్రద్ధకు అనుగుణంగా కార్మికుల భద్రత, సౌకర్యాలపైనా యాజమాన్యం దృష్టి సారించాలని కోరారు. 2025 సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా ఎంత అనేది ఇప్పటివరకు ప్రకటించకపోవడం, చెల్లింపులు జరగకపోవడం కార్మికుల్లో అసంతృప్తికి కారణమవుతోందని పేర్కొన్నారు. కార్మికులు సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి రావాల్సిన లాభాల వాటాపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశాడు. పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులకు సరైన రిపోర్టులు నమోదు చేసి, నిబంధనల ప్రకారం వైద్యం అందించాల్సి ఉన్నప్పటికీ.. ప్రైవేటు ఆసుపత్రుల్లో సొంతంగా చికిత్స తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ అంశంపై యాజమాన్యం దృష్టి సారించి కార్మికుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో ఏఐటీయూసీకి కార్మికుల వేతనాల నుంచి రికవరీ చేస్తున్న రూ. 50 యూనియన్ చందాను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఎన్నికలు నిర్వహించే వరకు అన్ని రిజిస్టర్డ్ కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని కోరారు. సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ, టెంపుల్ కమిటీ తదితర అధికారిక సమావేశాలకు హెచ్ఎంఎస్‌తో పాటు అన్ని రిజిస్టర్డ్ కార్మిక సంఘాల ప్రతినిధులను ఆహ్వానించాలని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై అన్ని సంఘాల అభిప్రాయాలను తీసుకోవడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని తెలిపారు ఆర్కే-7 గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డి, బ్రాంచ్ సెక్రటరీ పొనగంటి అశోక్‌కుమార్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ దుర్గం లక్ష్మణ్, ఫిట్ సెక్రటరీ చెవుల శ్రీనివాస్, నాయకులు మీసాల మహేందర్, సాయికుమార్ తదితరులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రి వేడుకలు నిర్వహించు కోవాలి

**సీఐ రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్**
**13వ వార్డులో కౌన్సిలర్ సిద్ధ తిరుపతి ఆధ్వర్యంలో**
**ప్రత్యేక పూజలు**



సుల్తానాబాద్, (సింగిడి): సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డులో కౌన్సిలర్ సిద్ధ తిరుపతి ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న వినాయక మండపంలో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు,ఎస్సైచంద్రకుమార్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరుడిని పూజించి,ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతోజీవించాలనిఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిభావం తో, పరస్పర ఐక్యతను పెంపొందించేలా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను స్నేహపూర్వక వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. కౌన్సిలర్ సిద్ధ తిరుపతి మాట్లాడుతూ. 13వ వార్డులో వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. వార్డు ప్రజలతో పాటు పట్టణ ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య





**నారాయణపేట ప్రతినిధి,(సింగిడి):** (ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సామాజిక, న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను గౌరవంగా స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బుధవారం నారాయణపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో ల్యాండ్, సర్వీస్, అట్రాసిటీ కేసులు, జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల సమస్యలపై జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, కమిషన్ సభ్యులు కే. లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్‌లతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకుముందు కలెక్టరేట్‌కు విచ్చేసిన చైర్మన్‌కు కలెక్టర్, ఎస్పీ పూల మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు.

**సివిల్ రైట్ డే ప్రతి నెలా నిర్వహించాలి**

ప్రతి నెలా చివరి వారంలో నిర్వహించే 'సివిల్ రైట్ డే' సమావేశాలకు తహసీల్దార్లు, ఎస్ఐలు తప్పనిసరిగా హాజరుకావాలని, ఇతర సిబ్బందిని పంపకూడదని స్పష్టం చేశారు. ప్రతి మూడు నెలలకొకసారి జిల్లా స్థాయిలో పురోగతి సమీక్ష ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను ఇతర అవసరాలకు మళ్లించవద్దని, కేటాయించిన బడ్జెట్‌ను ఆయా వర్గాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకే వినియోగించాలని హెచ్చరించారు. నిధులు పక్కదారి పడితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రిజర్వేషన్లు, రోస్టర్ విధానం, రిజిస్టర్ల నిర్వహణ నిబంధనల ప్రకారం పక్కాగా ఉండాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చట్ట ప్రకారం వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని, తీవ్రమైన నేరాల కేసులను పెండింగ్‌లో ఉంచవద్దని ఎస్పీని కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు సమయానికి వేతనాలు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, బీమా సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. పథకాలపై అవగాహన కల్పించాలి ప్రభుత్వం అందించే విద్యా, ఉపాధి, విదేశీ విద్య, భూమి ఆధారిత సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. మానవతా దృక్పథంతో బాధ్యతలను నిర్వహిస్తూ, జిల్లా స్థాయిలోనే సమస్యలు పరిష్కరిస్తే ప్రజలు రాష్ట్ర కమిషన్‌ను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదని చైర్మన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్ఓ రాజేశ్వరి, ఆర్డీఓ రమేష్, డీఎస్పీ లింగయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి...

**అనామిలిస్, మ్యాపింగ్ ఓటర్ల జాబితా**
**ఖమ్మం నగరంలో పాత డీఆర్డీవో కార్యాలయం ఆవరణ జరుగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్**



**ఖమ్మం, (సింగిడి):** స్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబి తాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ, డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక బస్ డిపో రోడ్, పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానాన్ని పరిశీలిం చారు. ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల తో ఎదురైన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజర యి బిఎల్వోలకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పిం చాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని, నోటీసులు అందుకున్న వారిలో ఏ, బి, సి కేటగిరీల వారీగా సంబం ధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారు లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని, పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక, నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిస రిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది సమ న్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బిఎల్ఓ లు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ చేయూత



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని బలరాం నగర్, ఇందిరానగర్ కాలనీలకు చెందిన నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం సిమెంట్‌ను అందజేశారు. రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో బలరాం నగర్‌కు చెందిన శేఖర్ నాయి, ఇందిరానగర్ కాలనీకి చెందిన కృష్ణవాసిని కుటుంబాలకు అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం కోసం సిమెంట్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, తమ ఇళ్ల నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన సమయంలో సిమెంట్ అందించి సహకరించిన ఉప్పల వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ పట్టణ మాజీ అధ్యక్షులు, కౌన్సిలర్ బావాండ్ల మధు, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు కుడుముల మనోహర్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు దాచేపల్లి శ్రీనివాసులు, బి ఆర్ ఎస్వీ రాష్ట్ర నాయకులు దారమోని గణేష్, గుమ్మకొండ రాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## కల్లు ప్యాకెట్లపై ఎక్స్‌పైరీ వివరాలు తప్పనిసరిగా ముద్రించాలి

### ఫుడ్ సేఫ్టీ అధికారికి ఆర్ఎస్ పీ వినతి



**నిజామాబాద్(ప్రతినిధి, (సింగిడి):** నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కల్లు డిపోలు, అలాగే జిల్లా కేంద్రంలోని కల్లు విక్రయ కేంద్రాల్లో సరఫరా చేస్తున్న కల్లు ప్యాకెట్లపై ఎక్స్ పైరీ తేదీ, తయారీ తేదీ, అందులో ఉపయోగించిన పదార్థాల పూర్తి వివరాలు, ఆల్కహాల్ శాతం వంటి సమాచారాన్ని ముద్రించడం లేదని, వాటిని తప్పనిసరిగా ముద్రించాలని కోరుతూ రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి కటారి రాములు మాట్లాడుతూ కల్లు ప్యాకెట్లలో వినియోగదారులకు వారు తీసుకుంటున్న పానీయంలో ఎంత శాతం ఆల్కహాల్ ఉందో, చక్కెర శాతం ఎంత ఉందో, అది సహజసిద్ధంగా తాటి లేదా ఈత చెట్ల నుంచి సేకరించిన కల్లునా, లేక కృత్రిమంగా తయారు చేసినదా అనే విషయాలు తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో విక్రయించే ప్రతి మత్తు పదార్థంపై "మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరం" అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రిస్తుంటారని, అయితే కల్లు ప్యాకెట్లపై అలాంటి హెచ్చరికలు లేకపోవడం సరైంది కాదన్నారు. వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా కల్లు ప్యాకెట్లపై పదార్థాల వివరాలు, ఆల్కహాల్ శాతం, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీతో పాటు ఆరోగ్య హెచ్చరికను కూడా తప్పనిసరిగా ముద్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న కల్లు డిపోల నుంచి నమూనాలు (శాంపిల్స్) సేకరించి ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం పరీక్షలు నిర్వహించి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ పీ పార్టీ నేతలు పీట్ల. నరేష్, గోపాల్ సింగ్ ఠాగూర్, సుర్యపాల్, లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌కు సన్మానం

### చందూర్ మండల పరిషత్ కార్యాలయంలో సన్మానం



**నిజామాబాద్ (సింగిడి):** చందూర్ మండలంలో మండల అభివృద్ధి అధికారి నీలావతి, మండల ప్రత్యేక అధికారి రజిత ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాల యం నుంచి డాక్టరేట్ పొందిన కారేగాం తాండా సర్పంచ్ డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లా డుతూ ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తూనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ పొందడం అభినందనీయమని తెలిపారు. డాక్టరేట్ సాధించిన డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఏ. ఈ. గోపి, కైఫ్, కేదేశ్వరి, ఎం.పి.ఓ. శ్రీనివాస్, సర్పంచులు మాధవి రెడ్డి, రవి సంజీవ్ తదితరులు పాల్గొని డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌ను అభినందించారు.

## కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి అండ



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ కార్యకర్త కూరాకుల ఎరుకలి ఆంజనేయులు అంజి తమ్ముడు కూరాకుల రాఘవేందర్ ఇటీవల వినా యక మండపం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందడంతో, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలిచారు. ఈ సందర్భంగా రాఘవేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబానికి మొత్తం రూ. 25,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు జి. శ్రీనివాసమూర్తి, ఎం. అంబాజీ, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, పి. అశోక్ బాబు, బి. నర్సింలు, ఏ. అంజయ్య గౌడ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్, వద్దే రాజు, ఏ. వెంకట్ రెడ్డి, తిరుమణి కృష్ణయ్య గౌడ్, పుల్జాల విష్ణు, వద్దే రాము, దుబ్బ నరేష్ తదితరులు తమ వంతు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యకర్తల కుటుంబాలకు ఏ సమయంలోనైనా తమ వంతు సహకారం అందిస్తూ, ప్రజల కష్టాల్లో భాగస్వాములుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎం. అంబాజీ, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ టి. కృష్ణయ్య గౌడ్, నాయకులు ఎండి యూసుఫ్, వద్దే రాజు, పుల్జాల విష్ణు, దుబ్బ నరేష్, సయీద్, వద్దే రామ్, చీపురి దర్శన్, గోపాల్, వట్టల మల్లేష్, మిడత రమేష్, చింతకాయల శివ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



**ఆర్మూర్, (సింగిడి):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని సుంకేట్ లో స్వర్ణ కాంచన లలిత అనే మహిళ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థానిక సర్పంచ్ వనజ గౌడ్, ఉప సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, సుంకేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.సి. గంగాధర్, మోర్తాడ్ మండల కాంగ్రెస్ పార్టీ మీడియా ఇన్చార్జ్ దోన్ పాల్ రాములు, అబ్బ గున్న శ్యామ్, సుంకేట్ గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు, కార్యదర్శి, జిపిఏ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులైన స్వర్ణ కాంచన లలిత ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించి, ముగ్గు పోసి నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంజూరు అందించిన బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలియజేశారు.

22-ఎ నిషేధిత జాబితాలో

## ప్రైవేట్ పట్టా భూములు.. ఇంటి స్థలాలను తొలగించాలి

### టిడిపి జిల్లా నాయకుడు డా. రామనాథం



**ఖమ్మం, (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర పార్టీ కార్యాలయం పిలుపు మేరకు ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ కి వినతిపత్రం అందించడం జరిగింది. అనంతరం రామనాథం మాట్లాడుతూ 22-ఎ నిషేధిత జాబితాలో ఉన్న ప్రైవేట్ పట్టా భూములు, ఇంటి స్థలాలను వెంటనే నిషేధిత జాబితా నుంచి తొలగించి, వాటి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని22-ఏ నిషేధిత జాబితాలో పట్టా భూములు, ఇంటి స్థలాలు ఉండటం వల్ల వాటి రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామాలలో ఈ సమస్య అధికంగా ఉందని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడే ఉద్దేశంతో 22-ఎ నిషేధిత జాబితాలో ప్రభుత్వ భూములను సబబే కానీ అధికారుల తప్పిదాల కారణంగా ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలు కూడా నిషేధిత జాబితాలో చేరడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని అన్నారు, తర తరాలుగా తమ భూములను అనుభవిస్తూ, పట్టాదారు పాస్‌బుక్ ఇతర హక్కు పత్రాలు కలిగి ఉన్నప్పటికీ 22-ఏ జాబితాలో ఉండటం వల్ల భూముల రిజిస్ట్రేషన్లు ఆగాయని తెలిపారు, కావున సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ భూములు కాని ప్రైవేట్, పట్టా భూములు, ఇంటి స్థలాలను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ని కోరామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండబాల కరుణాకర్, వనమా వాసు, మల్లాది హనుమం తరావు, అరెం వరలక్ష్మి, అరెం రామయ్య, తాత సుధాకర్, నాగార్జున శ్రీను, వాసిరెడ్డి భాస్కరరావు, మందపల్లి కోటి, మంద వెంకటనారాయణ, నూక హనుమంతరావు, మారేడు పుల్లారావు, పాలడుగు కృష్ణప్రసాద్, మేకల సత్యవతి, మందపల్లి రజిని, నల్లమాస మల్లయ్య, నల్లమల శ్రీను, రాయల కోటేశ్వరరావు, అశ్వినీ కుమార్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## మెనూ అమలు ఏది..? చికెన్ లేకుండా భోజనమా.!

### రేగళ్లతండా ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. సిబ్బంది తీరుపై కలెక్టర్ ఫైర్... వార్డెన్‌కు షోకాజ్



**లక్ష్మీదేవిపలి (సింగిడి):** విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అంది స్తున్నారా? వసతి గృహాల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి? పాఠ శాల పరిసరాల పరిశుభ్రత ఏ స్థాయిలో ఉంది? అనే అంశాలపై జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లతండాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పలు లోపాలను గుర్తించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠ శాల పరిసరాల్లో చెత్తాచెదారం, అపరిశుభ్రత కనిపించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా పరిసరాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాలలోని ఎన్‌సీసీ కార్యాలయాన్ని పరిశీలించి విద్యార్థుల సంఖ్య, గతేడాది ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

**మెనూలో నిర్లక్ష్యం.. వార్డెన్‌కు నోటీసు**

అనంతరం బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. కిచెన్, స్టోర్‌రూమ్‌లను తనిఖీ చేసి నిల్వ ఉన్న సరుకులు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, తాగునీరు, ఇతర సౌకర్యాలపై నేరుగా వివరాలు తెలుసుకున్నారు. బుధవారం మెనూలో చికెన్ ఉండాల్సి ఉండగా విద్యార్థులకు అందించిన భోజనంలో చికెన్ లేకపోవడాన్ని కలెక్టర్ గుర్తించారు. మెనూ అమలులో నిర్లక్ష్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల



ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందేలా పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని కిచెన్‌లో ఉన్న ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయకపోవ డాన్ని కూడా కలెక్టర్ గుర్తించారు. ప్లాంట్ ఎందుకు పనిచేయడం లేదని అధికారులను ప్రశ్నించి, వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తనిఖీల్లో తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అండగా మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండల కేంద్రానికి చెందిన మాడుగుల సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సత్తయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన జోగయ్య, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అనంతరం మృతుని కుటుంబానికి తన వంతు సహాయంగా 5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, మాజీ ఎంపీటీసీ లింగం, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ సర్పంచ్ గుద్దేటి ప్రభాకర్, వార్డు సభ్యులు శేఖర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అంజయ్య, మంగళగిరి సత్యం, మట్ట శ్రీనివాస్ గౌడ్, జంగిలి రవికుమార్, యువ నాయకులు జంగిలి తిరుపతయ్య, టైలర్ వెంకటయ్య, గోరేటి రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బుడుగు బజార్‌లో భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ సీహెచ్. ఎల్లయ్య



**అశ్వాపురం, (సింగిడి):** మండల కేంద్రంలోని బుడుగు బజార్‌లో బీబీఆర్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి 17వ నవరాత్రి ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వినాయక విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి అశ్వాపురం సీఐ సీహెచ్. ఎల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీఆర్ యూత్ సభ్యులు సీఐ ఎల్లయ్యకు ఘన స్వాగతం పలికారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని సీఐ ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులతో సందడి నెలకొంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బీబీఆర్ యూత్ సభ్యులు, నిర్వాహకులు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరికి సుఖసంతోషాలు

## భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు

### పాల్గొన్న పలుస శంకర్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి,(రేవల్లి) (సింగిడి):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరిం చుకుని వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన ప్రథమ పూజ్యుడు శ్రీ విఘ్నేశ్వరుడిని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు (తాటిపాముల)పలుస శంకర్ గౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గణనాథుడికి పూజలు చేసి ప్రజలం దరూ సుఖసంతోషాలతో, ఆయురారో గ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పలుస శంకర్ గౌడ్, బైరోజు చంద్రశేఖర్‌లను కౌన్సిలర్ చీర్ల చందర్‌తో పాటు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించి సమస్త జనులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించే విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై సదా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో, ప్రశాంత వాతావరణంలో జీవించాలని స్వా మివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. వినాయక చవితి పండుగను ప్రజ లంతా భక్తిశ్రద్ధలతో, ఐక్యతా భావంతో ప్రశాంత వాతావరణంలో జరుపు కోవాలని ఆయన పిలుపునిచ్చారు. పండుగలు ప్రజల్లో ఆధ్యాత్మికతతో పాటు సోదరభావం, ఐక్యతను పెంపొందించేలా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ శామ్ సుందర్, నందిమల్ల రమేష్, శ్రీనివాస్, యుగంధర్, సదానందం గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

## పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా బద్దం మహిపాల్...



**ఆర్మూర్, (సింగిడి):** బాల్కొండ నియోజక వర్గం మోర్తాడ్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బద్దం మహి పాల్ ఏకగ్రీవంగా నియా మక మయ్యారు. మోర్తాడ్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లుగా బద్దం మైపాల్ నియామకం కావడంతో, నియామకానికి కృషిచేసిన బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కూరి ఆనంద్, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యాల రాములు, జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు వై. శ్రీ. కృషి చేసిన ప్రతి కాంగ్రెస్ నాయకునికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అధికారంలో పార్టీకి తాము పార్టీలోనే కొనసాగమని, మళ్లీ రెండవసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా, బాల్కొండ ఎమ్మెల్యేగా సునీల్ రెడ్డి గెలిపించేందుకు అహర్నిశలు కృషి చేసి తమకాంగ్రెస్ సత్తా చూపిస్తామన్నారు.

## హజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు తప్పనిసరి..

**జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలోనే వైద్య పరీక్షలు.**
**17న జిల్లా జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం.**
**పరీక్షలకు వచ్చే వారు ఆహారం తీసుకోకుండా రావాలి.**
**హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్.**



**నాగర్‌కర్నూల్ (సింగిడి):** 2027 హజ్ యాత్రకు ఎంపికైన హజ్ యాత్రికులు ఈ నెల 17వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆసుపత్రిలో నిర్వహించనున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసు కోవాలని జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం హజ్ యాత్రికుల వైద్య పరీక్షలకు సంబంధించి ప్రత్యేక ప్రక్రియను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలో నిర్దేశించిన అన్ని వైద్య పరీక్షలను జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణలో నిర్వహించినప్పుడే అవి హజ్ యాత్రకు చెల్లుబాటు అవుతాయని తెలిపారు. ప్రైవేటుగా నిర్వహించుకునే వైద్య పరీక్షలు చెల్లుబాటు కావని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సెప్టెంబర్ 17న ఉదయం 7 గంటల నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలకు వచ్చే హజ్ యాత్రికులు ఆహారం తీసుకోకుండా (ఫాస్టిం గ్‌లో) రావాలని సూచించారు. కొన్ని పరీక్షలు ఖాళీ కడుపుతో నిర్వహిం చాల్సి ఉంటుం దని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ప్రక్రియలో భాగంగా నాగర్‌క ర్నూల్ జిల్లాకు హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు తెలిపారు. శిబిరంలో CBC, FBS/HbA1c, ఛాతీ ఎక్స్‌రే, KFT, LFT, ECG తదితర ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. ఈ శిబిరంలో నిర్వహించే వైద్య పరీక్షలు హజ్ యాత్రకు వెళ్లే సమయంలో చెల్లుబాటు అవుతా యని తెలిపారు. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లా పూర్ తదితర ప్రాంతాలకు చెందిన హజ్ యాత్రికులు తప్పనిసరిగా ఈ వైద్య శిబిరానికి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**తప్పనిసరిగా తీసుకురావాల్సినవి**

హజ్ దరఖాస్తు హార్డ్ కాపీ,మొదటి విడత చెల్లింపు రసీదు తెలుపు బ్యాక్‌గ్రౌండ్‌తో ఉన్న రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ... వైద్య పరీక్షలకు వచ్చే ప్రతి హజ్ యాత్రి కుడితో ఒక సహాయకుడు మాత్రమే రావాలని సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో జిల్లా జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించి, సంబంధిత వైద్య ధ్రువపత్రాలను జారీ చేస్తామని షేక్ ఫరీద్ అహ్మద్ తెలిపారు. సమావేశంలో హజ్ సొసైటీ కార్యదర్శి మహ్మద్ ఇబ్రహీం, ఉపాధ్యక్షుడు అబ్దుల్ హక్, మహ్మద్ ముస్తాక్ అహ్మద్, సహాయ కార్యదర్శి హాఫిజ్ మహబూబ్ అలీ, సహాయ కార్యదర్శి మహ్మద్ షకూర్, కోశాధికారి మౌలా పీరా, సభ్యులు సయ్యద్ తాహెర్, మహ్మద్ పాషా, మహ్మద్ ఇజాజ్ నక్సబందీ, మహ్మద్ సలీం, మహ్మద్ నయీం, మహ్మద్ నయామత్‌ఉల్లా షరీఫ్, ప్రచార కార్యదర్శి నూరుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.

# పొన్నం సత్తయ్య గౌడ్ వర్ధంతికి తరలిన కాంగ్రెస్ నేతలు

**జమ్మికుంట, (సింగిడి):** రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హుజురాబాద్ నియోజకవర్గం నుండి భారీ ఎత్తున తరలి వెళ్లిన కాంగ్రెస్ నేతలు. హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకరి రమేష్ ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి వర్ధంతి కార్యక్రమానికి వెళ్లి పొన్నం సత్తయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



# కవులు, కళాకారులకు కరీంనగర్ పుట్టినిల్లు

## మధుపాలీస్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్' పుస్తకావిష్కరణలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

**కరీంనగర్, (సింగిడి):** కవులు, కళాకారులకు కరీంనగర్ పుట్టినిల్లుగా నిలుస్తోం దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజ య్‌కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న తనకు కరీంనగర్‌లో ఉన్నంతమంది కవులు, కళాకారులు మరే ప్రాంతంలోనూ కనిపించలేదని పేర్కొన్నారు. సమాజానికి సేవ చేస్తున్న వారిలో డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి ఒకరని అన్నారు. మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి రచించిన 'మధుపాలీస్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్' పుస్తకాన్ని బండి సంజయ్‌కుమార్ ఆవిష్కరించారు. జాతీయ, అంతర్జాతీయ, సమకాలీన అంశాలపై రాసిన



వ్యాసాలతో రూపొందించిన 400 పేజీల ఈ పుస్తకం విద్యార్థులు, విద్యాసంస్థలు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా మధుసూదన్‌రెడ్డి రచనలు కొనసాగిస్తూ సమాజానికి సేవ చేయడం అభినందనీయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితానికి సంబంధించిన అంశాలను పుస్తక రూపంలో తెలుగులో అందించాలని ఆయనను కోరారు. మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహించనున్న 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో ప్రజలు పాల్గొని దీపాలు వెలిగించాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉపమేయర్ సునీల్‌రావు, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, మానేరు పాఠశాలల అధినేత అనంతరెడ్డి, టీబీఎస్ఎస్ అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి రీ సర్వేకు ప్రజలు సహకరించాలి

## హుజరాబాద్ ఆర్డీవో జల కుమారి

**జమ్మికుంట, (సింగిడి):** భూభారతి రీ సర్వేకు ప్రజలు సహకరించాలని హుజురాబాద్ ఆర్డిఓ జల కుమారి ప్రజలను కోరా రు. బుధవారం వీణవంక మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణపల్లిలో భూభా రతిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీణవంక తహసిల్దార్ తో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారులు భూములకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారం, పట్టాదారు పాస్‌బుక్‌లు, భూ హక్కులు, రికార్డుల్లో మార్పులు, వారసత్వం, భూ వివాదాల పరిష్కారానికి సంబంధించిన ప్రక్రియలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భూ రికార్డుల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే భూములకు సంబంధించిన పత్రాలను భద్రంగా ఉంచుకోవాలని, భూ లావాదేవీల సమయంలో పూర్తి వివరాలను పరిశీలించి ముందుకు వెళ్లాలని అధికారులు సూచించారు. భూభారతి ద్వారా అందుబాటులోకి వచ్చే సేవలు, వాటిని పొందే విధానం గురించి గ్రామస్తులకు వివరించారు. ప్రజలు తమ భూములకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, సంబంధిత పత్రాలతో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించుకోవాలని అధికారులు సూచించారు. గ్రామస్థులు అడిగిన పలు భూ సమస్యలు, సందేహాలను అధికారులు వివరంగా విని వాటిపై తగిన సూచనలు చేశారు. ఈ అవగాహన సదస్సులో రెవెన్యూ అధికారులు, కేడి కిషన్ రావు డిఐ రత్నం ఎంపీడీవో ప్రభాకర్ జి పి ఓ లు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డుకు వారంరోజుల్లో టెండర్లు

## యూసీఎఫ్ నిధులతో మరో రూ.80 కోట్లు, నగర అభివృద్ధికి మొత్తం రూ.840 కోట్లు
## రూ.50 కోట్లతో నగర పరిధిలో రహదారులు, మురుగు కాలువల అభివృద్ధి పనులు

**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ ప్రజలకు త్వరలో డంపింగ్ యార్డు పనులు ప్రారంభంకానున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. స్వచ్ఛ భారత్ పథకం కింద మంజూరైన రూ. 16 కోట్లతో చేపట్టనున్న డంపింగ్ యార్డు పనులకు మరో వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని వెల్లడించారు. పట్టణ అభివృద్ధికి మంజూరైన పట్టణ సవాళ్ల నిధుల నుంచి మరో రూ. 80 కోట్లను డంపింగ్ యార్డు పనులకు కేటాయించనున్నట్లు చెప్పారు. కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉపమేయర్ సునీల్‌రావులతో కలిసి నగరంలోని 13, 42, 49 డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం భగత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ వ్యాయామశాలను ప్రారంభించి, విలేకరులతో మాట్లాడారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధుల కింద రూ. 50 కోట్లతో నగర పరిధిలో రహదారులు, మురుగు కాలువల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి




తెలిపారు. ఇందులో భాగంగా 13, 42, 49 డివిజన్లలో పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పనులు చేపట్టకుండా జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని, నగరపాలక సంస్థ తగిన చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. కరీంనగర్‌లోని ప్రతి డివిజన్‌లో బహిరంగ వ్యాయామశాలలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి గల్లీలో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపడతామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రతిపాదనల మేరకు కేంద్రం రూ. 840 కోట్ల పట్టణ సవాళ్ల నిధులు మంజూరు చేసిందని, త్వరలో వాటితో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

**రూ. 1.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన,..**

42వ డివిజన్‌లోని భగత్‌నగర్‌లో బహిరంగ వ్యాయామశాలను ప్రారంభించిన మంత్రి, పొలాడి ఆనందరావు అపార్ట్‌మెంట్ గల్లీలో రూ. 50 లక్షల పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధులతో సీసీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. 49వ డివిజన్‌లో భాగ్యనగర్‌లో రూ. 50 లక్షలతో చేపట్టనున్న సీసీ రహదారి, మురుగు పైపులైన్ పనులకు, పోచమ్మ కమాన్ సమీపంలో రూ. 10 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధులతో చేపట్టే సీసీ రహదారి, పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. 13వ డివిజన్‌లోని శివనగర్ బైపాస్ రోడ్డు సమీపంలో రూ. 75 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రహదారి, మురుగు కాలువ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని ప్రవర్తనపై
# అధికారుల విచారణ



**జమ్మికుంట, (సింగిడి):** కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ప్రభుత్వపాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న రామ్ రాజయ్య విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు ఇష్టం వచ్చినట్లు దూషిస్తున్నారని విద్యార్థులు నిరసన వ్యక్తం చేయడంతో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు బాలల రక్షణ బృందం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడి రామ్ రాజయ్య విద్యార్థుల పట్ల ప్రవర్తిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అధికారులకు సదరు ఉపాధ్యాయుడు తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా తమ తల్లిదండ్రులకు సైతం మెసేజ్లు చేస్తున్నాడని విషయం బయటకు చెప్తే డార్క్‌రూమ్ లో వేస్తారని భయభ్రాంతులకు గురి చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా సెల్ఫోన్లో ఉన్న అశ్లీల చిత్రాలు తమకు చూపెట్టేవాడని తెలిపారు. అనంతరం ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి గతంలో రామ్ రాజయ్య ప్రవర్తన గురించి ఆరా తీశారు. పూర్తి వివరాలు ఆధారంగా నివేదికను తయారుచేసి జిల్లా కలెక్టర్కు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ విచారణలో క్వాలిటీ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, అశోక్ రెడ్డి, జిల్లా చిల్డ్రన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పర్వీన్, మెడికల్ ఆఫీసర్ చందన, సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్ విద్యార్థినులకు ఉద్యోగాలు

## బెంగళూరుకు చెందిన సంస్థ నియామకాల్లో ఆరుగురికి అవకాశాలు
## కళాశాల చైర్మన్, కరస్పాండెంట్ వి. రవీందర్‌రెడ్డి

**కరీంనగర్, (సింగిడి):** ఆల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు బెంగళూరుకు చెందిన లెర్న్‌ఫ్లూ ఎడ్యూటెక్ సొల్యూషన్స్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సంస్థ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ఆరుగురు విద్యార్థినులు విద్యా సంబంధాల కార్యనిర్వాహకులుగా ఉద్యోగాలు సాధించారు. ఈ విద్యా సంవత్సరంలో కళాశాలలో నిర్వహించిన తొలి ప్రాంగణ నియామక కార్యక్రమంలోనే ఆరుగురు విద్యార్థినులు ఉద్యోగాలు పొందడం పట్ల కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల చైర్మన్, కరస్పాండెంట్ వి. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులకు విద్యాబోధనతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, సంభాషణా సామర్థ్యం, వృత్తిపరమైన నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినుల భవిష్యత్ కెరీర్ అభివృద్ధికి కళాశాలలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థినులకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కళాశాల నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎంపికైన విద్యార్థినులను రవీందర్‌రెడ్డి అభినందించి, భవిష్యత్‌లో మరిన్ని మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.



# వొడితల రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిస్తా

**నియోజకవర్గం అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివి : నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్..**
**ఘనంగా వొడితల రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు..**

**జమ్మికుంట, (సింగిడి):** హుజురా బాద్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ రాజేశ్వర్ రావు అని వారు చేసిన పనులే ఇప్పటికీ సాక్ష్యాలుగా నిలుస్తు న్నాయని, వారు చూపిన బాటలో నడుస్తూ ప్రజ లకు మరింత సేవ అందజేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం రోజున మాజీ రాజ్యసభ సభ్యుడు వొడితల రాజేశ్వర్ రావు జయంతి సందర్భంగా హుజురాబాద్ పట్టణం లోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో గల ఆయన విగ్రహా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకల్లో పలువురు ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత హుజురాబాద్ ప్రాంతానికి పెద్దదిక్కుగా ఇక్కడి అవసరాలకు తగ్గట్టుగా పలు అభివృద్ధి పనులు చేశారని, ఆయన దూరదృష్టి వల్ల ఆ సేవలు ఇప్పటితరానికి కూడా ఉపయోగపడుతున్నాయని అన్నారు. అనంతరం హుజురాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, అధికార ప్రతినిధులు, అన్ని మండల, పట్టణ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, ప్రజా ప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్, ఎస్సీ సెల్, బీసీ సెల్, మైనారిటీ, సేవాదళ్, సోషల్ మీడియా, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో బాల గణేశుడికి మహానివేదన

## సాయి మానేరు పాఠశాలలో 108 రకాల ప్రసాదాల వితరణ, విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రసాదాల పంపిణీ



**కరీంనగర్, (సింగిడి):** మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాల గణేశుడికి భక్తిశ్రద్ధలతో మహా నివేదన సమర్పించారు. విద్యార్థులందరికీ స్వామివారి కృపా కటాక్షాలు లభించాలనే సత్సంకల్పంతో 108 రకాల ప్రసాదా లను గణేశుడికి నివేదించి, అనంతరం విద్యార్థులు, ఉపాధ్యా యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఇళ్ల నుంచి వివిధ రకాల ప్రసాదాలను తీసుకువచ్చారు. ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరితారెడ్డి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వాహనాలు ప్రజల సేవకే విక్రయానికి కాదు

**నమోదు ప్రక్రియలో స్వల్ప జాప్యం మాత్రమే..**
**రూ.2 లక్షల ముందస్తు చెల్లింపు విధానం గతం నుంచే అమల్లో ..**
**నగర మేయర్ కోలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, (సింగిడి): :** నగరపాలక సంస్థకు కొత్తగా సమకూరిన పొగ నివారణ, చెత్త సేకరణ వాహనాలను విక్రయించే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణ లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఖండించారు. వాస్తవాలు తెలుసుకోకుండా సాధారణ పరిపాలనా ప్రక్రియను అక్రమంగా చిత్రీకరించడం సరికాదన్నారు. కొత్త వాహనాలకు రవాణా శాఖ నమోదు, వాహన సంఖ్య కేటాయింపు, బీమా తదితర తప్పనిసరి ప్రక్రియలు కొనసాగుతున్నా యని తెలిపారు. వరుసగా ఐదు రోజుల సెలవులు రావడంతో కొంత జాప్యం జరిగిందని, ప్రక్రియ పూర్తయిన వెంటనే వాహనాలను ప్రజల సేవలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. నమోదు, బీమా లేకుండా వాహనాలను రహ దారులపై నడపడం సాధ్యం కాదన్నారు. ప్రజల పన్నుల సొమ్ముతో కొనుగోలు చేసిన వాహ నాలను ప్రజారోగ్యం, పారిశుధ్య పరిరక్షణకే వినియోగిస్తామని మేయర్ పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో దోమల నివారణ, ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వాహనాలను వినియోగిస్తామని తెలిపారు.

**రూ. 2 లక్షల ముందస్తు చెల్లింపు విధానం పాతదే..**

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా సమకూర్చిన చెత్త సేకరణ ఆటోలకు సంబంధించి రూ. 2 లక్షల ముందస్తు చెల్లింపు విధానం కొత్తగా ప్రవేశపెట్టింది కాదని మేయర్ స్పష్టం చేశారు. ఈ విధానం గతం నుంచే అమల్లో ఉందని, సంబంధిత మొత్తం నగరపాలక సంస్థ ఖాతాలోనే జమ అవుతుందని తెలిపారు. వాహనాల విక్రయం లేదా ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న వారు అందుకు సంబంధించిన ఆధారాలను బయట పెట్టాలని కోరారు. పత్రాలు, రసీదులు లేదా ఇతర ఆధారాలు ఉంటే అధికారులకు అందించి విచారణ కోరవచ్చున్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదన్నారు. వాహనాల కొనుగోలు, నమోదు, వినియోగానికి సంబంధించిన వివరాలన్నీ అధికారిక రికార్డుల్లో ఉన్నాయని, అవసరమైతే వాటిని ప్రజల ముందుంచేందుకు నగరపాలక సంస్థ సిద్ధంగా ఉందన్నారు. నగరాభివృద్ధి, ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# జీవకోటికి ప్రాణాధారం మొక్కలే..

**మొక్కలను నాటుదాం పర్యావరణాన్ని రక్షిద్దాం**
**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్**

**జమ్మికుంట (సింగిడి):** మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ ఉంటుందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్ అధ్యక్షతన జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ హాజరై మొక్కలను నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి, వాటిని పరిరక్షించాలని అన్నారు. మొక్కలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని అన్నారు. అనంతరం చైర్మన్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కాగ కళాశాల ఆవరణలో పలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. రమేష్, వైస్-ప్రిన్సి పాల్ డాక్టర్ ఎస్ ఓదెలు కుమార్, స్టాఫ్ సెక్రటరి. డాక్టర్ కె గణేష్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె రాజేంద్రం, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్లు డాక్టర్ ఎంబాడి రవి, లోఖండే రవిందర్, అధ్యాపకులు డాక్టర్ ఎం. శ్యామల, డాక్టర్ కె మాధవి, వి కిరణ్ కుమార్, కె. ఉమా కిరణ్ , పి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ పి సుష్మ, డాక్టర్ సి రాజకుమార్, ఎన్ మమత, డాక్టర్ పి రవిప్రకాష్, డాక్టర్ ఎన్ శ్రీనివాస్, సీనియర్ ఆసిస్టెంట్ డి. తిరుపతి, ఏ రఘు, డాక్టర్ పి స్వప్న, ఏ రమేష్, ఎన్ ప్రశాంత్, ఎం సాయి కుమార్, జి. అనూష, పి అరుణ్ రాజ్, దీనా, విద్యార్థులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



# కోటిలింగాల ఆలయ హుండీ లెక్కింపు



**వెల్గటూర్, (సింగిడి):** మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కోటిలింగాల కోటేశ్వర స్వామి ఆలయ హుం డీని ఆలయ సిబ్బంది బుధవారం లెక్కించారు. గత మూడు నెలల కాలంలో హుండీ ఆదాయం 1,89,958/- రూపాయల ఆదాయంతోపాటు మిశ్రమ బంగారం 3.5మిల్లీ గ్రాములు, గ్రాములు, మిశ్రమ వెండి 210 గ్రాములు వచ్చింది. ఈఓ .ఆలయ హుండీ ఆదాయాన్ని ఆలయ అర్చకులు, సిబ్బం ది, అధికారుల సమక్షంలో లెక్కించారు. రానున్న పుష్కరాల కోసం జరుగుతున్న ఆలయ పునర్నిర్మాణ పనులను జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ పరిశీలించారు. పుష్కరాలు సమీపిస్తున్న వేల పనులను వేగవంతం చేయాలని సూచిం చారు. కార్యక్రమంలో ఈవో కాంతారెడ్డి, ఎంపీడీవో వెంకట్ ప్రసాద్, దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ, దేవాలయ కమిటీ చైర్మన్ పి రమేష్, ధర్మకర్తలు వెంకటేష్, రవి సర్పంచ్ కోటయ్య, పంచా యతీ సెక్రెటరీ ఎన్ శైలజ, అర్చకులు సంజీవ్ శర్మ, నాగరాజు శర్మ, సిబ్బంది, సేవా సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆస్తి తగాదాలతో.. వ్యక్తి హత్య

**కుటుంబ సభ్యులే సూత్రధారులు**
**హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి**
**ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు**





**జమ్మికుంట, (సింగిడి):** ఆస్తి తగా దాలతో పాటు కుటుంబ సభ్యులను ప్రతినిత్యం తాగి వచ్చి వేధింపులకు గురి చేస్తున్నాడని భావిం చిన కుటుంబ సభ్యులే హత్య చేసి పూడ్చి వేసిన సంఘటన కరీంనగర్ జిల్లాలో సంచలనం సృష్టించింది. ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన వొజ్జపల్లి రాజబాబు(35) అనే వ్యక్తిని తల్లి ,అక్క, బావతో పాటు మరో నలుగురు ఉరివేసి చంపి పూడ్చివేశారు. బుధవారం మృతుడి శవాన్ని పూడ్చివేసిన చోట పోలీసులు స్థానిక తహసిల్దార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హుజురాబాద్ ఏసిపి మాధవి తెలిపిన వివరాల ప్రకారం మృతుడు రాజబాబు ప్రతినిత్యం తాగి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడడమే కాకుండా తనకు ఉన్న పొలం విషయంలో, తల్లి అక్కా బావలతో వివాదానికి దిగేవాడు. ఇదే తరుణంలో ఈ నెల 10వ తేదీన మద్యం సేవించి తన పొలం అమ్ముకోకుండా అడ్డు కుంటున్నారంటూ వారిపై వివాదానికి దిగాడు. గత కొద్ది రోజులుగా ఉన్న ఆస్తి గొడవతో పాటు మృతుడి వివాదం ఎక్కువ కావడంతో పథకం ప్రకారం కుటుంబ సభ్యులు తల్లి లచ్చుమ్మ, అక్క జూపాక కవిత బావ జూపాక శంకర్ లు గ్రామానికి చెందిన మారేపల్లి రాజయ్య, చేతి వెంకటేష్, జూ-పాక సతీష్, గుంటి శంకర్ సహాయంతో ఇంటిలో ఉరివేసి చంపేశారు. రాత్రివేళ తమకున్న పొలం సమీపంలో పూర్తి వేసినట్లు ఎసిపి మాధవి తెలిపారు. హత్యకు కారణమైన ఏడుగురుపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జమ్మికుంట తహసిల్దార్ సుధాకర్ సీఐ రామకృష్ణ గౌడ్ తో పాటు ఎస్సైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆనందదాయక అభ్యసనకు ఫిన్లాండ్ విద్యా విధానం

## పారమిత హెరిటేజ్ పాఠశాలలో విద్యా విధానాలపై ఫిన్లాండ్ ప్రతినిధుల పరిశీలన



**కరీంనగర్, (సింగిడి): :** కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలను ఫిన్లాండ్‌కు చెందిన విద్యా ప్రతినిధులు సందర్శించారు. ఫిన్నిష్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సొల్యూషన్స్ సంస్థ వృత్తి నైపుణ్యాభివృద్ధి విభాగం అధిపతి లారా మరియా సినిసాలో, భారత ప్రతినిధి రశ్మి పాఠశాలలోని విద్యా విధానాన్ని పరిశీలించారు.


వారు తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మమేకమై వారి అభ్యసన విధానం, ఆసక్తులు, ఆలోచనా తీరును తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థి కేంద్రిత బోధన, తరగతి గది వాతావరణం, బోధనా పద్ధతులపై చర్చించారు. తల్లిదండ్రులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి, అభ్యసనపై ఆసక్తి, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అభిప్రాయాలను సేకరించారు. ఫిన్లాండ్ విద్యా విధానంలోని అంశాలను పారమిత పాఠశాలల్లో అమలు చేయడం పట్ల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిన్లాండ్ విద్యా విధానంలోని ఉత్తమ పద్ధతులను పారమిత విద్యా విధానంతో అనుసంధానం చేస్తూ విద్యార్థులకు ఆనందదాయకమైన, అర్థవంతమైన అభ్యసన అనుభవాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని డా. ప్రసాద్ రావు తెలిపారు. చదువు అంటే ఒత్తిడి కాదు.. ఆనందం; విద్య అంటే కేవలం మార్కులు కాదు.. జ్ఞానం, నైపుణ్యాలు, విలువలు, స్వీయ వికాసం" అనే సందేశంతో పర్యటన ముగిసింది.

కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, సమన్వయ కర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించాలి


## మున్సిపల్ కమిషనర్‌కు దుర్గా కాలనీవాసుల వినతి

**జమ్మికుంట(సింగిడి):** జమ్మికుం ట మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు దుర్గ కాలనీలో రహదారి ఆక్రమణలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశా రు. విద్యోదయ స్కూల్ మెయిన్ రోడ్డు నుంచి హాస్టల్ వరకు ఉన్న మున్సిపల్ సీసీ రోడ్డుపై కొందరు నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొంటూ, వాటిని పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలని కోరుతూ దుర్గా కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామికి వినతిపత్రం సమర్పించారు. విద్యోదయ స్కూల్ మెయిన్ రోడ్డు నుంచి హాస్టల్ వరకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే సీసీ రోడ్డుపై గోడలు, మెట్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడంతో రహదారి వినియోగానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఉపయోగపడాల్సిన మున్సిపల్ రహదారి ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రోడ్డును ఆక్రమించి నిర్మించినట్లు పేర్కొంటున్న గోడలు, మెట్లు, కటకాలు తదితర నిర్మాణాలను మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించా లని విజ్ఞప్తి చేశారు. రహదారి హద్దులను గుర్తించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే వాటిని తొలగించాలని కోరారు.




ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారి ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాధ రాంబాబు, మీడివెల్లి సంపత్, మార్శెల్ల రవి, రాధ నరేష్, చొప్పరి సదానందం, చొప్పరి రాము, ఒద్ది శ్రీకాంత్, రాధ భారత్, ముకుంద సాయి వంశీ, మూడేడ్ల గణేష్, పకిడె మణికంఠ, పెంతల సురేందర్, బొల్లం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యపల్లిలో వైద్య శిబిరం



**ధర్మారం (సింగిడి):** మండలంలోని రామయ్య పల్లె గ్రామంలో ఈరోజు నంది మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ మూలమంగా వైద్యులు డాక్టర్ రాజ్ కుమార్, సుస్మిత శిబిరాన్ని ప్రారంభించారు గ్రామంలో వ్యాప్తి చెందుతున్నాయని సర్పంచ్ వైద్యుల దృష్టికి తీసుకు వెళ్లడంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ రాణి ఏఎన్ఎం, రాజేశ్వరి ఆశ కార్యకర్తలు గాలివెల్లి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ సాయి వివాదంలో బిగ్ ట్విస్ట్..

# భార్య శరణ్య ఆత్మహత్యాయత్నం పరిస్థితి విషమం!



ప్రముఖ ఫోక్ ఆర్టిస్టులు ఈశ్వర్ సాయి , మాధురి రాథోడ్ ఎపిసోడ్‌లో ఊహించని ట్విస్ట్ చోటుచేసుకుంది. ఇప్పటికే ఈ వివాదం ఇండస్ట్రీలో తీవ్ర చర్చనీయాంశం కాగా.. తాజాగా ఈశ్వర్ సాయి భార్య శరణ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపుతోంది. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లుగా తెలుస్తోంది.

**శరణ్య ఎమోషనల్ ఆడియో క్లిప్ వైరల్..**
ఆత్మహత్యాయత్నానికి పాల్పడే ముందు శరణ్య విడుదల చేసినట్లుగా భావిస్తున్న ఓ ఎమోషనల్ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఆ ఆడియోలో ఆమె పడిన వేదన అందరినీ కంటతడి పెట్టిస్తోంది. "నేను ఈ పోరాటంలో మోసపోయాను.. ఈశ్వర్ లేకపోతే నేను బతకలేను. నా జీవితాన్ని పూర్తిగా ఆగమాగం చేశారు.. నాకు ఇదొక్కటే మార్గం మిగిలింది. నా చిన్న కొడుకుని జాగ్రత్తగా చూసుకోండి. ఈ ద్రోహాన్ని నేను నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను" అంటూ శరణ్య కన్నీరుమున్నీరవుతూ మాట్లాడిన మాటలు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి.

కాగా, ఫోక్ ఆర్టిస్ట్ మాధురి రాథోడ్.. ఈశ్వర్ సాయి తనను మోసం చేశాడంటూ, తనకు అన్యాయం చేశాడంటూ బహిరంగంగా తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ వివాదం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలోనే ఈశ్వర్ సాయి భార్య శరణ్య కూడా స్పందిస్తూ మాధురి రాథోడ్‌కు కౌంటర్ కూడా ఇచ్చారు. కానీ, తాజాగా తీవ్ర మనస్తాపానికి గురైన శరణ్య బలవన్మరణానికి యత్నించడం పట్ల కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు మెరుగైన చికిత్సనందిస్తున్నట్లుగా తెలుస్తోంది.

## దీపావళికి మహాశక్తి

దక్షిణాదిలో లేడీ సూపర్ స్టార్‌గా దూసుకెళుతున్న నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మూకుత్తి అమ్మన్ 2'. సుందర్ .సి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రెజీనా, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇషారి కె. గణేశ్ నిర్మిస్తున్న ఈ చిత్రం 'మహాశక్తి' పేరుతో తెలుగులో విడుదల కానుంది. ఈ సినిమాని దీపావళి కానుకగా నవంబరు 6న విడుదల చేయనున్నామని యూనిట్ పేర్కొంది.

నయనతార లీడ్ రోల్‌లో ఆర్‌జె బాలాజీ, ఎన్‌జె శరవణన్ దర్శకత్వం వహించిన 'మూకుత్తి అమ్మన్' 2020 నవంబరు 14న విడుదలైంది. ఈ మూవీకి సీక్వెల్‌గా 'మూకుత్తి అమ్మన్ 2' రూపొందుతోంది. మొదటి సినిమా సూపర్ హిట్ కావడంతో ఈ సీక్వెల్‌పై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. నయనతార నటన, కథాంశం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటాయని మేకర్స్ పేర్కొన్నారు.

గతంలో 'మూకుత్తి అమ్మన్' చిత్రం దీపావళి పండగ సందర్భంగా ఓటీటీ వేదికగా విడుదలై మంచి ఆదరణ పొందింది. అదే సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ 'మహాశక్తి'ని కూడా నవంబర్‌లో థియేటర్లలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసినట్లుగా తెలుస్తోంది. పండగ సమయంలో దైవిక కథాంశంతో కూడిన చిత్రాలకు కుటుంబ ప్రేక్షకాదరణ బాగుంటుందనే నమ్మకంతో చిత్ర యూనిట్ ఉంది.



ఎల్లమ్మ' సినిమాలో యంగ్ హీరోయిన్..

# లక్కీ బ్యూటీ ఎవరంటే?

సంచలన విజయం సాధించిన 'బలగం' సినిమా తర్వాత టాలెంటెడ్ డైరెక్టర్ వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక భారీ ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటికే టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొనగా, మరో ఆసక్తికరమైన విశేషం ఏంటంటే.. కోట్లాది మంది సంగీత అభిమానులను తన ట్యూన్స్‌తో ఉర్రూతలూగిస్తున్న రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా సిల్వర్ స్క్రీన్‌కు పరిచయం కాబోతున్నారు. నటుడిగా మారుతూనే ఈ సినిమాకు ఆయనే స్వయంగా సంగీతం కూడా అందిస్తుండటం విశేషం. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం మొదట్లో సాయిపల్లవి, కీర్తి సురేష్, మృణాల్ ఠాకూర్, భాగ్యశ్రీ బోర్సే, రుక్మిణి వసంత్ వంటి పలువురు స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ అనంతిక సనిల్ కుమార్‌ను మేకర్స్ దాదాపు ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. 'మ్యాడ్', '8 వసంతాలు' వంటి వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేకంగా గూడుకట్టుకున్న ఈ టాలెంటెడ్ భామ, ఇటీవల 'రోమాంచకం' సినిమాతో కూడా ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు ఏకంగా వేణు యెల్దండి దర్శకత్వంలో వస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో ఛాన్స్ కొట్టేయడంతో ఈ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో అనంతిక కూడా జాయిన్ కాబోతున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి మేకర్స్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



సినిమా సింగిడి
Cinma Singidi

గురువారం
17-9-2026

## నటుడు అనంత్‌నాగ్‌కు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు..

**అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ**

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యున్నత పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు 2024 సంవత్సరానికి గాను అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు కన్నడ మూడీ ఇండస్ట్రీతో పాటు భారతీయ సినిమాకు చేసిన చిరస్మరణీయ సేవలను గుర్తించి, ప్రముఖ దిగ్గజ నటుడు అనంత్ నాగ్ ను ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లుగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అనంత్ నాగ్ తన మొత్తం కెరీర్‌లో 300లకు పైగా సినిమాల్లో నటించి అందరి మన్ననలను పొందారు. కేవలం కన్నడలోనే కాకుండా వివిధ భాషల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ, తన సహజమైన నటనతో దశాబ్దాలుగా ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఈనెల 22న గుజరాత్‌లోని కేవాడియాలో జరిగే 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆ పురస్కారాన్ని అనంత్ నాగ్‌కు ప్రదానం చేయనున్నారు.



ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు.. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైన అనుభవజ్ఞులైన నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంత్ నాగ్ ఓ అసాధారణమైన నటుడని.. ఆయన అంకితభావం, అద్భుతమైన నటనా ప్రతిభే ఆయనను ఈ అత్యున్నత పురస్కారానికి అర్హుడిని చేశాయని కొనియాడారు. భారతీయ సినీ రంగానికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ప్రధాని ప్రశంసించారు.

వింత తీర్పు.. భారీ చోరీ కేసులో

## టీవీ స్టార్‌కి పరిహారం



అప్పుడప్పుడు వింత వింత తీర్పులు కోర్టుల్లో కనిపిస్తుంటాయి. టీవీ స్టార్ కేసులో ఇప్పుడు అలానే ఓ తీర్పు వెలువడింది. పదేళ్ల క్రితం భారీ చోరీ జరిగి కోట్లు విలువ చేసే నగలన్నీ దొంగలు ఎత్తుకెళ్లిపోతే.. కేవలం రూ.110 మాత్రమే పరిహారంగా కోర్టు ప్రకటించింది. ఇప్పుడీ విషయం చర్చనీయాంశమైంది.

అమెరికన్ టీవీ స్టార్ కిమ్ కర్దాషియన్.. 2016లో ఫ్యాషన్ వీక్ కోసం పారిస్ వెళ్లింది. ఓ హోటల్‌లో ఈమె బస చేసిన టైంలో కొందరు దుండగులు.. పోలీసుల్లా వేషం వేసుకుని వచ్చారు. ఈమెని కట్టేసి బెదిరించారు. తర్వాత 6 మిలియన్ డాలర్ల విలువైన నగలని దోచుకెళ్లారు. వీటిలో ఓ వజ్రపు ఉంగరం కూడా ఉంది. అప్పటి లెక్కల ప్రకారం వీటి విలువ భారత కరెన్సీలో రూ.50-60 కోట్ల వరకు ఉండొచ్చు. గతేడాది ఈ కేసులో ఎనిమిది మంది దోషులుగా తేలారు. నిందితుల్లో పలువురు వయసైపోయిన వాళ్లు కూడా ఉండటంతో ఫ్రాన్స్‌లో వీరికి 'గ్రాండ్‌పా రాబర్స్' అనే పేరు వచ్చింది.
తాజాగా ఈ కేసులో తీర్పు వెలువడింది. పారిస్ కోర్ట్.. కిమ్ కర్దాషియన్‌తో పాటు ఈమె స్టైలిస్ట్ సిమోన్‌కి 1 యూరో(భారత కరెన్సీలో రూ.110.80) పరిహారం చెల్లించాలని నిర్ణయించింది. ఈ మొత్తం కిమ్ స్వయంగా కోరిందే కావడం విచిత్రం. ఇంత తక్కువ మొత్తాన్ని కిమ్ పరిహారంగా కోరడం వెనక ఓ కారణం కూడా ఉంది. ఈ తీర్పు తనకొచ్చే పరిహారం గురించి కాకుండా బాధ్యతని నిర్వర్తించడం, తమకు జరిగిన నష్టాన్ని గుర్తించడం గురించి అని ఈమె పేర్కొంది. మరోవైపు ఈ దోపిడి జరిగిన టైంలో హోటల్‌లో పనిచేసిన మాజీ రిసెప్షనిస్ట్‌కి 109,516 యూరోలు పరిహారంగా ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. దాడి జరిగిన హోటల్‌కు 50,000 యూరోలు పరిహారం ఇవ్వాలని కూడా తీర్పు చెప్పింది.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737